
'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 125

శుక్రవారం 20-1-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'క్రాస్ ఓవర్'కు భారత్

ప్రపంచకప్ హాకీ టోర్నీ చివరి లీగ్‌లో 4–2తో వేల్స్‌పై విజయం - 13లో



మార్కెట్లకు మాంద్యం భయం

61 వేల దిగువకు సెన్సెక్స్.. నిఫ్టీకి 58 పాయింట్ల నష్టం - 13లో



మోదీయే బాధ్యుడు!

గుజరాత్ మత ఘర్షణలకు మోదీయే బాధ్యుడంటూ బీబీసీ ప్రసారం చేసిన డాక్యుమెంటరీ వివాదాస్పదంగా మారింది.

వివరాలు 6లో ▸



న్యూజిలాండ్ ప్రధాని రాజీనామా

న్యూజిలాండ్ ప్రధాని జెసిండా తన పదవికి రాజీనామా చేశారు. పదవికి ఇక న్యాయం చెయ్యలేనంటూ ఆమె తప్పుకున్నారు.

వివరాలు 6లో ▸

ఏపీ లోనూ విదేశీ కోర్సులు

ప్రఖ్యాత కాలేజీల కరిక్యులమ్ రాష్ట్రంలోనూ అమలు

ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం

- మన విద్యార్థులకు గరిష్ట ప్రయోజనం కల్పించే వాటిని పరిశీలించండి
- వాటిని ఇక్కడా అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి పెట్టండి
- ఆయా జిల్లాల్లోని పరిశ్రమలకు అనుగుణంగా కోర్సులు
- స్వయం ఉపాధికి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వంటి సంస్థలతో టైఅప్
- ఉన్నత విద్యా శాఖలోని ఖాళీ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- వర్సిటీల్లో రిక్రూట్‌మెంట్‌కు ప్రత్యేక బోర్డుపై ఆలోచన
- ప్రతి విద్యా సంస్థకు న్యాక్ అక్రిడిటేషన్ తప్పనిసరి
- నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 స్కిల్ సెంటర్లు
- కోడింగ్, క్లౌడ్ సర్వీసెస్ లాంటి డిమాండ్ ఉన్న కోర్సులపై దృష్టి



"విద్యార్థులకు సర్టిఫికేషన్ కోర్సుల ద్వారానే ఎంప్లాయ్‌మెంట్ పెరుగుతుంది. సోలార్ పార్కులు, సోలార్ మోటార్లు, ప్యానల్స్ రిపేరు వంటి వాటిలో నైపుణ్యం కొరతను అధిగమించేలా ప్రతి నియోజకవర్గంలో స్కిల్ సెంటర్లు అందుబాటులో ఉండాలి. వీటిలో ఈ దిశగా కోర్సులు, కరిక్యులమ్, శిక్షణ ఉండాలి. వచ్చే జూన్ నాటికి ఈ తరహా కోర్సులు ఏర్పాటు చేయాలి. కళాశాలలకు అనుమతుల విషయంలో యూనిఫామ్ పాలసీ ఉండాలి."

- సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: విదేశాల్లోని ప్రముఖ విద్యా సంస్థలు అక్కడి విద్యార్థులకు అందిస్తున్న వివిధ కోర్సులను రాష్ట్రంలోని విద్యార్థులకు కూడా అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా కోర్సులు మన విద్యార్థులకు ఏమేరకు గరిష్ట ప్రయోజనం కల్పిస్తాయో పరిశీలించి, వాటిని ఇక్కడ కూడా అమల్లోకి తీసుకురావడంపై దృష్టి సారించాలని సూచించారు. తద్వారా రాష్ట్ర విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నత విద్యా శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిగ్రీ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థుల నైపుణ్యాలను పెంచాలని, ఈ దిశగా వివిధ కోర్సుల పాఠ్య ప్రణాళికల్లో సమగ్రత తేవాలని సూచించారు. ఉన్నత విద్యా సంస్థల్లోని కోర్సుల పాఠ్య ప్రణాళికను ఆయా జిల్లాల్లో ఉన్న

మిగతా 2వ పేజీలో ▶

నడిరోడ్డుపై వేధింపులు

ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌తో అసభ్యంగా ప్రవర్తించిన తాగుబోతు

మహిళల భద్రతను తనిఖీ చేస్తుండగా ఘటన



■ దేశ రాజధానిలో తెల్లవారుజామున మహిళల భద్రతను తనిఖీ చేస్తున్న ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్‌తోనే ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. అతన్ని పట్టుకోబోగా కారు అద్దం పైకెత్తాడు. కార్ డోర్‌కు, అద్దానికి మధ్య స్వాతి చేయి ఇరుక్కోగా.. ఆమెను అలాగే కొన్ని మీటర్ల దూరం ఈడ్చుకెళ్లాడు. అదృష్టవశాత్తు ఆమె చేతిని విడిపించుకోగలిగింది.

- వివరాలు 6లో

కేంద్రం స్పందన సరిగా లేదు

■ రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ లైంగికంగా వేధిస్తున్నాడంటూ తాము చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నామని.. ఆధారాలున్నాయని భారత టాప్ రెజ్లర్లంతా పునరుద్ఘాటించారు. ప్రభుత్వ స్పందన సరిగ్గా లేదని.. బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదు చేయించి జైలుకు పంపిస్తామన్నారు.

- వివరాలు 13లో



అభివృద్ధే మాకు ముఖ్యం




"మేం అభివృద్ధిపైనే దృష్టి పెడతాం. ఇతర పార్టీల మాదిరిగా ఓటు బ్యాంకు రాజకీయాలు చేయట్లేదు. కేంద్రంలో, రాష్ట్రాల్లో ఒకే పార్టీ అధికారంలో ఉంటే ఎంతో మేలు చేకూరుతుంది. డబుల్ ఇంజన్ ఉంటే డబుల్ లాభం, డబుల్ సంక్షేమం, డబుల్ వేగంతో అభివృద్ధి. ఈ లాభాలేమిటో తెలిపేందుకు కర్ణాటక చక్కని ఉదాహరణ."

- కర్ణాటకలో ప్రధాని మోదీ

6లో

కరెంట్ షాకుల్లేవ్



10లో

- గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు డిస్కమ్‌ల ఊరట
- 2023–24 ఏఆర్ఆర్‌పై విశాఖలో మొదలైన ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ
- ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు మాత్రమే టారిఫ్ మార్చాలని డిస్కమ్‌ల వినతి
- రాష్ట్రవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న వినియోగదారులు
- సబ్సిడీలపై రాజకీయ విమర్శలు నిరాధారమన్న జస్టిస్ నాగార్జునరెడ్డి

ఇదం జగత్



అభివృద్ధి వ్యయం పరుగులు

- రాష్ట్రంలో వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, సామాజిక సేవల వ్యయం ఏటా పెరుగుదల
- తగ్గుతున్న వడ్డీల చెల్లింపులు, అభివృద్ధియేతర వ్యయాలు
- ఆర్థిక వ్యవహారాలు, బడ్జెట్లపై ఆర్బీఐ అధ్యయన నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అభివృద్ధి వ్యయం గత మూడేళ్లుగా పెరుగుతుండగా అభివృద్ధియేతర వ్యయం ఏటా తగ్గుతోందని ఆర్బీఐ అధ్యయన నివేదిక వెల్లడించింది. వడ్డీల చెల్లింపుల వ్యయం కూడా మూడు ఆర్థిక సంవత్సరాల నుంచి తగ్గుతోందని పేర్కొంది. రాష్ట్రాల ఆర్థిక వ్యవహారాలు, బడ్జెట్లపై రూపొందించిన అధ్యయన నివేదికను ఆర్బీఐ విడుదల చేసింది. 2020 – 21 నుంచి 2022 – 23 వరకు ప్రధాన ఆర్థిక సూచికలను విశ్లేషించింది. సామాజిక సేవలు, ఆర్థిక సేవల వ్యయం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపింది. సామాజిక, ఆర్థిక అభివృద్ధి కార్యకలాపాలపై వెచ్చించే నిధులను అభివృద్ధి వ్యయంగా పరిగణించాలని పేర్కొంది. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య తదితరాలపై చేసే వ్యయాన్ని అభివృద్ధి వ్యయంగా పరిగణిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు ఆర్థిక సంవత్సరాల నుంచి వైద్యం, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం..

మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా...

యోగి వేమనకు సీఎం జగన్ పుష్పాంజలి



సాక్షి, అమరావతి: యోగి వేమన జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం యోగి వేమన జయంతి నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. యోగి వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే జీవో కూడా జారీ చేసింది.

సీఎంను కలిసిన ఏపీఎన్జీవోస్ అసోసియేషన్



ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి, ప్యానల్ సభ్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ప్రభుత్వ సలహాదారు(ఉద్యోగుల సంక్షేమం) ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పి.పురుషోత్తంనాయుడు, డి.వి.రమణ, పి.కృష్ణ, సీహెచ్.శ్రీనివాసరావు తదితర నేతలు ఉన్నారు.

ఏపీలోనూ విదేశీ కోర్సులు

▶ మొదటి పేజీ తరువాయి

పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా జాబ్ ఓరియెంటెడ్‌గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సర్టిఫైడ్ ఆన్‌లైన్ వర్టికల్ కోర్సులను ఈ పాఠ్య ప్రణాళికలో భాగం చేయాలని చెప్పారు. ప్రఖ్యాత కాలేజీలు అనుసరిస్తున్న పాఠ్య ప్రణాళికలను కూడా పరిశీలించి, రాష్ట్రంలో కూడా అటువంటి పాఠ్య ప్రణాళికలను అమలు చేయాలన్నారు. స్వయం ఉపాధిని కల్పించే కోర్సుల కోసం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎన్ఎస్ఈ) వంటి సంస్థలతో అనుసంధానం (టైఅప్) చేసుకోవాలని సూచించారు. రిస్క్ అనాలసిస్, రిస్క్ మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్ వంటి కోర్సులపై దృష్టి పెట్టాలన్నారు. ఈ తరహా కోర్సుల వల్ల డిగ్రీ పూర్తి కాగానే విద్యార్థులకు స్వయం ఉపాధి అందుతుందని చెప్పారు. వచ్చే జూన్ కల్లా పాఠ్య ప్రణాళికలో ఈ కోర్సులు భాగం కావాలన్నారు. ఈ సమీక్షలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

త్వరితగతిన నియామకాలు

- ఉన్నత విద్యా శాఖలో 2 వేలకు పైగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాం. ఈ ఖాళీలను త్వరగా భర్తీ చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఇప్పటికే చేపట్టిన నోటిఫికేషన్లకు సంబంధించిన కోర్టు కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకుని, జూన్ కల్లా నియామక ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి.
- ఉన్నత విద్యా శాఖలో పెద్ద ఎత్తున సంస్కరణలు తీసుకొస్తున్న నేపథ్యంలో సిబ్బంది నియామకాలు త్వరితగతిన చేపట్టాలి. యూనివర్సిటీల్లో రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయడం గురించి ఆలోచించాలి. సమర్థులైన బోధన సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాలి. తద్వారా విశ్వవిద్యాలయాల్లో బోధన ప్రమాణాలను పెంచేందుకు అవకాశముంటుంది. ట్రిపుల్ ఐటీలలో సిబ్బంది నియామకం, ఇతర పెండింగ్ అంశాలను సత్వరమే పరిష్కరించాలి.

కాలేజీలు ప్రమాణాలు పెంచుకునేలా చేయూత

- రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థలన్నింటికీ న్యాక్ తదితర సంస్థల అక్రిడిటేషన్ తప్పనిసరిగా ఉండాల్సిందే. ఉన్నత విద్యా శాఖ పరిధిలోని ప్రతి కాలేజీలో కూడా బోధనపరంగా, వసతుల పరంగా నాణ్యత పెరగాలి. ఈ దిశగా ప్రతి విద్యా సంస్థ కూడా నాక్ అక్రిడిటేషన్ సాధించాలి.
- కాలేజీలు ప్రమాణాలు పెంచుకునేలా మూడేళ్ల పాటు వారికి చేయూతనివ్వాలి. ఒక్కో ఏడాది ఒక్కో లక్ష్యాన్ని అందుకుంటూ మూడేళ్లలో అక్రిడిటేషన్‌కు వీలుగా ప్రమాణాలు పెంచుకోవాలి. మూడేళ్ల తర్వాత కచ్చితంగా ఉన్నత విద్యాశాఖలోని విద్యా సంస్థలు న్యాక్ అక్రిడిటేషన్ సాధించాలి. అలా సాధించలేని పక్షంలో సంబంధిత కాలేజీల గుర్తింపును రద్దు చేయాలి. అప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది.
- కళాశాలల్లో కోర్సులన్నీ నేటి అవసరాలకు తగిన విధంగా రూపొందించాలి. వివిధ కోర్సులకు సంబంధించిన కరిక్యులమ్ అందించే బాధ్యత స్కిల్ యూనివర్సిటీ తీసుకోవాలి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున రాష్ట్రంలో 175 స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం.
- ఆయా జిల్లాల్లో అందుబాటులో ఉన్న పరిశ్రమలకు అనుగుణంగా కోర్సులు ఏర్పాటు చేయాలి. ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖలు కలిసి కరిక్యులమ్ రూపొందించాలి. హై ఎండ్ స్కిల్స్‌లో భాగంగా సాఫ్ట్‌వేర్ స్కిల్స్‌ను కూడా అభివృద్ధి చేయాలి. కోడింగ్, క్లౌడ్ సర్వీసెస్ లాంటి డిమాండ్ ఉన్న కోర్సులపై దృష్టి పెట్టాలి.

సెంట్రల్ ఆంధ్రాలో అకడమిక్ స్టాఫ్ కాలేజ్

- బోధనా సిబ్బంది సామర్థ్యం మెరుగుపరచడానికి తిరుపతి, విశాఖపట్నంలలో ఉన్న అకడమిక్ స్టాఫ్ కాలేజీలను బలోపేతం చేయాలి. వీటితో పాటు సెంట్రల్ ఆంధ్రా పరిధిలో ఒక చోట అకడమిక్ స్టాఫ్ కాలేజీ ఏర్పాటు చేయాలి.
- కొన్ని ప్రైవేట్ బీఈడీ కాలేజీల్లో బోధన, వసతులు తీసికట్టుగా ఉన్నాయని.. మరికొన్ని కాలేజీలు మోసపూరిత చర్యలకు దిగుతున్నాయని చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆయా కాలేజీల్లోని బోధన సిబ్బంది, వసతి, సౌకర్యాలను ప్రమాణంగా తీసుకోవాలి. అందులో చదివే విద్యార్థుల హాజరును మరొక ప్రమాణంగా తీసుకుని ఆయా కాలేజీలపై ఒక నిర్ణయానికి రావాలి.

డ్రాపవుట్లకు తావులేకుండా చర్యలు

- పిల్లలు చదువులు ప్రారంభించిన తర్వాత ఏ దశలోనూ డ్రాప్ అవుట్ అన్న పరిస్థితే రాకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంది. పిల్లలను బడికి పంపితే చాలు.. నేరుగా తల్లి అకౌంట్‌లోకి అమ్మ ఒడి పథకం ద్వారా డబ్బు జమ చేస్తోంది. టెన్త్ తర్వాత ఐటీఐ, పాలిటెక్నిక్ వైపు వెళ్తున్న వారికి కూడా విద్యా దీవెన, వసతి దీవెన అమలు చేస్తోంది.
- మెడిసిన్, ఇంజనీరింగ్ వంటి ఇతర చదువులు చదువుతున్న వారికి పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందిస్తోంది. సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను దేశంలో అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. అలాగే వసతి దీవెన కూడా అందిస్తున్న రాష్ట్రం ఏపీనే. ఈ కార్యక్రమాల వల్ల ఎక్కడా చదువులు మానేయాల్సిన పరిస్థితి అన్నది లేదు. ఫలితంగా జీఈఆర్ (గరిష్ట చేరికల నిష్పత్తి) తప్పకుండా పెరుగుతుంది. సుస్థిర ఆర్థిక ప్రగతి లక్ష్యాల సాధనలో ఇవి ప్రతిబింబించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, విద్యా శాఖ సలహాదారు సాంబశివారెడ్డి, ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, ఆర్జీయూకేటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి, కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ భాస్కర్ , ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఓలా నుంచి అమెజాన్ వరకు..

అనిశ్చిత మార్కెట్ పరిస్థితుల కారణంగా స్వదేశీ సామాజిక మాధ్యమ కంపెనీ షేర్‌చాట్ (మొహల్లా టెక్ ప్రైవేట్ లిమిటెడ్) 20 శాతం వర్క్‌ఫోర్స్‌ను లేఆఫ్ చేసింది. దాదాపు 500 మంది ఉద్యోగులపై దీని ప్రభావం పడింది.

ట్విటర్, గూగుల్, స్నాప్, టైగర్ గ్లోబల్ లాంటి కంపెనీలు దాదాపు 2,300 మంది ఉద్యోగుల్ని తొలగించాయి.

ఓలా (200 మంది తొలగింపు) వంటి కంపెనీలు కూడా ఉద్యోగుల్ని తొలగించగా, వాయిస్ ఆటోమేటెడ్ స్టార్టప్ స్కిట్.ఏఐ ఈ నెలలో చాలా మందిని తొలగించింది.

నిత్యావసర సరుకుల డెలివరీ సంస్థ 'దంజో' తన కాస్ట్ కటింగ్ (ఖర్చు తగ్గింపు) చర్యల్లో భాగంగా 3 శాతం వర్క్‌ఫోర్స్‌ను తొలగించింది.

అమెజాన్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 18 వేల మందిని (భారత్‌లో వెయ్యి మంది) లే ఆఫ్ చేసింది.

రోజుకు 1,600 మంది!

ఐటీ కొలువుపై మాంద్యం వేటు

- లే ఆఫ్‌లు ప్రకటిస్తున్న భారతీయ, బహుళ జాతి కంపెనీలు, స్టార్టప్‌లు
- ఖర్చు తగ్గింపు చర్యల్లో భాగంగా ఉద్యోగుల తొలగింపు
- కొత్త ఏడాది తొలి 15 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా 25 వేలమందికి ఉద్వాసన
- 2022లో 1,54,336 మందిని తొలగించిన వెయ్యికి పైగా కంపెనీలు
- లే ఆఫ్స్ ట్రాకింగ్ సైట్ 'లేఆఫ్స్.ఎఫ్‌వైఐ' తాజా నివేదిక వెల్లడి



6 నెలల దాకా..

ఆర్థిక మాంద్యం ఎదురైనప్పుడు పెద్ద కంపెనీలతో పాటు స్టార్టప్ కంపెనీలు కూడా కుదుపునకు గురవుతాయి. లే ఆఫ్‌ల ట్రెండ్ మూడు నుంచి ఆరునెలల దాకా కొనసాగే సూచనలున్నాయి. గత 3,4 ఏళ్లుగా ఐటీ కంపెనీల్లో సరైన పద్ధతులు, విధానాల్లో హైరింగ్ జరగనందున ఉద్యోగులపై అధిక ప్రభావం పడనుంది. రిక్రూట్‌మెంట్ సవ్యంగా జరగకపోవడం, భారీ ప్యాకేజీలు ఆఫర్ చేయడం వంటివి జరిగినపుడు రెండేళ్లకోసారి దిద్దుబాట్లు జరుగుతుంటాయి. ప్రస్తుత పరిణామాలను అందులో భాగమని భావించవచ్చు. ఆశించిన మేర యూఎస్, యూకే, ఇతర దేశాల నుంచి ఔట్‌సోర్సింగ్ బిజినెస్, బ్యాకెండ్ సపోర్ట్ వంటివి రాకపోవడం మన దేశంపై ప్రభావం చూపిస్తుంది. పని తీరు సరిగాలేని ఉద్యోగులపై వేటుపడొచ్చు.

– డా.బి.అపర్ణా రెడ్డి, హెచ్‌ఆర్ నిపుణురాలు

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక మాంద్యం నేపథ్యంలో టెకీలకు 'డేంజర్ బెల్స్' మోగుతున్నాయి. ఐటీ రంగానికి సంబంధించి 2022లోనే ప్రారంభమైన ప్రతికూల పరిస్థితులు 2023 లోనూ కొనసాగే సూచనలు కన్పిస్తున్నాయి. ఖర్చు తగ్గించుకునేందుకు మన దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఐటీ కంపెనీలు లే ఆఫ్‌లు కొనసాగిస్తున్నాయి. గత ఏడాది (2022) కాలంలో ప్రపంచంలోని వెయ్యికి పైగా కంపెనీలు మొత్తం 1,54,336 మందికి ఉద్వాసన పలికాయి. ఇక కోటి ఆశలతో కొత్త ఏడాది మొదలైన తొలి పదిహేను రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా 91 కంపెనీలు లే ఆఫ్‌లు ప్రకటించాయి. దీంతో 25 వేల దాకా ఐటీ ఉద్యోగులు అంటే.. రోజుకు సగటున 1,600 మందికి పైగా టెకీలు లే ఆఫ్‌ల బారిన పడ్డారు. గతేడాది నుంచి లేఆఫ్‌లు ప్రకటించిన వాటిలో అనేక భారతీయ కంపెనీలతో పాటు పలు స్టార్టప్‌లు కూడా ఉన్నట్టు తేలింది. లే ఆఫ్స్ ట్రాకింగ్ సైట్ 'లే ఆఫ్స్.ఎఫ్‌వైఐ' తన తాజా నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది.

తొలి ప్రభావం ఐటీ రంగంపైనే..!



డి. పాపారావు, ఆర్థికరంగ విశ్లేషకులు

ఆర్థిక రంగం ఒడిదుడుకులకు గురవుతున్నప్పుడు, ఆర్థిక మాంద్యం పరిస్థితులు తలెత్తుతున్నప్పుడు మొదటగా ప్రభావం పడేది ఐటీ రంగం పైనే. ఐటీ కంపెనీలు ఉద్యోగుల్ని తొలగించడానికి ఇదే కారణం. ఆర్థికరంగ స్లోడౌన్‌కు సూచికగా ప్రస్తుత పరిణామాలను పరిగణించాలి. 2001లోనూ ఇలాంటి పరిస్థితులు సంభవించాయి. ఇండియన్ ఐటీ కంపెనీలకు ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్‌లు తగ్గిపోతాయి కాబట్టి ఖర్చు తగ్గించుకునేందుకు లేఆఫ్‌ల వైపు మొగ్గు చూపుతాయి. ఆర్థికమాంద్యం ఏర్పడుతుందనే సంకేతాలు రాగానే ఐటీ కంపెనీలు ముందుగా ఉద్యోగుల భారాన్ని తగ్గించుకుంటాయి. అలాగే ఇప్పుడు కూడా లాభాల మార్జిన్లు తగ్గిపోయే కొద్దీ ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగా అధిక జీతాలిచ్చే ఉద్యోగుల సంఖ్యను కంపెనీలు కుదించుకుంటున్నాయి. క్యాంపస్ సెలక్షన్లలో భాగంగా ఎంపిక చేసుకున్నవారి నియామక ఉత్తర్వులను సైతం కొన్ని సంస్థలు రద్దు (క్యాన్సిల్) చేస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో పథకాలు భేష్!

- బ్రెజిల్ సోషల్ సర్వీస్ టీం ప్రశంసలు
- ఎన్టీఆర్ జిల్లా మాగల్లులో పర్యటించిన బృందం

నందిగామ: ఆంధ్రప్రదేశ్‌లో పేదవారిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అమలు చేస్తున్న పథకాలు చాలా బాగున్నాయని బ్రెజిల్‌కు చెందిన సోషల్ సర్వీస్ బృందం ప్రతినిధి మలీష చెప్పారు. దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న వారి పరిస్థితి, వారు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు, గ్రామీణ ప్రాంతాల్లోని పరిస్థితులను అధ్యయనం చేసేందుకు బ్రెజిల్‌కు చెందిన ఈ బృందం గురువారం ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం మాగల్లు గ్రామానికి వచ్చింది. మలీష తదితరులు సహాయకుడు జయరాజు, కేడీసీసీబీ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ సచివాలయం, గ్రామీణ బ్యాంకులు, జగనన్న లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లు, .గ్రామంలో ప్రజలు నివసిస్తున్న తీరు, దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న వారి పరిస్థితులపై అధ్యయనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బ్రెజిల్‌లో ఉచితంగా స్థలం ఇచ్చి, ఇల్లు కట్టించే పద్ధతి లేదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో దారిద్య్ర రేఖకు దిగువన ఉన్నవారికి ఉచితంగా ఇల్లు కట్టించి ఇవ్వడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే అన్ని ప్రభుత్వ సేవలు అందడం అభినందనీయమన్నారు. పేదవారి అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అడిగి తెలుసుకొని అభినందించారు.



గ్రామంలోని పాఠశాలను పరిశీలిస్తున్న మలీష

విదేశీ అతిథులు.. వచ్చెనండి

- వెలమవారిపాలెంలో పక్షుల కిలకల రావాలు
- వైట్‌స్టార్క్ జాతిపక్షుల వలసకు వందేళ్లకుపైగా చరిత్ర
- జనవరి సంక్రాంతి పండుగ నుంచి ఆరునెలలు గ్రామంలోని చెట్లపై మకాం
- కంటికి రెప్పలా కాపాడుకుంటున్న గ్రామ ప్రజలు



సరస్సు మధ్యలో వేట విరామం తీసుకుంటున్న విహంగాలు

బల్లికురవ: ప్రకృతి మనకు దేవుడిచ్చిన వరం. మానవ జీవితోపాటు పశుపక్ష్యాదులు కూడా మనతోపాటే ఉంటున్నాయి. ఎక్కడో దేశం కాని దేశానికి వచ్చి పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి వైట్‌స్టార్క్ జాతి పక్షులు. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వెలమవారిపాలెం గ్రామంలో ఆరునెలలపాటు విదేశీ పక్షుల రాకతో ప్రతి రోజూ పండగే. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలు, మండలాల నుంచి పర్యాటకులు పక్షులను చూసేందుకు వస్తుండటంతో అతిథులతో సందడిగా మారింది. ఎక్కడ కొరియా, నైజీరియా.. ఎక్కడ వెలమవారిపాలెం సుమారు కొన్ని లక్షల కిలో మీటర్లు ప్రయాణిస్తూ అతిథులుగా వచ్చి ఇక్కడి ఆతిథ్యం స్వీకరిస్తున్నాయి. ప్రతి సంవత్సరం జనవరి మొదటి, రెండు వారాల్లో ఆడపక్షులు గ్రామానికి వచ్చి చెట్లపై గూళ్లు కట్టుకుని నివాసం ఏర్పాటు చేసుకుంటాయి. ఇక్కడ నివసించే ఆరునెలలు గుడ్లను పొదిగి పిల్లలకు రెక్కలు రాగానే జూలై మాసాంతంలోపు స్వదేశానికి తిరిగి వెళ్తాయి. 4 నుంచి 5 అడుగుల ఎత్తు ఉండే ఈ పక్షులు గుడ్డు నుంచి బయటకు రాగానే తెలుపు రంగులో ఆరు నెలలకు ఐదు రంగుల్లో కనిపిస్తాయి.

సుమారు 460 పక్షులు..

ఆడపక్షులు గుడ్లు పెట్టి పొదిగే దశలో మగ పక్షులే గ్రామంతోపాటు పరిసరాల్లో 50 కిలోమీటర్ల దూరం వరకు వెళ్లి ఆహారం సేకరించి తెచ్చి పెడుతున్నాయని గ్రామస్తులు సాక్షికి తెలిపారు. గ్రామస్తులు ఎవరిని పలకరించినా తమ తాత, ముత్తాతల కాలం నుంచి పక్షులతో తమకు అనుబంధం ఉందని, కన్న బిడ్డలతో సమానంగా ఆదరిస్తున్నట్లు చెప్పారు. పక్షులకు మంచినీటికి గ్రామ పంచాయతీ నిధులతో గ్రామంలో కుంట ఏర్పాటు చేశారు.



పక్షుల విన్యాసాలు

నాలుగేళ్లుగా పక్షులకు పండగ..

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక విస్తారంగా వర్షాలు కురవటం, పంటలు పండటంతో పక్షులకు తాగునీటికి, ఆహారానికి కొరతలేదు. 2019కి ముందు 5 సంవత్సరాలపాటు పక్షులు అన్ని రకాలుగా ఇబ్బందులకు గురైనట్లు గ్రామస్తులు వివరించారు. గ్రామంలో చింత చెట్లు తగ్గటంతో వేప, తుమ్మ చెట్లను ఆవాసంగా మార్చుకున్నాయి. గ్రామం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిలో చింతచెట్లు పెంచి పక్షులకు ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా మార్చాలి

పక్షులకు గ్రామంలో రక్షణలేదు. నాలుగేళ్ల కిందట ఓ ముఠా రాత్రి నిద్రిస్తున్న పక్షులను గోతాల్లో వేసి మాంసం దుకాణాలకు విక్రయించేందుకు తరలించే ప్రయత్నం చేయగా పక్షుల అరుపులకు నిద్రలేచి అడ్డుకున్నాం. ఈ విషయాలను ఇటీవల గ్రామానికి వచ్చిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు విన్నవించాం. పక్షుల రక్షణకు వాచ్‌మన్‌ను నియమించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని వేడుకోగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

– టీ.నరేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు

బంధువులుగానే భావిస్తున్నాం..

తరాలుగా పక్షులతో అనుబంధం ఉంది. సంక్రాంతి పండుగకు ఆడపిల్లలు, అల్లుళ్లు వచ్చినట్లుగా మా గ్రామానికి నైజీరియా, కొరియా పక్షులు వచ్చి సందడి చేస్తున్నాయి. పర్యాటక కేంద్రంగా అభివృద్ధితోపాటు ప్రభుత్వ భూముల్లో చెట్ల పెంపకాన్ని చేపట్టటంతోపాటు గ్రామానికి వచ్చే ప్రధాన మూడు రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

– నూనె ప్రభుదాసు, సర్పంచ్

చుట్టూ నీరు.. మధ్యలో ఊరు

- ఇరకం దీవి ప్రత్యేకం
- ప్రకృతి ప్రియులకు స్వర్గధామం
- పడవ ప్రయాణమే ఏకైక మార్గం
- పర్యాటకంతోనే ఉపాధి

చిత్తూరు నుంచి తిరుపతి ప్రత్యేక జిల్లాగా వేరుపడ్డాక ఈ ప్రాంతానికి సముద్రంతో పాటూ ఒక దీవి వచ్చి చేరింది. ఆ దీవి పేరు ఇరకం. ఇది తడ మండలంలోని పులికాట్ సరస్సు మధ్యలో ఉంది. చుట్టూ నీరు.. మధ్యలో ఊరు. ఈ దీవిలో పర్యాటకులను ఆకట్టుకునే ఎన్నో ప్రత్యేకతలున్నాయి. అక్కడి ప్రయాణం ఓ మధురానుభూతిని మిగుల్చుతుంది. చల్లటి గాలులు.. తేలికపాటి అలల మధ్య సాగే పడవ ప్రయాణం.. గాలివాటున దూసుకెళ్లే తెరచాప పడవలు.. ఓవైపు ఎగురుతూ కనిపించే విదేశీ పక్షులు.. ఈ దృశ్యాలు ఎంతో ఆహ్లాదంగా.. అద్భుతంగా కనిపిస్తాయి. మరో విశేషమేమంటే.. చుట్టూ ఉప్పునీరున్నా.. రెండు గ్రామాలున్న ఈ దీవిలో తాగేందుకు మంచినీరు పుష్కలంగా లభించడం ఇక్కడ ప్రత్యేకత. ఈ ప్రాంతానికి పర్యాటక శోభ తేవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

తడ(తిరుపతి జిల్లా): కొత్తగా ఏర్పడ్డ తిరుపతి జిల్లాకి నెల్లూరు జిలాల్లోని సముద్రం (బంగాళాఖాతం) తడ మండలం పరిధిలోని పులికాట్ సరస్సు, సరస్సు నడుమ ఉన్న అందాల ఇరకం దీవి సొంతమయింది. 4,486 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ దీవిలోని ఇరకం గ్రామంలో మొదలియార్‌లు, హరిజనులు, గిరిజనులతోపాటు తిరువెంకటానగర్ కుప్పంలో సుమారు రెండు వేల మంది కలిగిన మత్స్యకారులు 580 ఇళ్లల్లో జీవిస్తూ ఉన్నారు. ఈ దీవిలో 2200 ఎకరాల వ్యవసాయభూమి ఉండగా ఇందులో వరిసాగు చేస్తారు. దీవిలో నుంచి 200 మంది విద్యార్థులు ఆరంబాకం, సున్నపుగుంట గ్రామాలకు చదువు కోసం పడవల్లో పులికాట్ సరస్సు మీదుగా రాకపోకలు సాగిస్తూ ఉంటారు.

పడవలో షికారు

మరో వైపు ఈ దీవి వైపు పర్యాటకుల చూపు పడింది. ఆహ్లాదంగా కనిపించే సరస్సుపై పడవలో షికారు తిరగాలంటే మక్కువ చూపుతున్నారు. పండగలు, సెలవు దినాల్లో ప్రకృతి ప్రియులు బీవీపాళెం గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి పడవల ద్వారా ఇరకం వెళతారు. అక్కడ సాయంత్రం వరకు సేదతీరి ప్రకృతి అందాలను ఆస్వాదించి తిరిగి వస్తున్నారు. బీవీపాళెం నుంచి పడవ ద్వారా 11 కిలో మీటర్ల దూరం ఉన్న ఇరకం దీవికి వెళ్లాలంటే పట్టే 40–45 నిమిషాల ప్రయాణం మంచి అనుభూతిని ఇస్తుంది. సరస్సులో చేపల వేట సాగించే తెరచాప పడవలు, అక్కడక్కడ చేపల కోసం కాచుకు కూర్చున్న విహంగాలు, పడవల పక్కనే ఎగిరెగిరి పడుతూ చేపలు చేసే విన్యాసాలు పర్యాటకులకు మంచి ఆహ్లాదాన్ని అందిస్తాయి. ఇరకం తెల్లటి ఇసుకతో నిండిన గ్రామం . నీటి కోసం అక్కడక్కడ తవ్విన దొరువులు, దొరువుల చుట్టూ మొలిచిన మొగలి పొదలు, వెదురు చెట్లు సరికొత్త అనుభవాన్ని అందిస్తాయి.



ఇరకంలో టూరిజం అభివృద్ధికి అనువైన మొనకుప్పం ప్రాంతం

దెబ్బతీసిన ఉప్పునీరు

దశాబ్దాలుగా బంగాళాఖాతం నుంచి పులికాట్ సరస్సుకి నీటిని అందించే ముఖద్వారాలు పూడిపోతూ రావడం, సరస్సుకి సముద్రంద్వారా వచ్చే నీటికి అడ్డుకట్ట పడడంతో సముద్రం, సరస్సు మధ్య నీటితోపాటు రాకపోకలు సాగించే చేపలు, రొయ్యల కదలికలు తగ్గి పోయాయి. దీంతో మత్స్యకారులకు వేట కష్టతరమైంది. కొందరు అత్యాశ పరులు తమ స్వార్థం కోసం సరస్సు చుట్టూ ఉన్న పొర్లుకట్టను ధ్వంసం చేయడంతో ఉప్పునీళ్లు పొలాల్లోకి చేరి పంటలు దెబ్బతిన్నాయి. ఇక్కడ చదువుకైనా, కాన్పుకైనా, పాముకరిచినా, అత్యవసర పరిస్థితిలో అయినా పడవ ప్రయాణం తప్ప మరో దారిలేదు.

పర్యాటక అభివృద్ధికి చర్యలు

ఇరకం దీవిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. సీఎం ఆదేశాల మేరకు సూళ్లూరుపేట శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య ఇరకం దీవితోపాటు బీవీపాళెం, వేనాడు ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆంధ్రా, తమిళనాడు పర్యాటకులు సేద తీరేందుకు బీవీపాళెంలో నిర్మించిన రిసార్టులను టెండర్ల ద్వారా సమర్థులైన వారికి అప్పగించడంతోపాటు ఇరకం దీవిలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టి పర్యాటకులకు వసతులు కల్పిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ఇరకం దీవిలోని ప్రజలకు స్థానికంగానే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించడంతోపాటు వారికి సంబంధించిన భూములకు మంచి గిరాకీ లభించనుంది.



నీళ్ల దొరువులు, మొగలి పొదలు



ఇరకంకి పడవలో వెళుతున్న డీఎస్పీ, ఆర్డీఓ ఇతర అధికారులు(ఫైల్)

పెట్టుబడులకు పోటీలు



ఇరకం దీవిలో పర్యాటక రంగం అభివృద్ధికి పెట్టుబడి దారులు పోటీ పడుతున్నారు. బయటి ప్రాంతాలకన్నా ఇరకంలో మంచి భవిష్యత్తు ఉంటుంది. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానికులకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి మరింత మెరుగుపడుతుంది. ఇరకం దీవి వేనాడు గ్రామం మధ్య సరస్సులో పడవల రాకపోకలకు వీలుగా 400 మీటర్ల మేర వంతెన దానికి అటు ఇటు మరో 400 మీటర్లు రోడ్డు వసతి ఉండేలా మొత్తం 800 మీటర్ల పొడవున 70 కోట్ల వ్యయంతో వంతెన నిర్మించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. పర్యావరణ, వన్యప్రాణి విభాగాల వారి అనుమతులు వస్తే పనులు మొదలవుతాయి.

– కిలివేటి సంజీవయ్య, సూళ్లూరుపేట ఎమ్మెల్యే

ఇరకంలో మంచి వనరులు



చెన్నై, తిరుపతి, నెల్లూరు నగరాలకు సమాన దూరంలో ఉన్న ఇరకం దీవిలో పర్యాటక పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చొరవతో అధికారులు, పెట్టుబడిదారులు ఇరకంలో తరచూ పర్యటనలు చేస్తున్నారు. త్వరలో ఇది కార్యరూపం దాల్చనున్నట్లు తెలుస్తోంది. ఇది పూర్తి అయితే ఇక్కడి యువతకు ఉపాధి లభించనుంది.

– గుణశేఖర్, ఇరకం

క్లుప్తంగా...

ఒకరోజు రాబడిలో ఆర్టీసీ రికార్డు

- టికెట్ల ద్వారా రూ.23 కోట్లు
- కార్గోసేవల ద్వారా రూ.55 లక్షలు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ చరిత్రలోనే ఒకరోజు అత్యధిక రాబడిలో రికార్డు సృష్టించింది. ప్రయాణికుల టికెట్లు, కార్గోసేవల్లో బుధవారం అత్యధిక రాబడి సాధించింది. ఆర్టీసీకి టికెట్ల ద్వారా బుధవారం రూ.23 కోట్ల రాబడి వచ్చింది. ఒకరోజులో అత్యధిక రాబడి ఇదే. సాధారణంగా సంక్రాంతి సీజన్‌లో 50 శాతం అధిక చార్జీలతో బస్సులు నిర్వహించడం ద్వారా ఆర్టీసీకి అధిక రాబడి వస్తుంది. కానీ ఈసారి సాధారణ చార్జీలతోనే ఆర్టీసీ సంక్రాంతి ప్రత్యేక బస్సులు నడిపింది. అయినా గతంలో కంటే రికార్డుస్థాయిలో రూ.23 కోట్ల రాబడి సాధించడం విశేషం. ఇక కార్గోసేవల ద్వారా కూడా ఆర్టీసీ చరిత్రలో అత్యధికంగా బుధవారం రూ.55 లక్షల రాబడి వచ్చింది. గతంలో కార్గో ద్వారా ఒకరోజులో అత్యధిక రాబడి రూ.45 లక్షలే.

సకాలంలో పెన్షన్ ప్రతిపాదనలు సమర్పించాలి

ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్


సాక్షి, అమరావతి: పెన్షన్, జీపీఎఫ్‌లకు సంబంధించి ఉద్యోగులు, డీడీవోలకు (డ్రాయింగ్ అండ్ డిస్బర్సుమెంట్ అధికారులు) గల వివిధ సందేహాలను నివృత్తి చేసేందుకే పెన్షన్-జీపీఎఫ్ అదాలత్‌ను నిర్వహిస్తున్నారని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్ స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఈనెల 19, 20 తేదీల్లో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్, సచివాలయం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పెన్షన్-జీపీఎఫ్ అదాలత్‌లో గురువారం ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన కొంత మంది ఉద్యోగులకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్ల (పీపీవో)ను పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ మాట్లాడుతూ పదవీ విరమణ చేయబోయే ఉద్యోగులు సకాలంలో పెన్షన్ ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జీపీఎఫ్‌కు సంబంధించిన అంశాల్లో ఉద్యోగులు, సంబంధిత డీడీవోలకు గల వివిధ సందేహాలను నివృత్తి చేసే లక్ష్యంతోనే అదాలత్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సాధారణ పరిపాలన శాఖ అదనపు కార్యదర్శి వి.శ్రీనివాసులు మాట్లాడుతూ పొరపాట్లకు ఆస్కారం లేకుండా పదవీ విరమణ చేయబోయే ఉద్యోగులు వారి పెన్షన్ ప్రతిపాదనలను సకాలంలో సమర్పించేందుకు, జీపీఎఫ్ విత్‌డ్రాయిల్సు చేసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుమోటోగా మహిళా ఉద్యోగులపై వేధింపుల ఘటన

సాక్షి, అమరావతి: శాప్‌లో మహిళ ఉద్యోగులపై లైంగిక వేధింపుల ఘటనపై రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ స్పందించారు. ఈ ఘటనపై ఫిర్యాదు రాకపోయినప్పటికీ మీడియా కథనాలను సుమోటోగా స్వీకరించి రెండు రోజుల్లో విచారణ పూర్తి చేస్తామని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళ కమిషన్ భాగస్వామ్యంతో విచారణ చేయాలని శాప్ ముఖ్య కార్యదర్శిని వాసిరెడ్డి పద్మ ఆదేశించారు. విచారణ నివేదికలో వేధింపులు నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగినులు ఎవరైనా వేధింపులకు గురైతే ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని వాసిరెడ్డి పద్మ సూచించారు.

వలంటీర్లంటే వణుకెందుకు?

- దేశమంతా మెచ్చుకున్నా మీరు మారరా?
- రామోజీపై మంత్రి వేణుగోపాలకృష్ణ ధ్వజం



సాక్షి, అమరావతి: సేవాభావంతో ప్రజలకు ఇంటివద్దే సంక్షేమ పథకాలను చేరవేస్తున్న వలంటీర్లపై ఈనాడు తప్పుడు కథనాలను ప్రచురిస్తోందని బీసీ సంక్షేమం, సమాచార శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మండిపడ్డారు. దేశమంతా మెచ్చుకున్న వలంటీర్ల వ్యవస్థ అంటే చంద్రబాబు, రామోజీరావుకు ఎందుకంత భయమని ప్రశ్నించారు. రామోజీరావు నల్ల సిరాతో కాకుండా పచ్చ సిరాతో టీడీపీ కరపత్రికలా నడుపుతున్నారని విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సచివాలయ వ్యవస్థతో విప్లవాత్మక మార్పులు తెచ్చి అర్హులందరికీ సంతృప్త స్థాయిలో పథకాలను అందచేస్తుంటే వలంటీర్ల సేవలను పచ్చ గ్యాంగ్ తట్టుకోలేకపోతోంది. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల ఆగడాల గురించి ఏనాడైనా ఈనాడు స్పందించిందా? టీడీపీ వలంటీర్లైన రామోజీ, రాధాకృష్ణ, బీఆర్ నాయుడు ఇప్పుడు ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు ఘటనలో కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన రామోజీరావు ఆనాడు ఆయన గురించి ఏం రాశారు? ఇప్పుడు ఏం రాస్తున్నారో ప్రజలు గుర్తించాలి. వయసు పెరుగుతున్నా రామోజీ బుద్ధి మారటం లేదు' అని ధ్వజమెత్తారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు సొంత బలంపై నమ్మకం ఉంటే పొత్తుల కోసం ఎందుకు వెంపర్లాడుతున్నారని ప్రశ్నించారు.

ఏటా తగ్గిపోతున్న

జేఈఈ అభ్యర్థులు!



అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు చేసిన వారి సంఖ్య తగ్గుతోందిలా..

ఏడాది	శాతం
2014	83.1
2015	79
2016	78.6
2017	77.4
2018	71.7
2019	71
2020	64
2021	60
2022	60




- సాక్షి, అమరావతి

దేశంలోనే ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ), తదితర జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్, అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. 2017 నుంచి 2022 వరకు గణాంకాలు పరిశీలిస్తే ఇదే విషయం స్పష్టమవుతోంది. ఏటా మెయిన్ పరీక్షకు లక్ష నుంచి లక్షన్నర మంది వరకు తగ్గిపోతున్నారు. జేఈఈ మెయిన్-2023ని జనవరి 26 నుంచి 31 వరకు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ పరీక్షకు రిజిస్ట్రేషన్ల గడువు ఈ నెల 12తో ముగిసింది. జేఈఈ మెయిన్‌కు 2017లో 11,86,454 మంది దరఖాస్తు చేయగా 2022లో ఆ సంఖ్య 10,26,799కు తగ్గింది. ఇక 2017లో 11,22,351 మంది పరీక్షకు హాజరు కాగా 2022 నాటికి వారి సంఖ్య 9,05,590కి పడిపోయింది.


తగ్గుదలకు కారణాలెన్నో..

- ఐఐటీల్లో 16 వేల వరకు.. ఎన్‌ఐటీలు, ఇతర జాతీయ విద్యాసంస్థల్లో మరో 30 వేల వరకు సీట్లు ఉన్నాయి.
- సీట్లకు పోటీ ఎక్కువ ఉండటంతో 50 శాతం మంది దరఖాస్తు చేశామనిపించుకోవడం తప్ప పరీక్షలకు అసలు సిద్ధం కావడం లేదు.
- ఇతర ప్రవేశ పరీక్షల కంటే జేఈఈ చాలా కఠినంగా ఉండడంతో విద్యార్థుల్లో ఆసక్తి తగ్గుతోంది.
- జేఈఈతో పోల్చితే ప్రైవేటు విద్యా సంస్థల పరీక్షలు సులువుగా ఉంటున్నాయి.
- దూరంగా ఉండే ఐఐటీలు, ఎన్‌ఐటీల్లో తమ పిల్లలను చేర్చడానికి తల్లిదండ్రులు వెనుకాడుతున్నారు.
- ఈసారి జేఈఈ షెడ్యూల్ ప్రకటన ఆలస్యం కావడం, విద్యార్థులు కోర్టును ఆశ్రయించినా వాయిదాకు కోర్టు అంగీకరించపోవడం నేపథ్యంలో ఈ ఏడాది కూడా పరీక్షకు హాజరయ్యే వారి సంఖ్య తక్కువగానే ఉండొచ్చు.
- అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు చేసిన వారిలో కూడా పరీక్ష రాస్తున్న వారు 80 శాతం లోపే ఉంటున్నారు.

సంవత్సరాలవారీగా జేఈఈ మెయిన్‌కు అభ్యర్థుల రిజిస్ట్రేషన్, పరీక్షకు హాజరు ఇలా..



అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు, అందులో అర్హత సాధించినవారు ఇలా..



నా రాజకీయ జీవితంలో ఇంత మంచిపాలన చూడలేదు

- వైఎస్ జగన్‌ను ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తారు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



రాష్ట్ర అటవీశాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి/మంగళగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత మంచిపాలన చూడలేదని రాష్ట్ర అటవీ, ఇంధన, పర్యావరణ, శాస్త్ర-సాంకేతిక, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. 2024లో వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో రాష్ట్ర అటవీ శాఖ నూతన కార్యాలయం అరణ్యభవన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి మేలు చేయాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారని, ప్రజలకు ఇంత మంచిచేసిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో గతంలో ఎవరూ లేరని చెప్పారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఈ పాలనను నియంతపాలన అని విమర్శించడం విడ్డూరంగా ఉందని, వారి దూషణలను ఆశీర్వాదంగా తీసుకుంటామని పేర్కొన్నారు. అయ్యన్నపాత్రుడికి పోయేకాలం దాపురించిందని, ముఖ్యమంత్రిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా మాట్లాడేవారికి త్వరలోనే ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. అనంతరం అటవీశాఖ అధికారులతో సమావేశమైన మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ విశాఖ, తిరుపతి జూపార్కుల అభివృద్ధికి డీపీఆర్‌లు సిద్ధం చేసి సెంట్రల్ జూ అథారిటీ నుంచి అవసరమైన అనుమతులను తీసుకోవాలని ఆదేశించారు. ఈ జూపార్కులకు ప్రభుత్వం ప్రత్యేకంగా డైరెక్టర్లను నియమిస్తుందన్నారు. దేశంలోని ఇతర జూలను సందర్శించి, అక్కడ అమలు చేస్తున్న మెరుగైన విధానాలను అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (అటవీశాఖ) నీరబ్‌కుమార్‌ప్రసాద్, అటవీదళాల అధిపతి వై.మధుసూధన్‌రెడ్డి, వన్యప్రాణి విభాగం అదనపు పీసీసీఎఫ్ శాంతిప్రియ పాండే, తిరుపతి సీఎఫ్ నాగేశ్వరరావు, అధికారులు ఏకే నాయక్, ఆర్‌పీ ఖజారియా, బీకే సింగ్, ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎ.కె.ఝా, గోపీనాథ్, రాహుల్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

రామోజీకి మంచి కనిపించదు

- పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మండిపాటు
- ఎలాగైనా చంద్రబాబును గద్దెనెక్కించాలని తాపత్రయం
- ఎండీయూ ఆపరేటర్లకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చెల్లింపు
- పీడీఎస్‌లో రాగులు, జొన్నలు: కమిషనర్ అరుణ్‌కుమార్
- మిల్లర్లకు రూ.200 కోట్లు విడుదల: ఎండీ వీరపాండియన్

సాక్షి, అమరావతి: రామోజీరావు పచ్చ బుద్ధికి ధాన్యం సేకరణలో మంచి కనిపించట్లేదని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. రైతులకు మేలు చేస్తుంటే పనిగట్టుకుని విషం చిమ్మడం, గుడ్డు మీద ఈకలు పీకే యత్నం చేయడం దారుణమన్నారు. గురువారం ఆయన విజయవాడలోని పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎలాగైనా చంద్రబాబును గద్దెనెక్కించి.. దోచుకుని.. దాచుకోవాలనే అజెండాతోనే పచ్చ పత్రికలు పని చేస్తున్నాయని విమర్శించారు. ధాన్యం సేకరణలో నాడు-నేడు పరిస్థితిని గమనిస్తే వాస్తవాలు బోధపడతాయన్నారు. తమ ప్రభుత్వ చర్యలతో ఒక్కో రైతుకు ఎకరాకు రూ.8 వేల వరకు లాభం చేకూరుతోందని వివరించారు. తేమ పేరుతో రైతులను మిల్లులకు పిలిపించి ఇబ్బంది పెడుతున్న మిల్లర్లను ఉపేక్షించేది లేదని, మిల్లు సీజ్ చేయడంతో పాటు బ్లాక్ లిస్టులో పెట్టి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే నాలుగు మిల్లులను సీజ్ చేశామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు మూసి వేయట్లేదని స్పష్టం చేశారు. మార్చి 15లోగా రంగు మారిన ధాన్యాన్ని సైతం సేకరిస్తామన్నారు. ఎండీయూ ఆపరేటర్లకు వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా ఇన్సూరెన్స్ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేందుకు సిద్ధమైందన్నారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. పీడీఎస్‌లో బియ్యం బదులు రెండు కేజీల రాగులు, జొన్నలు తీసుకునేందుకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. తొలుత రాయలసీమలో పైలట్ ప్రాజెక్టుగా ఇస్తామన్నారు. పౌర సరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్ మాట్లాడుతూ.. మిల్లర్లకు చెల్లించాల్సిన బకాయిలు రూ.200 కోట్లు విడుదల చేశామని, మిగిలిన మొత్తాన్ని త్వరలోనే దఫదఫాలుగా అందిస్తామన్నారు.

వేర్వేరు ధిక్కార కేసుల్లో ముగ్గురు అధికారులకు శిక్ష

న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ తీర్పులు.. అప్పీల్ నిమిత్తం అమలు నిలుపుదల

సాక్షి, అమరావతి: వేర్వేరు కోర్టు ధిక్కార కేసుల్లో ముగ్గురు అధికారులకు గురువారం హైకోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. ఈ తీర్పులపై అప్పీళ్లు దాఖలు చేసుకునేందుకు తీర్పు అమలును నిలిపివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ తీర్పులు వెలువరించారు. కర్నూలు జిల్లా జి.సింగవరం పంచాయతీ పరిధిలో నీటి పారుదలశాఖ స్థలంలో అధికారులు గ్రామ సచివాలయాన్ని నిర్మించారు. ఈ నిర్మాణానికి చెల్లింపులు చేసేందుకు సర్పంచ్ నాగేంద్ర నిరాకరించారు. దీంతో అధికారులు ఆయన చెక్‌పవర్‌ను రద్దు చేశారు. దీన్ని సవాలు చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇలా చెక్‌పవర్‌ను రద్దు చేయడానికి వీల్లేదని గతంలో ఓ కేసులో తీర్పునిచ్చినప్పటికీ, అధికారులు నాగేంద్ర చెక్‌పవర్‌ను రద్దు చేయడాన్ని న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించారు. అధికారులపై సుమోటో ధిక్కార చర్యలు చేపట్టారు. విచారణ జరిపి అప్పటి జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావుది కోర్టుధిక్కారమేనని తేల్చారు. ఆయనకు వారం రోజుల సాధారణ జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే చెక్ పవర్ రద్దు విషయంలో చిత్తూరు జిల్లా పంచాయతీ అధికారి దశరథరామిరెడ్డికి సైతం జైలుశిక్ష, జరిమానా విధించారు. ఆర్టీసీలో అప్రెంటీస్‌గా పనిచేసిన తమకు డ్రామిక్ పోస్టుల భర్తీలో 30 శాతం బోనస్ మార్కులిచ్చేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన ఇద్దరి అభ్యర్థనను పరిశీలించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాల అమలులో అనంతపురం ఆర్ఎం సుమంత్ ఆంటోనీ తీవ్ర నిర్లక్ష్యం చూపారని న్యాయమూర్తి.. ఆయనకి నెలరోజుల సాధారణ జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు.

ఎల్ఆర్ఎస్ క్లియరెన్స్‌కు తుది గడువు

ఈ నెల 31లోగా పరిష్కరించాలని పట్టణ స్థానిక సంస్థలకు డీటీసీపీ ఆదేశం

సాక్షి, అమరావతి: గతంలో లే అవుట్ క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)కు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(యూడీఏ)లు, పట్టణ స్థానిక సంస్థ(యూఎల్బీ)లను పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖ డైరెక్టరేట్(డీటీసీపీ) ఆదేశించింది. ఈ నెల 31 నాటికి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులేవీ పెండింగ్‌లో ఉండకూడదని, వాటిపై సరైన నిర్ణయం తీసుకుని సంబంధిత యజమానులకు సమాచారమివ్వాలని ఆదేశించింది. మూడేళ్లుగా పలుసార్లు గడువు తేదీలను పెంచిన డీటీసీపీ.. ఇకపై గడువు పొడిగించే ప్రసక్తిలేదని తేల్చిచెప్పింది. షార్ట్‌ఫాల్ ఉన్న దరఖాస్తులపైన కూడా తగిన నిర్ణయం తీసుకుని.. వాటి యజమానులకు సమాచారమివ్వాలని సూచించింది. సకాలంలో స్పందించకపోతే ఆ దరఖాస్తులను తిరస్కరించాలని అధికారులు నిర్ణయించారు. గురువారం నాటికి అన్ని యూఎల్బీలు, యూడీఏల్లో కలిపి 10,735 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని తేలింది. గడువులోగా వాటిని పరిష్కరిస్తే పట్టణ ప్రణాళిక విభాగానికి దాదాపు రూ.150 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా.

ఇదే చివరి అవకాశం..

ప్రభుత్వ అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు తీసుకుని, రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో పాటు అక్కడ చేపట్టే నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాక ఇబ్బంది పడుతున్న వారు రాష్ట్రంలో అనేకమంది ఉన్నారు. ఇలాంటి వారికి ఊరటనిస్తూ 2019 ఆగస్టు 31 నాటికి ప్లాట్లు కొని రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 2020 డిసెంబర్ 31 వరకు అవకాశమిచ్చారు. అనంతరం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్వీకరణను నిలిపివేసి.. వాటి స్క్రూటినీ చేపట్టారు. అన్ని జిల్లాల్లోని యూఎల్బీలు, నగర పంచాయతీలు, యూడీఏల నుంచి 43,757 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటిదాకా 19,658 దరఖాస్తులను టౌన్‌ప్లానింగ్ విభాగం పరిష్కరించింది. వీటిద్వారా రూ.400.40 కోట్ల ఆదాయం సమకూరింది. మిగిలిన వాటిలో 4,922 దరఖాస్తులను తిరస్కరించగా.. 6,714 దరఖాస్తులను వివిధ పత్రాలు సమర్పించని కారణంగా షార్ట్‌ఫాల్‌లో ఉంచారు. 1,728 దరఖాస్తులకు సంబంధించి ఫీజు కట్టాలని యజమానులకు సమాచారం పంపించారు. ఇవిగాక అధికారులు పరిశీలించాల్సిన దరఖాస్తులు 10,735 ఉన్నాయి. వీటిని ఆయా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, పట్టణ స్థానిక సంస్థలు ఈనెల 31లోగా పరిశీలించి, వాటి యజమానులకు సమాచారమివ్వాలని డీటీసీపీ ఆదేశించింది.

గీత కార్మిక కుటుంబాలకు భరోసా

- వైఎస్సార్ కల్లుగీత భరోసా పథకం ద్వారా ప్రభుత్వ అండ
- రూ.10లక్షలు పరిహారాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కల్లు తీస్తూ ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి పడి మరణించిన, శాశ్వత అంగవైకల్యం బారిన పడే కల్లు గీత కార్మికుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్ గీత కార్మిక భరోసా' పథకాన్ని ప్రకటించింది. ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి పడి మరణించిన కల్లుగీత కార్మికుల కుటుంబానికి కూడా రూ.10లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. చెట్టుపై నుంచి పడి శాశ్వత అంగవైకల్యం బారినపడే కల్లుగీత కార్మికునికి కూడా రూ.10లక్షలు పరిహారం అందిస్తారు. ఇందులో రూ.5 లక్షలు కార్మిక శాఖ, మరో రూ.5లక్షలు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా రూపంలో అందిస్తాయి. కల్లు తీస్తూ ప్రమాదవశాత్తూ అంగవైకల్యం బారిన పడినవారు దరఖాస్తు చేసుకుంటే ఎక్సైజ్ శాఖ నిబంధనలకు అనుగుణంగా వైకల్యం సర్టిఫికెట్‌ను జారీచేస్తుంది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన రాష్ట్ర కల్లుగీత విధానం 2022-2027 ప్రకారం ఈ పరిహారాన్ని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది.

కల్లు గీత కార్మికులకు నిజమైన భరోసా..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన 'వైఎస్సార్ గీత కార్మిక భరోసా' పథకం రాష్ట్రంలోని లక్షలాది మంది గీతకార్మిక కుటుంబాలకు అండగా నిలవనుంది. రాష్ట్రంలో 95,245 కల్లు గీత కుటుంబాలు తమ కులవృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఏటా 1,200 మంది గీత కార్మికులు కల్లు తీస్తూ ప్రమాదానికి గురవుతున్నారు. వారిలో దాదాపు 40శాతం మంది దుర్మరణం చెందుతుండగా మిగిలిన వారు శాశ్వతంగా వైకల్యం బారిన పడుతున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ప్రమాదవశాత్తూ మరణించిన కుటుంబాలకు రూ.2లక్షలే పరిహారంగా అందించేవారు. దీనిని పెంచాలని గీత కార్మిక కుటుంబాలు డిమాండ్ చేయడంతో చంద్రన్న బీమా పథకం నుంచి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తామని టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. కానీ సక్రమంగా అమలు చేయలేదు. ఈ నేపథ్యంలో.. ఎవరూ డిమాండ్ చేయకుండానే ప్రమాదవశాత్తూ మరణించే, శాశ్వతంగా వైకల్యం బారినపడే కల్లు గీత కుటుంబాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10లక్షల పరిహారాన్ని ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. తద్వారా కల్లు గీత వృత్తిపై ఆధారపడిన 95,245 కుటుంబాలకు ముఖ్యమంత్రి భరోసానిచ్చారు.

ప్రతీదానికీ సలహాదారుల నియామకం ప్రమాదకరం

- ఇలా అయితే సమాంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినట్లే
- హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు
- పూర్తి వివరాల సమర్పణకు ఏజీకి ధర్మాసనం గడువు
- విచారణ ఫిబ్రవరి 2కి వాయిదా

సాక్షి, అమరావతి: ప్రతీదానికి సలహాదారులను నియమించుకోవడం ప్రమాదకరమని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇలా నియమించుకుంటూపోతే సమాంతర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినట్లు అవుతుందని తెలిపింది. సలహాదారుల నియామకం విషయంలో పూర్తి వివరాలను సమర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ గడువు కోరడంతో హైకోర్టు అందుకు అంగీకరించి తదుపరి విచారణను ఫిబ్రవరి 2కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. అంతకుముందు.. ఉద్యోగుల సంక్షేమ సలహాదారుగా చంద్రశేఖర్‌రెడ్డి నియామకాన్ని సవాలుచేస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని ధర్మాసనం గురువారం విచారించింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది ఆర్ఎన్. హేమేంద్రనాథ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, పిటిషనర్‌కు కోర్టు జారీచేసిన నోటీసులు అందలేదని తెలిపారు. పిటిషనర్ చిరునామా వివరాలను అందచేయాలని హేమేంద్రనాథ్‌రెడ్డికి ధర్మాసనం ఆదేశించింది. అలాగే, అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ స్పందిస్తూ.. ప్రభుత్వ పరిపాలనలో సలహాదారులు జోక్యం చేసుకోరని.. అవసరమైన మేర వారి సలహాలను తీసుకుని వారి సేవలను ప్రభుత్వం వాడుకుంటుందన్నారు. పూర్తి వివరాలను కోర్టు ముందుంచేందుకు గడువునివ్వాలని కోరారు. ఇందుకు ధర్మాసనం అంగీకరిస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 2కి వాయిదా వేసింది. అలాగే, దేవాదాయశాఖ సలహాదారుగా కొనసాగేందుకు శ్రీకాంత్‌కు అనుమతిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం పొడిగించింది.

వాటిని బహిర్గతం చేయాలా?వద్దా? తేలుస్తాం..

రఘురామకృష్ణరాజు పిటిషన్‌పై హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేయకుండా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల వివరాలను బహిర్గతం చేయాలా? వద్దా? అన్న అంశంపై లోతుగా విచారించి తేలుస్తామని హైకోర్టు తెలిపింది. అలా కేసులు నమోదు చేయకుండా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల వివరాలను సమాచార హక్కు చట్టం కింద తీసుకోవాలని నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజుకు హైకోర్టు స్పష్టంచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు హోంశాఖ న్యాయవాది వి. మహేశ్వరరెడ్డి గడువు కోరడంతో హైకోర్టు తదుపరి విచారణను పది రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో తనపై నమోదైన కేసుల వివరాలు, వాటికి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలతో పాటు కేసులు నమోదు చేయని ఫిర్యాదుల వివరాలను తనకు అందజేసేలా డీజీపీని ఆదేశించాలని కోరుతూ రఘురామకృష్ణరాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై జస్టిస్ రాయ్ గురువారం మరోసారి విచారణ జరిపారు. రఘురామరాజు తరపు న్యాయవాది పీవీజీ ఉమేశ్ వాదనలు వినిపిస్తూ, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేసి వాటిలో పిటిషనర్‌ను అరెస్టుచేసే అవకాశం ఉందన్నారు. పిటిషనర్ విషయంలో పోలీసులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, అందుకే ఆ ఫిర్యాదుల వివరాలను వెల్లడించలేదన్నారు. ఈ వాదనను న్యాయమూర్తి తోసిపుచ్చారు. ఇది ఊహాజనితమైనదన్నారు. కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి గడువునిస్తూ విచారణను పది రోజులకు వాయిదా వేశారు.

తెలంగాణ

ప్రోటోకాల్‌పై సీఎం జవాబివ్వాలి

- ఆ తర్వాతే పెండింగ్ బిల్లులు, ఇతర అంశాలపై బదులిస్తా: తెలంగాణ గవర్నర్ తమిళిసై
- గణతంత్ర దినం దగ్గరికొస్తున్నా వేడుకలపై నాకు సమాచారం లేదు



సాక్షి, హైదరాబాద్: భారత గణతంత్ర దినోత్సవానికి మరో వారమే ఉన్నా.. వేడుకల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి తనకు ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందలేదని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెప్పారు. దీనితోపాటు రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు కూడా వస్తున్నాయని.. రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయబోతుందో అంతా చూస్తారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ రాసిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకాన్ని గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆవిష్కరించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. ఖమ్మం సభలో గవర్నర్ల వ్యవస్థపై సీఎంలు, పలు పార్టీల ముఖ్యనేతలు చేసిన ఆరోపణలపై ఆమె స్పందించారు. గవర్నర్లను అవహేళన చేస్తూ సీఎంలు, ఇతర రాజకీయ నేతలు మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన గవర్నర్ పదవికి కనీస గౌరవం ఇవ్వాలని సూచించారు. గవర్నర్లు తమ బాధ్యతలు నిర్వహిస్తున్నారని, వారిపై రాజకీయ విమర్శలు సరికాదని చెప్పారు.

ప్రోటోకాల్‌పై సీఎం జవాబు ఇవ్వాలి

అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను క్లియర్ చేయట్లేదన్న విమర్శలను విలేకరులు ప్రస్తావించగా.. అన్ని బిల్లులను మదింపు చేసి పరిశీలించాల్సి ఉంటుందని, దీనికి అవసరమైన మేర సమయం తీసుకుంటానని తాను ఇప్పటికే చెప్పానని పేర్కొన్నారు. తన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏడాది నుంచి ప్రోటోకాల్ పాటించడం లేదని, కనీసం జిల్లా కలెక్టర్లు సైతం తన పర్యటనల సందర్భంగా కలవడానికి రావడం లేదని చెప్పారు. ప్రోటోకాల్ ఎందుకు పాటించడం లేదన్న విషయంపై సీఎం కేసీఆర్ సమాధానమిచ్చిన తర్వాతే బిల్లులపైగానీ, ఇతర విషయాలపైగానీ తాను బదులిస్తానని చెప్పారు. సాంప్రదాయం ప్రకారం ఏటా రాష్ట్రస్థాయిలో నిర్వహించే గణతంత్ర దిన వేడుకల్లో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కోవిడ్ మహమ్మారిని కారణంగా చూపి వేడుకలను రాజ్‌భవన్‌కు పరిమితం చేసి సాదాసీదాగా నిర్వహించింది. దీనిపై గవర్నర్ తమిళిసై తీవ్ర విమర్శలు చేశారు. గణతంత్ర వేడుకల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తనను అవమానాలకు గురిచేసిందని ఆరోపించారు. ఇక గతేడాది రాష్ట్ర బడ్జెట్ సమావేశాలను గవర్నర్ ప్రసంగం లేకుండానే ప్రారంభించడాన్ని కూడా తప్పుపట్టారు. ఇప్పుడు మళ్లీ గణతంత్ర దినం, బడ్జెట్ సమావేశాలు వస్తుండటంతో.. గవర్నర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

సైబర్ నేరాలపై హ్యాకథాన్ అస్త్రం

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాల నియంత్రణపై అవగాహనతోపాటు ఆయా నేరాలకు సంబంధించిన కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన నూతన టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్‌లను కనుగొనేలా సైబర్ హ్యాకథాన్‌లు నిర్వహించాలని అన్ని రాష్ట్రాల పోలీస్ శాఖలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. క్లిష్టమైన కేసుల పరిష్కారంలో ఉపయోగపడేలా నూతన టెక్నాలజీలను కనుగొనేలా యువతను ప్రోత్సహించే లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ ఆదేశాల్లో పేర్కొన్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే తెలంగాణ పోలీసులు సైతం రెండేళ్ల క్రితం ఈ తరహా హ్యాకథాన్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో తమిళనాడు, కర్ణాటక పోలీసులు సైతం ఇటీవలే హ్యాకథాన్‌లు నిర్వహించారు. తరచూ ఇలాంటి హ్యాకథాన్‌ల నిర్వహణ ద్వారా సైబర్ నేరాల కట్టడికి వ్యూహాలను రచించే అవకాశం ఉంటుందని ఓ అధికారి పేర్కొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం సహనంలోనూ,
క్షమాపణ అడగటంలోనూ ఉంది.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, జనవరి, 20

ఇది న్యాయం కోసం దంగల్

ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడల లాంటి అంతర్జాతీయ వేదికలపై దేశానికి పతకాలు సాధించి వార్తల్లో వ్యక్తులుగా నిలవడం ఆ కుస్తీ ప్రవీణులకు అలవాటు. కానీ, ఇప్పుడు పూర్తి భిన్నమైన పరిస్థితుల్లో వారు, వారి ఆట వార్తల్లోకి ఎక్కాయి. భారత రెజ్లింగ్ సమాఖ్య పైన, దాని అధ్యక్షుడైన పాలక బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ వికృత వ్యవహారశైలి పైన ధ్వజమెత్తుతూ ఢిల్లీ నడిబొడ్డున బుధవారం నుంచి రెండు రోజులుగా 30 మందికి పైగా మహిళా రెజ్లర్లు నిరసనకు దిగేలా చేశాయి. అంతా కలిపి 200 మందికి పైగా అథ్లెట్లు నిరసనకు దిగడం, అనేక సంగతులు బయటపెట్టడం భారత క్రీడా చరిత్రలో మునుపెన్నడూ చూడని దృశ్యం. ముక్కున వేలేసుకొనేలా సందర్భం.

కామన్వెల్త్ క్రీడోత్సవాల్లో మూడుసార్లు స్వర్ణాలు సాధించిన వినేశ్ ఫోగాట్ కన్నీరు పెట్టుకుంటూ మహిళా అథ్లెట్లు ఎదుర్కొంటున్న దారుణాల్ని వివరిస్తుంటే గుండె మండిపోతుంది. అన్షూ మలిక్ లాంటి వారు బయటపెట్టిన సంగతులు ఆవేదన రేపుతాయి. సాక్షీ మలిక్, బజ్‌రంగ్ పునియా – ఇలా స్త్రీ పురుష తేడా లేకుండా అందరూ జరుగుతున్న అన్యాయాలను కెమెరాల సాక్షిగా ఏకరవు పెట్టాల్సి వచ్చింది. మహిళా రెజ్లర్లుండే హోటల్‌లోనే బస చేయడం, వారు గది దాటి స్వేచ్ఛగా బయటకు రావడానికైనా వీల్లేకుండా తన గది తలుపులు సదా తీసి ఉంచి, తన రోజువారీ పనులు చేసుకోవడం– ఇదీ సమాఖ్య అధ్యక్షుడి తీరు. ఇది నియమానుసారమే కాదు నైతికంగానూ సరికాదు.

బ్రిజ్ గత చరిత్రా గొప్పదేమీ కాదు. గతంలో ఆయన నేరసామ్రాజ్య నేత దావూద్ ఇబ్రహీమ్ బృందానికి సాయపడ్డారట. ఆ కేసులో తీవ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం కింద అరెస్టయ్యారు. దౌర్జన్యానికి మారుపేరై, ఇప్పటికి 6 సార్లు ఎంపీగా గెలిచారు. 2011 నుంచి పుష్కర కాలానికి పైగా కుర్చీలో ఉంటూ, కుస్తీ సమాఖ్యను సొంత జాగీరుగా మార్చుకొన్నారు. ఆటను అడ్డంపెట్టుకొని అవినీతి, అక్రమాలు, వేదికపై ఆటగాళ్ళను చెంపదెబ్బ కొట్టిన దౌర్జన్యాలు, అథ్లెట్లతో అనుచితవర్తనలు... ఇలా ఈ రాజకీయవాది ఘనతల చిట్టా సుదీర్ఘమైనది. సొంత ఊరు లక్నోలో, స్వగృహానికి దగ్గరలోనే సదా మహిళా అథ్లెట్ల శిబిరం పెట్టి, తానూ హాజరయ్యే మనోడి గురించి ఎంత చెప్పినా తక్కువే.

క్రీడావ్యవస్థలో ఇలాంటి దుష్టసంస్కృతి చిరకాలంగా ఉన్నదే. ఇటీవల ఏడు నెలల క్రితం కూడా అగ్రశ్రేణి భారత సైక్లింగ్ క్రీడాకారిణి ఒకరు తమ నేషనల్ టీమ్ కోచ్ నుంచి ఇలాంటి వేధింపులే ఎదుర్కొన్నారు. స్లొవేనియాలో క్రీడా శిక్షణా శిబిరంలో కోచ్ అనుచిత ప్రవర్తనపై ఆమె ఏకంగా 'భారత క్రీడా ప్రాధికార సంస్థ' (శాయ్)కు ఫిర్యాదు చేయాల్సి వచ్చింది. ఇటీవలే హర్యానాలో ఓ మహిళా కోచ్ స్వయానా ఆ రాష్ట్ర క్రీడా మంత్రి లైంగిక అత్యాచార పర్వాన్ని బట్టబయలు చేయడం గమనార్హం. ఇంకెన్నో వెలుగులోకి రాని ఫిర్యాదులున్నాయి. ఓ సినీ నటుడి అనుచిత ప్రవర్తనను ఒక హిందీ నటి బయటపెట్టే సరికి, తీగ లాగితే డొంకంతా కదిలినట్టు భారత్‌లో 'మీ టూ' ఉద్యమస్థాయికి చేరిన సంగతి 2018లో చూశాం. ఇప్పుడు కుస్తీ సమాఖ్య సారథి సహా కోచ్‌లపై లైంగిక వేధింపుల ఆరోపణ ఆట వెనుక దాగిన చీకటి కోణాన్ని బయటపెట్టింది.

నాలుగు పర్యాయాలు ఒలింపిక్ పతకాలు తెచ్చిపెట్టిన కుస్తీలోనే ఇలాంటి దారుణమైన పరిస్థితి ఉందంటే, ఇతర క్రీడల్లో పరిస్థితిని ఇట్టే ఊహించుకోవచ్చు. 72 గంటల్లో సమాధానం చెప్పాలంటూ కుస్తీ సమాఖ్యకు క్రీడాశాఖ తాఖీదు ఇచ్చింది. కానీ, బ్రిజ్‌ను తొలగించాలి, అథ్లెట్లతో మర్యాదగా ప్రవర్తించాలి, సమాఖ్యను సమూలంగా మార్చాలి లాంటి ఆటగాళ్ళ కనీస డిమాండ్లు తీర్చలేనివేమీ కావు. ఆ మాటకొస్తే సమాఖ్యలో ఇష్టారాజ్యంగా నియమాలు మారుస్తున్నారనీ, తమపై అనవసరమైన అధిక నిఘా ఉంచుతున్నారనీ అథ్లెట్లు చేస్తున్న ఆరోపణలకు బ్రిజ్ బృందం జవాబివ్వాల్సి ఉంది. కానీ, వేధింపుల బాధితులు బాహాటంగా చెప్పాలనీ, సాక్ష్యాలతో నిరూపిస్తే ఉరిశిక్షకైనా సిద్ధమనీ ఆయన అనడం చట్టం ముందూ నిలవని బుకాయింపే. ఇదంతా కాంగ్రెస్ నిర్వాకమనే ఆరోపణ, యూపీ వర్సెస్ హర్యానా వాదన అలాంటివే.

ఆరోపణలు హోరెత్తుతున్నా బ్రిజ్ రాజీనామా చేయకపోవడం విడ్డూరం. ఇక స్వయంగా క్రికెటరైన క్రీడామంత్రి అనురాగ్ ఠాకూర్ రెండోరోజు రాత్రి దాకా నోరెందుకు విప్పలేకపోయారో అర్థం కాదు. ఇన్నేళ్ళుగా కుస్తీ సమాఖ్య సహా అనేక చోట్ల లైంగిక వేధింపుల విచారణ కమిటీలు పెట్టకున్నా ఎలా చూస్తూ కూర్చున్నారో తెలీదు. పాలకులు పతకాల విజేతలతో ఫోన్‌లో మాట్లాడుతూ, ఫోటోలకు పోజులిస్తే చాలదు. బేటీ బచావో... మాటల్లో కాదు, చేతల్లో చూపాలి. దేశవ్యాప్తంగా బ్రిజ్ కనుసన్నల్లో సాగుతున్న సమాఖ్య కార్యవర్గాలన్నిటినీ రద్దు చేయాలి. నిపుణులు సారథ్యం వహించాల్సిన క్రీడాసంస్థల్ని ఇకనైనా రాజకీయాలకూ, ఇలాంటి రాజకీయవాదులకూ దూరంగా ఉంచాలి.

అథ్లెట్ల నిరసనకు తలొగ్గి, సమాఖ్యలో అక్రమాలను విచారించడానికి క్రీడాశాఖ త్రిసభ్య సంఘం వేసిందట. అయితే, అది చాలదు. వేధింపులతో వ్యవహారం బరి దాటి నేరాల గిరిలోకి చేరింది. దీనిపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరపించాల్సిందే, వ్యవస్థను సమూలంగా ప్రక్షాళించాల్సిందే. ధర్మం కోసం, న్యాయం కోసం... కడకు కనీసపాటి గౌరవం కోసం మహిళలు ఇవాళ్టికీ వీధికెక్కాల్సి వస్తోందంటే అది మన దేశానికే అవమానం. అంతర్జాతీయ బరిలో విజేతలైన ఈ వీరాంగనలు ఈ ఆత్మగౌరవ దంగల్‌లోనూ విజయం సాధించాలి. సమాజంలో పురుషోన్మాద దృక్పథాన్ని మార్చాలి. ఆటల గద్దెపై రాజకీయ గద్దలకు పని లేకుండా క్రీడాసంస్థలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు రావాలి. నిజాయతీ ఉంటే... ఎప్పుడో కాదు, ఇప్పుడే ఆ విధానపరమైన మార్పులకు పాలకులు నడుం బిగించాలి.

రావాల్సిన 'చిరు' విప్లవం

విశ్లేషణ



దేవీందర్ శర్మ

ఐక్యరాజ్యసమితి 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. కిలో బియ్యం పండించేందుకు 3–5 వేల లీటర్ల నీళ్లు అవసరం కాగా, చిరుధాన్యాలకు 200 లీటర్లు చాలు. వాటి పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు కనీస మద్దతు ధర నిర్ణయించాలి. ఆంధ్రప్రదేశ్‌లో 'టీటీడీ' ఆధ్వర్యంలో 11 ధార్మిక ప్రాంతాలకు వీటిని అందించేట్టుగా చేసుకున్న ఒప్పందం లాంటిది పంజాబ్ లాంటి రాష్ట్రాలు అనుసరించవచ్చు. చిరుధాన్యాల హల్వా, పాయసాలు ప్రసాదంగా మంచి ప్రత్యామ్నాయాలు. దేశంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12 కోట్ల మంది చదువుకుంటున్నారు. మధ్యాహ్న భోజనంలో వారంలో ఒక పూటైనా చిరుధాన్యాలు అందిస్తే వీటి డిమాండ్ పెరిగి, రైతులను ఆ దిశగా మళ్లేట్టు చేస్తుంది.

ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి తీర్మానించింది. దీంతో ఈ అద్భుత సిరిధాన్యాలపై మరోసారి అందరి దృష్టి కేంద్రీకృతం కానుంది. 2023 ఏడాది ముగిసేలోపు ఈ చిరుధాన్యాలను తృణప్రాయంగా పక్కనబెట్టే మానసిక స్థితి నుంచి అందరూ బయటపడతారని నేనైతే నమ్మకంగా ఉన్నాను. ప్రతిగా... ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అదృశ్య ఆకలి ప్రమాదాన్ని భారత్ కూడా సమర్థంగా ఎదుర్కొనే అవకాశం లభిస్తుంది.

ఒకప్పుడు వీటిని తృణధాన్యాలని పిలిచేవారు. ఇవి ముతకగా ఉండవచ్చునేమో కానీ, ఆరోగ్యానికి హాని చేసేవి కాదు. నిజానికి పోషకాలతో నిండి ఉంటాయి. వాతావరణాన్ని తట్టుకోగల తెలివైన పంటలు కూడా. మెట్ట, వర్షాధారిత ప్రాంతాల్లో ఎంచక్కా పండించుకోవచ్చు. చిరుధాన్యాల జాబితాలోకి సజ్జలు, జొన్న, రాగులతోపాటు ఇతర చిన్న సైజు గింజలుండే ఆరు ధాన్యాలు(కొర్ర, అండుకొర్ర, అరికె, ఊద, సామ, వరిగ) వస్తాయి. చాలాకాలంగా వీటిని ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేశారు. యూరోపియన్ లేదా అమెరికన్ ఆహార శైలుల్లోకి ఇవి ఇమడకపోవడం ఒక కారణం.

సంప్రదాయ సాగు నుంచి మళ్లించాలి...

అయితే మిల్లెట్స్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా తదితర పౌర సమాజ వర్గాలు చిరుధాన్యాల ప్రయోజనాలపై చేసిన విస్తృత స్థాయి ప్రచారం పుణ్యమా అని ఇప్పుడు వీటికి మరోసారి ప్రాధాన్యం ఏర్పడుతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థలోకి వీటిని చేర్చడం కారణంగా ఇప్పుడు వైవిధ్యభరిత ఆహార, పంటల వ్యవస్థలకు మార్గం సుగమమైంది. చిరుధాన్యాల లాభాల గురించి కొత్తగా చెప్పాల్సిందేమీ లేదు. ఈ ఏడాదిలో వీటి గురించి మరింత వింటాం కూడా. ప్రజల్లో అవగాహన మరింత పెంచడం, దిగుబడుల పెంపు, ఆహార శుద్ధికి అవకాశాలు కల్పించడం, సేకరణ మెరుగుపరచడం వంటి అంశాలపై ఈ ఏడాది చర్చోపచర్చలు జరగనున్నాయి. అయితే చిరుధాన్యాల సాగును మరింతగా పెంచాలంటే, నీటి అవసరాలు ఎక్కువగా ఉండే వరి సాగు నుంచి రైతులను మళ్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం చిరుధాన్యాల సాగు రైతులకు లాభదాయకంగా ఉండాలి. అయితే ఇది చెప్పినంత సులువైన పనేమీ కాదు. సంప్రదాయ పంటల సాగు నుంచి రైతును ఇంకో దిశకు మళ్లించడం కోసం గతంలోనూ కొన్ని విఫలయత్నాలు జరిగిన విషయం ఇక్కడ చెప్పుకోవాలి.

ఒక కిలో బియ్యం పండించేందుకు ప్రాంతం, వాతావరణాలను బట్టి మూడు నుంచి ఐదు వేల లీటర్ల నీరు అవసరమవుతుంది. కానీ చిరుధాన్యాల విషయంలో నీటి అవసరం కేవలం 200 లీటర్లు మాత్రమే. పైగా వీటి సాగులో రసాయన ఎరువులు, క్రిమి, కీటకనాశినుల వాడకమూ పెద్దగా ఉండదు. పోషకాలూ మెండుగా ఉంటాయి. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని 'కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్స్ అండ్ ప్రైజెస్' (సీఏసీపీ) చిరుధాన్యాల ధరల నిర్ణయానికి కొత్త ఫార్ములాను రూపొందించాలి. పర్యావరణానికి చిరుధాన్యాలు అందించే తోడ్పాటును కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. వినియోగదారుడికి అందే ధరలో రైతుకు దక్కేది కొంతే కాబట్టి ధరలు నిర్ణయించే తీరు మారడం ప్రాముఖ్యత సంతరించుకుంటుంది. పండించే పంటకు కచ్చితంగా కొంచెం పెద్ద మొత్తంలోనే ధర లభిస్తుందని తెలిస్తే రైతుకూ, సమాజానికీ లాభం.



స్ఫూర్తిదాయకమైన ఏపీ మోడల్

చిరుధాన్యాలకు మద్దతుధరలు కొత్తగా నిర్ణయించడంతోపాటు వరి పంటకు పేరెన్నికగన్న పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో చిరుధాన్యాల సాగును పెంచాలి. 1950లో అవిభాజ్య పంజాబ్‌లో సుమారు 11 లక్షల హెక్టార్లలో సజ్జలు సాగవుతూండేవి. ఇప్పుడు ఇది వెయ్యి హెక్టార్ల కనిష్ఠానికి పడిపోయింది. గోధుమ, వరి పంటలను మార్చి మార్చి వేయడమన్న విధానానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పరిస్థితి ఇంతకు దిగజారింది. పప్పులు, నూనెగింజలతోపాటు చిరుధాన్యాల సాగు మళ్లీ చేపట్టడం మేలైన ముందడుగు అవుతుంది. ఇలా పంటల వైవిధ్యానికి చిరుధాన్యాలు చేర్చడం వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి. పర్యావరణ విధ్వంసానికి కారణమైన హరిత విప్లవ దుష్పరిణామాలను చక్కదిద్దగలగడం ఒకటైతే... చిరుధాన్యాలకు డిమాండ్ పెంచడం రెండోది.

చిరుధాన్యాల సాగు విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను పంజాబ్ పరిగణనలోకి తీసుకోవడం మంచిది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని 11 ధార్మిక ప్రాంతాల్లో సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ (సీఎస్ఏ), రైతు సాధికార సంస్థ, ఏపీ మార్క్‌ఫెడ్ కలిసికట్టుగా ఒక ఒప్పందం చేసుకున్నాయి. ఇందులో భాగంగా 12 రకాల పంటలను 15,000 టన్నుల మేరా సహజసేద్య విధానంలో అందించాలి. ఇందులో భాగంగా కనీస మద్దతు ధర కంటే పది శాతం ఎక్కువ ధర రైతుకు లభించనుంది. ఒకవేళ మార్కెట్‌లో ఆయా పంటకు ఎక్కువ ధర ఉంటే... అదనంగా ఇంకో పదిహేను శాతం చెల్లిస్తారు. కర్ణాటకలోనూ గతంలో రాగుల సాగును ప్రోత్సహించేందుకు కనీస మద్దతు ధర కంటే 40 శాతం ఎక్కువ చెల్లించారు.

పంజాబ్‌లోని వేల గురుద్వారాలను దృష్టిలో ఉంచుకుంటే చిరుధాన్యాలకు, అదికూడా సేంద్రీయ ఉత్పత్తులకు మంచి డిమాండే ఉంటుంది. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ వంటి సంస్థల సాయంతో సేంద్రీయ లంగర్ ఏర్పాటుకు ప్రయత్నించవచ్చు. ఇందులో వడ్డించే ఆహార పదార్థాల్లో చిరుధాన్యాలను చేర్చవచ్చు. ఆ మాటకొస్తే చిరుధాన్యాల హల్వా, పాయసాలు ప్రసాదంగా మంచి ప్రత్యామ్నాయాలవుతాయి. చిరుధాన్యాల సక్రమ నిల్వ, సరఫరాల బాధ్యతను మార్క్‌ఫెడ్ వంటి సంస్థలకు పంజాబ్ అప్పగించవచ్చు. ఖేతీ విరాసత్ మిషన్ వంటి లాభాపేక్ష లేని సంస్థలకు సేంద్రీయ వ్యవసాయ సముదాయాల ఏర్పాటు పనులు అప్పగించవచ్చు. నాణ్యతను నిర్ధారించేందుకు అవసరమైన చర్యలూ సులువుగా చేపట్టవచ్చు.

పాఠశాలల డిమాండ్ కూడా చేరితే...

పంజాబ్‌లో సుమారు 30 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. వీరికందించే మధ్యాహ్న భోజన పథకంలో ప్రారంభంలో వారానికి ఒకసారి చిరుధాన్యాలను కూడా చేరిస్తే విపరీతమైన డిమాండ్ ఏర్పడుతుంది. తద్వారా స్థానికంగానే వీటి సరఫరాకు అవకాశం ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో టీటీడీ నిర్ణయించినట్లే చిరుధాన్యాలను పంజాబ్‌లోనూ స్థానిక రైతుల నుంచి మాత్రమే సేకరిస్తామని చెప్పవచ్చు. కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్‌లో సుమారు 110 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీరికి వారంలో ఒకసారి చిరుధాన్యాలను వడ్డిస్తున్నారు. అయితే ఈ డిమాండ్‌ను తట్టుకోవడం కష్టమవుతోంది. పంజాబ్ మొత్తమ్మీద చిరుధాన్యాలను వడ్డిస్తే పరిస్థితి ఎలా ఉండనుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. పాఠశాలలు, గురుద్వారాలతో ఏర్పడే డిమాండ్‌ను తట్టుకునేందుకు పంజాబ్ ప్రభుత్వం, రైతులు ఏదో ఒక మాయ కచ్చితంగా చేయగలరు.

జాతీయ స్థాయిలో చూస్తే సుమారు 12.7 లక్షల ప్రభుత్వ పాఠశాలల్లో 12 కోట్ల మంది చదువుకుంటున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వీరందరికీ చిరుధాన్యాలు ఏదో ఒక స్థాయిలో అందించడం రైతులను చిరుధాన్యాల సాగుకు మళ్లించేందుకు మేలిమి మార్గం కాగలదు. పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రార్థనాలయాల సాయంతో చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని పెంచడం సుసాధ్యమవుతుంది. పంజాబ్ ఈ దిశగా అడుగులేసి దేశంలో చిరుధాన్యాల విప్లవాన్ని సృష్టించాలని ఆశిద్దాం!

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గుడ్‌బై జెసిండా



న్యూజిలాండ్ ప్రధాన మంత్రిగా జెసిండా ఆర్డెన్ రాజీనామా చేశారు. "సత్యానికి సంబంధించిన ఏకైక సోర్సుగా మేము కొనసాగుతాం. మా నుంచి విననట్టయితే అది సత్యం కాదు," అని ప్రకటించారామె. స్వేచ్ఛా సమాజానికి ఆటంకంగా నిలిచిన ఆమె పాలనకు గుడ్‌బై.

– జేమ్స్ మెల్‌విల్, కామెంటేటర్

నమ్మకం కలుగుతోంది



విమానం ఎక్కుతున్నప్పుడు, నా చేతిలో పుస్తకం ఉండటం గమనించిన స్టివార్డెస్, "ఏం చదువుతున్నారు?" అని అడిగింది. నాకు ఆశ్చర్యమేసింది. ఎందుకంటే మన దేశంలో ఎవరూ చదవరు, పుస్తకాల మీద ఆసక్తి చూపరు. పుస్తకాన్ని చూపిస్తూ, 'చదివారా' అని అడిగాను. 'అవును' అని చెప్పింది. అయితే ఇంకా మనకు పుస్తకాలు చదివే ఉత్తేజకర యువ మెదళ్లున్నాయి.

– సల్మాన్ రషీద్, ఫెలో

ఇతరులను అంగీకరించేలా...



మా పోరాటం కేవలం 'ఎల్జీబీటీక్యూఐఏ' కమ్యూనిటీ జీవితాల్ని మెరుగుపర్చడం అని జనం పొరపడుతుంటారు. దానికంటే మించి 'సిస్‌జెండర్' (జన్మతః వచ్చిన లింగం) కమ్యూనిటీని మెరుగైన వ్యక్తులుగా మార్చాలన్నది మా ప్రయత్నం. అప్పుడు వాళ్లు 'ఇతరుల' ప్రేమ, సంతోషాల్ని అంగీకరించగలరు.

– ఓనీర్, ఫిలింమేకర్

పెరిగిన గౌరవం



జెసిండా ఆర్డెన్ పదవిలోంచి దిగిపోవడం నిరుత్సాహం కలిగించింది. కానీ ఆమె మీద మరింత గౌరవం పెరిగింది.

– ప్రియాంకా చతుర్వేది, రాజ్యసభ ఎంపీ

ఇవి చేస్తే...



ఒక మంచి రాత్రి నిద్ర, రోజంతా ఆరోగ్యకరమైన తిండి, మంచి బయటి నడక వల్ల కనీసం 90 శాతం మనం సమస్యలుగా గుర్తించినవి ఇంద్రజాలంలా మాయమైపోతాయి.

– మార్క్ మాన్సన్, రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

అనుమానాలు సహజమే!

2019 సార్వత్రిక ఎన్నికల నాటికి దేశవ్యాప్తంగా 91.2 కోట్ల మంది ఓటర్లు ఉంటే... వారిలో 32.6 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఇందుకు అనేక కారణాలు. అందులో ముఖ్యమైనది బతుకు తెరువు కోసం వలస పోవటం. ఓటింగ్ శాతంపై సుప్రీంకోర్టుకు కూడా అనేక వినతులు అందాయి. వ్యాజ్యాలూ దాఖలయ్యాయి. ఆ నేపథ్యంలోనే 2015లో సుప్రీంకోర్టు ఓటింగ్ శాతం పెంచే విషయాన్ని పరిశీలించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (సీఈసీ) ఆదేశించింది.

దీంతో ఎన్నికల సంఘం అనేక అంశాలను పరిశీలించింది. ఇప్పటికే పరోక్ష ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్, ఇంటర్నెట్ ఓటింగ్, ముందస్తు ఓటింగ్ వంటి విధానాలు అమల్లో ఉన్నాయి. అయితే ఆ విధానాలను అత్యధికులు ఉపయోగించుకోవడం అంత తేలికైన విషయం కాదు. ఇప్పుడు కోట్లాదిగా ఉన్న వలస ఓటర్ల కోసం కేంద్ర ఎన్నికల సంఘం, ఒకేసారి అనేక (72) నియోజకవర్గాల పరిధిలో ఉన్నవారు రిమోట్ ఓటింగ్ మిషన్ (ఆర్‌వీఎం)ను ఉపయోగించి ఓటువేయడానికి అవకాశం కల్పించాలని ప్రతిపాదించింది. ఈ ఆర్‌వీఎంలను పరిశీలించేందుకు, వాటి పనితీరుపై అభ్యంతరాలను తెలిపేందుకు, జనవరి 16, సోమవారం ప్రయోగాత్మక పరిశీలనా ప్రదర్శనకు రావాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘం.. గుర్తింపు పొందిన 8 జాతీయ పార్టీలను, 57 రాష్ట్ర పార్టీలను ఆహ్వానించింది. పరిశీలన తర్వాత తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా జనవరి 31 నాటికి అందించాలని ఈసీ కోరింది. అయితే ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో 16 ప్రతిపక్షాలు సమావేశమై తాము ఆర్‌వీఎంలను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించాయి. ఇప్పటికే అనేక పార్టీలు ఆర్‌వీఎంల అవసరం లేదని పేర్కొన్నాయి. దీంతో ఆర్‌వీఎంలపై మరింత చర్చించి తమ అభిప్రాయాలను చెప్పాలని ఎన్నికల కమిషన్ ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగించింది. ఈవీఎంలపై అనుమానాలే పూర్తిగా తగ్గని వేళ, ఈ ఆర్‌వీఎంలపై మరిన్ని సందేహాలు రావడం సహజమే.

– డాక్టర్ తాతా సేవకుమార్, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్

'ప్రగతిశీల' శక్తులన్నీ ఒక్కటి కావాలి!

హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా 1974లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఏర్పడి మరో ఏడాదికి 50 ఏళ్లు నిండనున్నాయి. అసమానమైన పోరాటాలతో, త్యాగాలతో ఇరు రాష్ట్రాల ప్రజలపై పీడీఎస్‌యూ చూపిన ప్రభావం ఎవ్వరూ చెరపలేనిది. ఈ సంస్థకు రాష్ట్ర ఉపాధ్యక్షునిగా 1980 దశకం నాటికే నా ప్రత్యక్ష నిర్మాణ సంబంధం ముగిసిపోయింది. కానీ సోదరుడు కామ్రేడ్ కూర రాజన్న ద్వారా మా ఇంటి తలుపు తట్టిన అమరుడు కామ్రేడ్ జార్జిరెడ్డి జ్ఞాపకం, ఎంతోమంది గుండెల్ని రగిలించిన ఆయన ప్రస్థానం... నేను పుట్టి పెరిగిన సిరిసిల్ల ప్రాంత రైతాంగ పోరాటాల వెల్లువతో పెనవేసుకు పోయింది. అదే విప్లవోద్యమంతో ముడిపడిపోయి రెండు తరాల విప్లవ విద్యార్థులతో నా ఇన్నేండ్ల ప్రయాణాన్ని నిర్దేశిస్తూ వస్తోంది. అందుకే నాకిది జ్ఞాపకం మాత్రమే కాదు, వర్తమాన నిజం. అలాంటి జ్ఞాపకాలన్నింటినీ తట్టిలేపుతూ, గతం–వర్తమాన పరిస్థితులను బేరీజు వేసుకుంటూ 2023 జనవరి 21న, పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరగడం అపూర్వమనే భావించాలి.



కామ్రేడ్ జార్జిరెడ్డి ఆధ్వర్యాన ఏర్పడిన పీడీఎస్‌యూ, ఆయన అమరుడైన ఏప్రిల్ 14 (1974)ననే పీడీఎస్‌యూగా ఆవిర్భవించింది. అది మొదలు అధిక ధరలపై, పలు సమస్యల సాధనకై పోరాడింది. కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షల రద్దుకై ఉద్యమించింది. రైల్వే కార్మికుల సమ్మెకు మద్దతుగా నడిచింది. శ్రీకాకుళ గోదావరి లోయ పోరాటాలకు సంఘీభావంగా నిలిచింది. శ్రామికవర్గ అంతర్జాతీయతను ఎలుగెత్తి చాటి, ప్రపంచ పోరుడిగా అవతరించిన చేగువేరా త్యాగనిరతిని పునికి పుచ్చుకుంది. అందుకే మతోన్మాదుల చేతుల్లో జార్జ్, చాంద్ పాషాల హత్యలు మొదలు... రాజ్యమే యుద్ధం ప్రకటించడంతో జంపాల, శ్రీపాద శ్రీహరిల నుండి చంద్రశేఖర్, రియాజ్‌ల వరకూ డజనుల కొలది విద్యార్థి వీరులు అమరులైనారు. మరి ఎంతోమంది విద్యాలయాల నుండి పయనమై సమాజపు విముక్తిలో అంతర్భాగమైనారు. ఇందులో కొందరు తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో నిలబడి బూర్జువా పార్లమెంటరీ రాజకీయాల్లో కీలకంగా ఎదిగారు. ఈనాడు విప్లవ విద్యార్థి ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యల ప్రత్యేక సందర్భంలో పలు పీడీఎస్‌యూలన్నీ ఒకే తాటి మీదకు రావడమనేది, ప్రధాన ఎజెండా కావాలనేది నా అభిప్రాయం.

ఇప్పుడు గతం కంటే తీవ్రంగా యావద్దేశం హిందుత్వ రాజకీయాల ఫాసిస్టు దాడికి గురవుతోంది. ప్రారంభం నుండీ ఇలాంటి ఉన్మాద దాడుల్లోనే రక్తసిక్త పసిగుడ్డుగా పుట్టిన పీడీఎస్‌యూ అనతి కాలంలోనే ఎమర్జెన్సీ ఫాసిస్టు దాడికి గురయ్యింది. చితాభస్మంలోంచి లేచిన ఫినిక్స్ పక్షిలాగా మారిన పీడీఎస్‌యూ నేడు అప్రకటిత ఎమర్జెన్సీని ఎదుర్కొంటూనే మునుముందుకు సాగుతోంది. అయితే పీడీఎస్‌యూలో సంభవించిన చీలికలు ఉద్యమ గమనం మందగించడానికి కారణమయ్యాయి.

నాకు సమకాలికులుగా ఉన్న చాలామంది కామ్రేడ్స్ ప్రత్యక్షంగా ఎదుర్కొన్న 1984 నాటి చీలికను చూసి కొందరు పీడ విరగడయిందని (గుడ్ రిడెన్స్) భావించిన వాళ్లున్నారు. కానీ అసలు పీడ అక్కడ నుండే మొదలయ్యింది. ఆ తర్వాతి 45 ఏళ్లలో 1986 రాజీవ్‌గాంధీ నూతన విద్యా విధానం, రిజర్వేషన్లు, ఎల్పీజీ, విద్యా కాషాయీకరణ – కార్పొరేటీకరణ లాంటి ఎన్నో పరిణామాలు వచ్చాయి. విద్యాహక్కు చట్టం తర్వాత కూడా ఎన్నో పాఠశాలలు మూసివేయబడి, సార్వజనీన విద్య (కామన్ స్కూల్ ఎడ్యుకేషన్) అనేది కనుమరుగై పోయింది. వాటన్నిటిపై ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం బలాబలాలు మన కళ్ళకు కట్టినట్టు కనిపిస్తున్నాయి.

రెండు తరాలూ... అధిక ధరలు, ఆకలి చావులు, అన్నార్థుల ఆవేదనలు, దేశ సంపదను దోచుకెళ్తున్న పిడికెడు మంది బడా దోపిడీదారులకు వ్యతిరేకంగా సాగే పోరాటాలతో మమేకం కావాలని కోరుకోవడం ఆహ్వానించతగ్గది. సమ్మేళనం బాధ్యతను నెత్తికెత్తుకున్న నిర్వాహకులకు విప్లవాభినందనలు. ఇది బయటి వ్యక్తి మాటగా కాకుండా మీతో నేను, నాతో మీరుగానే స్వీకరించాలని నా విజ్ఞప్తి.

– అమర్

(రేపు పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా)

తల్లీ! నీ కీర్తి అజరామరం

తల్లీ... నీకు 75 సంవత్సరాలు. నీ ఒడిలో అక్షరాలు దిద్దుకున్న ఎందరో నీ కీర్తి పతాకను వినువీధుల్లో ఎగురవేశారు. అంతర్జాతీయ వ్యవసాయరంగ చిత్ర పటంలో నిన్ను నిలిపారు. సముచిత స్థానం కల్పించి నిన్ను గర్వపడేలా చేశారు. వరిలో జయ, హంసలతో శాస్త్రి, సాంబ మాషూరితో ఎం.వి. రెడ్డి; స్వర్ణతో రామచంద్రరావులు సుపరిచితులు. జొన్న పంటకు జీవం తెచ్చిన గంగా ప్రసాదరావు, చిరుధాన్యాలను ఇంటి పేరు చేసుకున్న హరి నారాయణలు నీ బిడ్డలే. మీ పిల్లలు మామూలు వాళ్ళు కారు. కాలాన్ని బట్టి, పంటలను శాసించి, వాటిలో మార్పులు తెచ్చి రైతుకు భరోసా ఇచ్చారు. చెరకును పీల్చి పిప్పి చేసి రైతుకు తియ్యని రసం అందించిన కోటికలపూడి నుంచి జరుగుల దాకా అందరూ నీ చనుబాలు తాగిన వారే. నరసింహ, బ్రహ్మ, ప్రత్తి రవీంద్ర నాథ్ నుండి జెన్నీ జాదు జాక్సొట్ వరకు... ఇలా చెప్పుకుంటూ పోతే నీ పిల్లల ఘన చరిత అనంతం. నేర్పిన విద్య, సంపద అంతా సమాజానికి సమంగా చెందాలనే ఉన్నత ఆశయంతో వెన్నెల పంచిన వేమూరి చంద్ర శేఖరుడు, ప్రాణత్యాగం చేసిన గోపబోయిన ప్రసాద్‌లు కూడా నీ ఒడిలో అక్షరాలు దిద్దినవారే.

నీ 50 ఏళ్ల ప్రస్థానాన్ని ఒక కమనీయ దృశ్య రూపకంగా మలచి దూరదర్శన్ ద్వారా ప్రసారం చేసిన బొగ్గవరపు, హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం ద్వారా ఒక సంవత్సర కాలం పాటు నీ స్వర్ణోత్సవ గీతం ఆలపించిన ఈలప్రోలు, వాతావరణ మార్పులకు సంబంధించి విశ్వానికంతటికీ సలహాలు, సూచనలు ఇస్తున్న శివుడూ, శ్రీనివాసుడూ ఇద్దరూ నీ పిల్లలే కావటం ఒకింత గర్వ కారణమే కదా! కనుచూపు మేర పరిపాలన, శాంతి భద్రతలు, పర్యావరణం, అడవులు, రైల్వేలు, గనులు, మీడియా, కస్టమ్స్, ఆదాయ పన్ను, బ్యాంకింగ్, ఆర్థిక, వాణిజ్య, వ్యాపార, రాజకీయ, పారిశ్రామిక, సామాజిక, సేవా రంగాలలో ఆరితేరిన మెరికలుగా గుర్తింపు పొందిన వారంతా నీ ఒడిలో పెరిగిన పిల్లలే. అయ్యంగార్ ఇండోర్ స్టేడియం ఇచ్చారు. గోవింద రాజులు నాబార్డ్ తరఫున ఓ పెద్ద భవనం ఇచ్చారు.



బాపట్ల వ్యవసాయ కళాశాల

కరోనా ప్రభావం తగ్గాక నీ పిల్లలు ప్రత్యేక రీతిలో సావనీర్‌లు తెస్తున్నారు. 1962, 1969, 1972, 1997, 1977, 1978 బ్యాచ్‌లు వారి వారి అనుభవాలను కలబోసుకున్నారు. అంతకుముందే 1964 వారు ప్రచురించిన సావనీర్ అందరికీ రోల్ మోడల్ అయింది కూడా. కరోనా అంటే నీ కెందుకు భయం. కరోనాకు చెక్ పెట్టేందుకు సీసీఎంబీ తయారు చేసిన ఎంఆర్ఎన్ఏ టీకా శాస్త్రవేత్తల బృంద నాయకులు నాళం మధు... బాపట్ల ఒడిలో నీవు లాలించిన బిడ్డే కదమ్మా. పిల్లలు అంతా ఇలా ఒకరిని చూసి మరొకరు గుంపులు గుంపులుగా కలుస్తూ ప్రస్తుతం కళాశాలలో ఉన్న నాలుగు బ్యాచ్‌లకూ స్ఫూర్తినిచ్చేందుకు ప్లాటినం జూబిలీ ముగింపునకు తరలి వస్తున్నారు. గత వైభవం అంతా ఈ తరానికి అందించి, వారూ స్ఫూర్తి పొంది, మంచి భవిష్యత్‌కు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు సాగుతారని. అందుకే అమ్మా... నీ బిడ్డలు వారి వారి బ్యాచ్‌ల పేరుతో గోల్డ్ మెడల్స్ ఏర్పాటు చేసింది. తప్పులుంటే మమ్ము క్షమించు తల్లీ!

– వలేటి గోపీచంద్, 1980 బ్యాచ్ విద్యార్థి । 94412 76779

(రేపు బాపట్ల వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబిలీ ఉత్సవాల ముగింపు వేడుక)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: బ.త్రయోదశి ఉ.7.55 వరకు, తదుపరి చతుర్దశి తె.5.40 వరకు, నక్షత్రం: మూల ఉ.11.14 వరకు, తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ.9.44 నుండి 11.14 వరకు, తదుపరి రా.8.11 నుండి 9.43 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.53 నుండి 9.43 వరకు, తదుపరి ప.12.34 నుండి 1.18 వరకు, అమృతఘడియలు: తె.5.10 నుండి 6.13 వరకు ; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.39, సూర్యాస్తమయం: 5.44

క్లుప్తంగా...

ఏసీబీ వలలో హౌసింగ్ పీడీ తారాచంద్

- రూ.పదివేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం


లంచం తీసుకుంటూ పట్టుబడిన తారాచంద్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): హౌసింగ్ శాఖ కార్యాలయం ప్రాజెక్టు డైరెక్టర్ బద్రి తారాచంద్ రూ.పదివేల లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే..కాకినాడ జిల్లా గోకవరం మండలంలో హౌసింగ్ ఏఈగా ప్రసాద్ పనిచేస్తున్నాడు. అతడు పనిలో అలసత్వం కారణంగా గతేడాది జూలైలో సస్పెండ్ అయ్యాడు. ఆ తర్వాత విధుల్లో చేరాడు. సస్పెన్షన్ కాలంలో తనకు వచ్చే సగం జీతం ఇప్పించాల్సిందిగా ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ తారాచంద్‌ను కోరాడు. ఈ విషయంపై రెండు నెలలుగా ధవళేశ్వరం కలెక్టరేట్‌లోని హౌసింగ్ కార్యాలయానికి తిరుగుతున్నాడు. రూ.10 వేలు ఇస్తేనే సగం జీతం పత్రాలపై సంతకం పెడతానని తారాచంద్ చెప్పడంతో ఏఈ ప్రసాద్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు తారాచంద్‌ను లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి ఆస్తుల వివరాలను సేకరిస్తున్నారు. ఈ దాడిలో ఏసీబీ ఏఎస్పీ సౌజన్య ఆధ్వర్యంలో అధికారులు వి.పుల్లారావు, డి.వాసుకృష్ణ, వై.సతీష్ పాల్గొన్నారు. తారాచంద్‌ను అదుపులోకి తీసుకుని ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు.

28న తిరుమలలో రథసప్తమి

ఒకే రోజు 7 వాహనాలపై స్వామివారి విహారం

తిరుమల: సూర్య జయంతి సందర్భంగా ఈ నెల 28న శ్రీవారి ఆలయంలో రథసప్తమి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సూర్యప్రభ, చిన్నశేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, చంద్రప్రభ వాహనంపై స్వామివారు ఊరేగనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తారు. కాగా, ఆలయంలో 28న నిర్వహించనున్న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

సర్వ దర్శనానికి 24 గంటలు

తిరుమల క్యూ కాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 76,229 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.46 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ దర్శన టికెట్లు ఉన్నవారికి సకాలంలో, టికెట్లు లేని వారికి 24 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్న వారికి 3 గంటల్లో దర్శనమవుతోంది.

టీడీపీ జెండా మోసినా ఇంత లబ్ధి చేకూరలేదన్నా..

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేకు వార్డు మాజీ సభ్యురాలి కృతజ్ఞతలు


ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న నామాల కోసిగమ్మ

కోసిగి(కర్నూలు) : 'టీడీపీలో పనిచేసినా నా ఇంటి ముందు సీసీ రోడ్డు వేయలేదు. ఇటీవల ఎమ్మెల్యే చొరవతో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు వేశారు. అలాగే నా కుటుంబానికి రూ.1.60 లక్షలకు పైగా సంక్షేమ పథకాల కింద లబ్ధి చేకూరింది. అన్నా.. టీడీపీ జెండా మోసినా అప్పట్లో నాకు ఇంత లబ్ధి చేకూరలేదు' అంటూ వార్డు మాజీ సభ్యురాలు నామాల కోసిగమ్మ ఆనందం వ్యక్తం చేశారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గురువారం కోసిగి సచివాలయం-3 పరిధిలో పర్యటించారు. ఇందులో భాగంగా నామాల కోసిగమ్మ ఇంటికి వెళ్లగా ఆమె ఎమ్మెల్యేను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

'ఆర్టీసీ కారుణ్య నియామకాలపై సీఎం జగన్ చొరవ'

మచిలీపట్నంటౌన్ : ఏపీఎస్ ఆర్టీసీలో కారుణ్య నియామకాల ప్రక్రియ నిర్వహణకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ చూపారని ఆ సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2015 డిసెంబర్ వరకు సంస్థలో కారుణ్య నియామకాలు జరిగాయని, 2016 జనవరి నుంచి నియామకాలు నాలుగేళ్ల పాటు నిలిచిపోయినట్టు తెలిపారు. 2020 జనవరి 1 నుంచి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశాక కారుణ్య నియామకాల కోసం చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వంలో విలీనం కాకముందు పెండింగ్‌లో ఉన్న కార్మికుల కుటుంబ సభ్యులకూ నియామకాలు ఇవ్వాలని సీఎం ఆదేశించారని చెప్పారు. గతంలో ఆర్టీసీలో కారుణ్య నియామకాలంటే.. డ్రైవర్, కండక్టర్, శ్రామిక్ ఉద్యోగాలే ఇచ్చేవారని, సీఎం ఆదేశాలతో ఆర్టీసీలోనే కాకుండా ఇతర శాఖల్లో ఖాళీలనూ భర్తీ చేస్తున్నట్టు తెలిపారు. గత 45 రోజులుగా ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

బాల్య వివాహాల కట్టడికి కఠిన చర్యలు

18 ఏళ్లలోపు బాలికకు వివాహం చేస్తే చట్టప్రకారం శిక్ష తప్పదు

- బాల్య వివాహ నిషేధ చట్టం-2006 ప్రకారం రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా
- 18 ఏళ్లలోపు బాలికతో సంసారం చేస్తే పదేళ్లకుపైగా శిక్ష
- 16 ఏళ్ల లోపు బాలికతో సంసారం చేస్తే 20 ఏళ్లకుపైగా కఠిన కారాగార శిక్ష
- బాల్య వివాహాలను ప్రోత్సహించే తల్లిదండ్రులు, బంధువులకు రెండేళ్ల జైలు
- జిల్లా అధికారులకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో బాల్య వివాహాల కట్టడికి ప్రభుత్వం మరింత కఠిన చర్యలు చేపట్టింది. గతంతో పోల్చితే రాష్ట్రంలో బాల్య వివాహాల రేటు తగ్గినప్పటికీ ప్రజలు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో వాటిని మరింతగా కట్టడి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర అన్ని జిల్లాల అధికారులకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, మిషన్ వాత్సల్య, బాల్య వివాహ నిరోధక చట్టం-2006, ఏపీ నియమాలు-2012ను అనుసరించి బాల్య వివాహాల నివారణ కోసం వరుడు, వధువు, వారి తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రం తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మెమోలో పేర్కొన్న అంశాలు ఇవి..

- బాల్య వివాహాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. బాల్య వివాహ నిరోధక, పోక్సో చట్టాల ప్రకారం విధించే శిక్షలపై ప్రజలకు తెలియజేయాలి.
- మైనర్ బాలికను వివాహం చేసుకుని, ఆమెతో సంసారం చేస్తే బాల్య వివాహ చట్టం-2006, పోక్సో చట్టం-2012 (సవరణ చట్టం-2019) ప్రకారం శిక్ష తప్పదు. మైనర్ బాలికను వివాహం చేసుకున్న వరుడికి బాల్య వివాహ నిషేధ చట్టం-2006లోని సెక్షన్ 9 ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా, లేదా రెండూ కలిపి విధించవచ్చు.
- బాల్య వివాహంతో 18 ఏళ్లలోపు బాలికతో సంసారం చేస్తే అత్యాచారం కేసుగా నమోదు చేసి పోక్సో సవరణ చట్టం-2019 సెక్షన్ 4(జీ) ప్రకారం పదేళ్లకు తక్కువ కాకుండా జైలు శిక్ష, జరిమానా, జీవిత ఖైదు విధించే అవకాశం ఉంది.
- 16 ఏళ్ల లోపు బాలికను వివాహం చేసుకుని సంసారం చేస్తే అత్యాచారం కేసులో పోక్సో సవరణ చట్టం-2019 సెక్షన్ 4(జీజీ) ప్రకారం ఇరవై సంవత్సరాల కంటే తక్కువ కాకుండా జైలు శిక్ష, జరిమానా, జీవిత ఖైదు విధిస్తారు.
- బాల్య వివాహాలు నిర్వహించిన వరుడు, వధువు తల్లిదండ్రులకు, వారి బంధువులకు శిక్ష తప్పదు. వారికి రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తారు. వీరికి పోక్సో చట్టం-2012 సెక్షన్ 17 ప్రకారం కూడా శిక్ష పడుతుంది.

మిర్చి అ'ధర'హో!

- కర్నూలు మార్కెట్‌లో క్వింటా గరిష్ట ధర రూ.39వేలు



కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి ధర జోరు మీద ఉంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా మార్కెట్‌లో మిర్చి ధర పలుకుతోంది. గురువారం కర్నూలు మార్కెట్‌కు 357 మంది రైతులు 605 క్వింటాళ్ల ఎండు మిర్చి తీసుకొచ్చారు. కనిష్ట ధర రూ.3,209, గరిష్ట ధర రూ.39వేలు, మోడల్ ధర రూ.15,599గా నమోదైంది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన రైతు 70 కిలోల మిర్చిని ఈ-నామ్‌లో అమ్మకానికి పెట్టారు. దీనికి రికార్డు స్థాయిలో రూ.39వేలు లభించింది. మిర్చికి కర్నూలు మార్కెట్ చరిత్రలోనే ఇది రికార్డు స్థాయి ధర కావడం విశేషం. ఈ నెల 12న రూ.32,819, 13న రూ.35,008, 17న రూ.32,888, 18న రూ.30,786 ప్రకారం గరిష్ట ధరలు లభించాయి. బుధవారం నాటి ధరతో పోలిస్తే గురువారం క్వింటాపై రూ.8,217 పెరగడం విశేషంజిల్లాలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది మిర్చి సాగయింది.

పార్లమెంట్‌లో యోగి వేమన విగ్రహం పెట్టాలి

ఇంద్రప్రస్థ తెలుగు అసోసియేషన్ డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో యోగి వేమన విగ్రహం ఏర్పాటు చేయాలని ఇంద్రప్రస్థ తెలుగు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొమ్మరెడ్డి కోటిరెడ్డి, రూరల్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు బండ్లపల్లి మదన్‌మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏపీభవన్‌లో యోగి వేమన జయంతిని పురస్కరించుకుని నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా కట్టారుపల్లిలో ఉన్న వేమన జీవ సమాధి దగ్గర స్మృతి వనం, నేషనల్ మ్యూజియం నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వచ్చే ఏడాది నుంచైనా వేమన జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఊసరవెల్లి బాబు

ఎన్టీఆర్‌పై ప్రేమ నటిస్తూ మొసలి కన్నీళ్లు: మంత్రి బొత్స



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు లాంటి ఊసరవెల్లిని దేశంలో ఎక్కడా చూడలేదని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. గురువారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఎన్టీఆర్ మరణానికి కారణం ఎవరనేది యావత్ దేశానికి తెలుసు. ఆయనే చంపేస్తాడు... ఆయనే సమాధి చేస్తాడు... మళ్లీ ఆయనే ప్రేమ నటిస్తూ మొసలి కన్నీళ్లు కారుస్తూ దండేసి దండం పెడతారు. ఇదీ చంద్రబాబు నైజం..' అని దుయ్యబట్టారు. సంక్షేమానికి కొలమానం లాంటి వైఎస్సార్ అడుగుజాడల్లో నడుస్తూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన పలు పథకాలను దేశమంతా ఆమలు చేస్తున్నారని చెప్పారు.

అది కూడా తప్పేనా?

తాను ప్రతిపక్ష నాయకుడినంటూ చంద్రబాబు ఇష్టం వచ్చినట్లు చేస్తానంటే చూస్తూ ఊరుకోవాలా? అని మంత్రి బొత్స ప్రశ్నించారు. 'జీవో నంబర్ 1లో ఎక్కడన్నా నిషేధం విధించామా? సభలు పబ్లిక్ రోడ్లలో పెట్టాల్సి వస్తే అనుమతి తీసుకోవాలని సూచించాం. అదికూడా తప్పేనా? వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో పాదయాత్ర చేస్తున్నప్పుడు డీజీపీని అనుమతి కోరాం. ప్రతి ఎస్పీ వద్దకు వెళ్లి అనుమతి తీసుకున్నాం. వారు ఏదైనా మార్పులు చేర్పులు సూచిస్తే పాటించాం' అని తెలిపారు. జీవో 1పై విపక్షాలు కొత్తగా కలిసేది ఏముందని వ్యాఖ్యానించారు. 'వాళ్లంతా కలిసే ఉన్నారు కదా.. చంద్రబాబు, సెలబ్రిటీ పార్టీ, రామకృష్ణ... అంతా కలిసే పనిచేస్తున్నారు. మళ్లీ కొత్తగా కలిసేది ఏముంది?' అని ఎద్దేవా చేశారు. ఉద్యోగ సంఘాల డిమాండ్లు ఏమిటనే విషయం తమ వద్దకు రాలేదని, గవర్నర్ నుంచి వస్తే పరిశీలించి చేయాల్సింది తప్పకుండా చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

రాష్ట్రంలో వ్యవసాయ వృద్ధిరేటు 8% పెరిగింది

- ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ ప్రశాంతి

కడప అగ్రికల్చర్: వ్యవసాయపరంగా రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే తమ వర్సిటీ లక్ష్యమని ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి చెప్పారు. వైఎస్సార్ జిల్లా కేంద్రం కడప సమీపంలోని ఊటుకూరు వ్యవసాయ పరిశోధనస్థానంలో గురువారం నిర్వహించిన కిసాన్‌మేళాలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మన రాష్ట్రంలో వ్యవసాయ వృద్ధిరేటు 8 శాతం పెరిగిందని చెప్పారు. బోధన, పరిశోధన, విస్తరణ లక్ష్యంగా తమ విశ్వవిద్యాలయం పనిచేస్తోందన్నారు. ప్రగతిపరంగా దేశంలోనే 11వ స్థానంలో నిలిచామని, దాన్ని నంబర్‌వన్‌గా నిలిపేందుకు కృషిచేస్తున్నామని చెప్పారు. డ్రోన్ టెక్నాలజీలో డీసీ జీఏ సర్టిఫికెట్ కూడా కైవసం చేసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలోని రెండువేల ఆర్‌బీకేలకు డ్రోన్లు సరఫరా చేసేందుకు రూ.200 కోట్ల బడ్జెట్ పొందామని, పైలట్, కోపైలట్లకు కడప, తిరుపతి, మార్టూరు, విజయనగరంలలో శిక్షణ ఇచ్చేందుకు అనుమతి లభించిందని చెప్పారు.

విశాఖలో విపత్తుల నిర్వహణ కేంద్రం

- విమ్స్‌లో ఏర్పాటు చేసేందుకు నిర్ణయం
- కేంద్రానికి ప్రతిపాదనలు పంపించిన రాష్ట్ర ప్రభుత్వం



ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో విపత్తుల నిర్వహణ కేంద్రం (సెకండరీ లెవెల్ కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్ అండ్ న్యూక్లియర్ మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్-సీబీఆర్ఆర్ఎన్) ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదన పంపింది. దేశంలోని 10 రాష్ట్రాల్లో విపత్తుల నిర్వహణ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుండగా.. వాటిలో విశాఖలోని విమ్స్ ఒకటి కావడం విశేషం. కేంద్రానికి విశాఖలో విపత్తుల నిర్వహణ కేంద్రం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన పంపించినట్టు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు గురువారం తెలిపారు. ఇక్కడ విపత్తుల నిర్వహణ కేంద్రం ఏర్పాటైతే.. పరిశ్రమలలో విపత్తులు సంభవించినప్పుడు ప్రమాదాలకు గురైన వారికి ఇక్కడ అత్యున్నతమైన చికిత్స లభిస్తుందని చెప్పారు. విశాఖ సమీపంలో అధిక సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయన్నారు. వాటిలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి సమయాల్లో క్షతగ్రాతులను ఎక్కడికి తరలించాలో తెలియక ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ కేంద్రం నిమ్స్‌లో ఏర్పాటు చేస్తే క్షతగ్రాతులను నేరుగా ఇక్కడకు తరలించవచ్చన్నారు. న్యూక్లియర్ ప్రమాదాలకు గురైన క్షతగ్రాతులకు తప్ప కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్ ప్రమాదాలకు ప్రస్తుతం విమ్స్‌లో చికిత్స అందుతుందన్నారు. ఈ కేంద్రం అందుబాటులోకి రానుండటంతో న్యూక్లియర్ ప్రమాదాల క్షతగాత్రులు కోసం విమ్స్‌లో ప్రత్యేకంగా భవనాన్ని నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేంద్రం ఇక్కడ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన సీఎం జగన్‌కి, మంత్రి విడదల రజనికి కృతజ్ఞతలు తెలిపారు.

26 నుంచి కాంగ్రెస్ పాదయాత్ర

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు


విలేకరులతో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

ఒంగోలు టౌన్: కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నెల 26 నుంచి మార్చి 26వ తేదీ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. చేయి చేయి కలుపుదాం, రాహుల్ నాయకత్వాన్ని బలోపేతం చేద్దాం.. చేయి చేయి కలుపుదాం, కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దాం అనే నినాదాలతో చేపట్టనున్న పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని, తొలి సంతకం ప్రత్యేక హోదా మీదే చేస్తామని హామీ ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ పాలనపై ప్రజలు విసిగెత్తిపోయారన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి శిరివెల్ల ప్రసాద్, ఏపీ ఇన్‌చార్జి మేయప్పన్, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సైదా, డీసీసీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల నోట్లో మట్టికొట్టిన బాబు

- 844వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు


యోగి వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బహుజన నాయకులు

తాడికొండ: ఎలాంటి నిర్మాణాలకు పనికిరాని కొండవీటి వాగు ముంపు ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేసిన చంద్రబాబు రైతుల నోట్లో మట్టికొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుని రూ.కోట్లు కొల్లగొట్టాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 844వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. నిపుణుల కమిటీల నివేదికలను పక్కన బెట్టి బాబు ఇష్టారీతిగా వ్యవహరించినందునే నేడు ఈ ప్రాంతానికి ఈ దుస్థితి పట్టిందన్నారు. పేదలు విద్యా రంగంలో ఎదిగితే తమ సామాజిక వర్గానికి మించి ఉన్నత స్థానాలు అందుకుని ఆర్థికంగా ఎదుగుతారోననే అక్కసుతోనే బాబు అండ్ కో పేదలకు ఇంగ్లిష్ మీడియం విద్య అందకుండా అడ్డుపడుతుందని మండిపడ్డారు. యోగి వేమన జయంతి సందర్భంగా బహుజన పరిరక్షణ సమితి దీక్షా శిబిరంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రకు అనుమతిపై తేల్చండి

- డీజీపీకి హైకోర్టు ఆదేశం.. విచారణ ఈనెల 25కి వాయిదా

సాక్షి, అమరావతి: ప్రత్యేక హోదా-విభజన హామీల అమలుకోసం సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు తలపెట్టిన బస్సు యాత్రకు అనుమతివ్వాలని కోరుతూ ఆలిండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) పెట్టుకున్న దరఖాస్తును పరిగణనలోకి తీసుకుని, దానిపై తగిన ఉత్తర్వులు వెలువరించాలని, నాలుగు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తిచేయాలని డీజీపీని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. బస్సు యాత్రకు అనుమతి కోరుతూ తాము పెట్టుకున్న దరఖాస్తుపై పోలీసులు ఎలాంటి నిర్ణయం వెలువరించలేదని, తమ యాత్రకు అనుమతినిచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు హైకోర్టులో అత్యవసరంగా లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ రఘునందన్‌రావు విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ, బస్సు యాత్ర మొత్తం శాంతియుతంగా, ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా జరుగుతుందన్నారు. ప్రభుత్వ న్యాయవాది టీఎంకే చైతన్య స్పందిస్తూ.. ఈ యాత్రను పోలీసు చట్ట నిబంధనలకు లోబడే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు ఆయా జిల్లాల ఎస్పీల అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, దరఖాస్తుపై తగిన ఉత్తర్వులు జారీచేయాలని డీజీపీని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈనెల 25కి వాయిదా వేశారు.

స'లక్ష'ణంగా త్రివర్ణ శోభితం!





ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 5 లక్షల బియ్యం గింజలపై జాతీయ జెండా రంగులు అద్ది ఔరా అనిపిస్తున్నాడు. పొడవైన బాసుమతి రకం బియ్యాన్ని ఎంచుకుని వాటికి రంగులు దిద్ది.. వాటిని చార్టులపై అంటించాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన పురోహితుడు పెద్దింటి రామచంద్రశ్రీహరి(రామం). గతంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నెలా 15 రోజుల్లో 3 లక్షల బియ్యం గింజలపై జాతీయ జెండా రంగులను అద్ది రికార్డు సృష్టించాడు. తాజాగా సుమారు రెండు నెలల్లో 5 లక్షల బియ్యం గింజలపై రంగులు అద్దడం ద్వారా తన రికార్డును తానే బ్రేక్ చేసినట్టు చెబుతున్నాడు. ఇప్పటికే ఈ అంశం పలు రికార్డు సంస్థల దృష్టికి వెళ్లినట్టు తెలిపాడు. – కొత్తపేట

అనాథలమని ఆవేదన చెంది.. ముగ్గురు అక్కచెల్లెళ్లు ఆత్మహత్య!

- 9 రోజుల తరువాత వెలుగులోకి


అక్కచెల్లెళ్లు రంజిత, బిందు, చందన (ఫైల్)

తుమకూరు: తమకు ఎవరూ లేరనే ఆవేదనతో ముగ్గురు అక్కచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘోరం కర్ణాటకలో తుమకూరు జిల్లాలోని చిక్క నాయకనహళ్ళి తాలూకా బరకనహాల్ తాండాలో గురువారం సాయంత్రం వెలుగుచూసింది. అక్కచెల్లెళ్లైన రంజిత (24), బిందు (21), చందన (18)ల తల్లిదండ్రులు చాలా ఏళ్ల కిందటే మరణించారు. వీరిని అమ్మమ్మ పోషిస్తోంది. ఆమె కూడా 3 నెలల క్రితం మరణించడంతో ముగ్గురూ కుంగిపోయారు. తాము అనాథలం అయిపోయామని బాధపడేవారు. రంజిత, బిందు ఓ గార్మెంట్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. చందన పీయూసీ చదువుతోంది. 9 రోజుల నుంచి ముగ్గురూ ఇంటి నుంచి బయటకు రాలేదు. గురువారం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు విషయాన్ని తెలిపారు. వారు వచ్చి ఇంటి పైకప్పు తీసి పరిశీలించగా ముగ్గురూ ఉరివేసుకున్నట్లు గుర్తించారు. మృతదేహాలు కుళ్లిపోవడంతో వాటిని చిక్కనాయకనహళ్ళిలోని ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టానికి తరలించారు.

రాష్ట్రాన్ని విడిచి వెళ్తే టీడీపీకి ఓటేసేవాళ్లు తగ్గుతారు..

- ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్నారైలతో చంద్రబాబు

సాక్షి, అమరావతి: ప్రతి ఒక్కరూ రాష్ట్రాన్ని విడిచి వెళ్తే తెలుగుదేశానికి ఓటు వేసేవాళ్లు తక్కువవుతారని, అది పార్టీకి నష్టమని.. అయినా తాను ప్రోత్సహించబట్టే ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు ఉన్నారని ప్రతిపక్ష నేత చంద్రబాబు చెప్పారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఎన్నారై టీడీపీ సెల్ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూఎస్ఏ, కువైట్ తదితర దేశాల నుంచి వచ్చిన ఎన్నారై టీడీపీ నేతలు చంద్రబాబును కలిశారు. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో గురువారం దాదాపు 20 నిముషాలపాటు వారితో చంద్రబాబు మాట్లాడారు. పార్టీకి జరిగే నష్టాన్ని పట్టించుకోకుండా ప్రతి ఒక్కరి భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతోటే గతంలో తాను ఎన్నో కాలేజీలు పెట్టి విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించబట్టే.. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు గర్వించే స్థాయిలో ఉన్నారని చెప్పారు. ప్రపంచ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఇప్పటికే టాప్‌లో ఉన్న యూదులను మించి రానున్న 20 ఏళ్లలో తెలుగువారు ఎదగాలని పిలుపునిచ్చారు.

జీడిమామిడి సాగు విస్తీర్ణం పెరగాలి

జాతీయ సదస్సులో వక్తలు


జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ వీబీ పటేల్ తదితరులు

తాడేపల్లిగూడెం : దేశంలో జీడిమామిడి సాగు విస్తీర్ణం, దిగుబడి పెరగాల్సిన అవసరం ఉందని, దీని కోసం రైతులకు నాణ్యమైన అంటు మొక్కలను విరివిగా అందించాలని వక్తలు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో జీడిమామిడి సాగు అభివృద్ధిపై అఖిలభారత పరిశోధన సమన్వయ పథకం కింద మూడు రోజుల పాటు జరుగనున్న జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. తొలిరోజు సమావేశంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఏకే సింగ్ ఢిల్లీ నుంచి జూమ్ యాప్ ద్వారా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జీడిమామిడి పండు, ముడి గింజల ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడం ద్వారా రెట్టింపు ఆదాయం పొందవచ్చన్నారు. జీడిమామిడిలో సేంద్రియ సాగు విధానాలు విరివిగా ప్రచారం చేయాలని చెప్పారు. మేలైన రకాలతో జీడిమామిడి సాగు ఒక ప్రణాళిక ప్రకారం విస్తరింపజేయడానికి వివిధ రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకునే విధంగా జన్యురకాలను అభివృద్ధి చేయాలని ఐసీఏఆర్ అసిస్టెంటు డైరెక్టర్ జనరల్ డాక్టర్ వీబీ పటేల్ చెప్పారు. ఉద్యాన వర్సిటీ ఉప కులపతి డాక్టర్ టి.జానకీరామ్ మాట్లాడుతూ దేశంలోనే పేరెన్నికగన్న బాపట్ల పరిశోధనా స్థానం ఇప్పటివరకు పది రకాల మేలైన జీడిమామిడి రకాలను అభివృద్ధి చేసిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పరిశోధనా స్థానాల్లో జీడిమామిడి అభివృద్ధిపై జరిగిన పరిశోధనా ఫలితాలను పుత్తూరు జీడిమామిడి పరిశోధన డైరెక్టరేట్ సంచాలకుడు డాక్టర్ జె.దినకర్ సమీక్షించారు. ఉద్యాన వర్సిటీ పరిశోధన సంచాలకుడు ఎల్.నారం నాయుడు, అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి.

దివ్యాంగులకు సివిల్స్ కోచింగ్

సాక్షి, అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు వీలుగా పోటీ పరీక్షల్లో రాణించేలా దివ్యాంగులకు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సివిల్స్‌తో పాటు జాతీయ స్థాయిలో అనేక ఉద్యోగాలకు దివ్యాంగులను సన్నద్ధం చేసేలా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం(ఎస్వీ యూనివర్సిటీ)ని ఎంపిక చేసినట్టు రాష్ట్ర మహిళా శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర గురువారం ఉత్తర్వులిచ్చారు. ప్రభుత్వం ప్రస్తుత విద్యా సంవత్సరానికి రూ.25 లక్షలు మంజూరు చేసింది. రాష్ట్రంలోని విద్యావంతులైన దివ్యాంగులకు ఎస్వీ యూనివర్సిటీలో ప్రత్యేక శిక్షణను త్వరలో ప్రారంభించనున్నారు. నిపుణులైన విద్యావేత్తలతో వీరికి సివిల్ సర్వీసెస్, గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీ, బ్యాంకింగ్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ) వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇప్పిస్తారు. శిక్షణతో పాటు యూనివర్సిటీ క్యాంపస్‌లో భోజన, వసతి(హాస్టల్) కల్పిస్తారు. ఇది ఇలా ఉంటే.. సీఎం వైఎస్ జగన్ పెద్ద మనస్సుతో ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడు శాతం ఉన్న దివ్యాంగుల రిజర్వేషన్‌ను నాలుగు శాతానికి పెంచుతూ 2019లో ఉత్తర్వులిచ్చారు.

క్లుప్తంగా...

నిందితుల్ని నిరవధికంగా జైల్లో ఉంచలేం: సుప్రీం
లఖీంపూర్ ఖేరి కేసులో వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో రైతు ల ప్రాణాలను తీసిన లఖీంపూర్ ఖేరి హింసాకాండ కేసులో ప్రధాన నిందితుడైన కేంద్ర మంత్రి కుమారుడు ఆశిష్ మిశ్రా బెయిల్ పిటిషన్‌పై తీర్పును సుప్రీంకోర్టు గురువారం వాయిదా వేసింది. మిశ్రాకు బెయిలిస్తే తప్పుడు సంకేతాలు వెళతాయని యూపీ ప్రభుత్వం వాదించింది. దాంతో, నేరస్తుడని రుజువు కాకుండా నిందితుల్ని నిరవధికంగా జైల్లో ఉంచకూడదంటూ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జే.కే. మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ''కేసులో బాధిత రైతులు కూడా జైల్లో ఉన్నారు. మిశ్రాకు బెయిలివ్వకుంటే వారూ జైల్లోనే మగ్గాల్సి వస్తుంది'' అని పేర్కొంటూ తీర్పును రిజర్వ్ చేసింది.

మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం... 10 మంది దుర్మరణం

ముంబై: మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో గురువారం ఉదయం ముంబై–గోవా జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న వ్యాన్‌ను అతివేగంగా దూసుకెళ్తున్న ట్రక్కు ఢీకొనడంతో వ్యాన్‌లోని 10 మంది ప్రాణాలు కోల్పోయారు. బాధితులంతా దగ్గరి బంధువులే.

మిశ్రాపై 4 నెలల నిషేధం

న్యూఢిల్లీ: తప్పతాగి విమానంలో మధ్యలో తోటి ప్రయాణికురాలిపై మూత్రం పోసిన ఘటనలో నిందితుడు శంకర్ మిశ్రాపై నాలుగు నెలలపాటు ప్రయాణ నిషేధం విధిస్తున్నట్లు ఎయిరిండియా గురువారం ప్రకటించింది. గతంలో ప్రకటించిన 30 రోజుల నిషేధం దీనికి అదనమని స్పష్టంచేసింది. ఇప్పటికే మిశ్రా పేరును సంస్థ నో ఫ్లై లిస్ట్‌లో చేర్చింది. తమ నిర్ణయాన్ని ఇతర ఎయిర్‌లైన్ సంస్థలకు కూడా తెలియజేయనుంది. మిశ్రా ప్రస్తుతం జైల్లో ఉన్నారు. ఘటనకు సంబంధించి విమాన సిబ్బందికి డీజీసీఏ నోటీసులివ్వడం తెలిసిందే.

డీఎంకే నేతపై తమిళనాడు గవర్నర్ పరువు నష్టం దావా

సాక్షి, చెన్నై: డీఎంకే పార్టీ అధికార ప్రతినిధి శివాజీ కృష్ణమూర్తిపై తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి గురువారం పరువు నష్టం దావా వేశారు. ఇటీవల ఓ రవిని ఆయన తీవ్ర పదజాలంతో దూషించారు. ఆయనపై కేసు నమోదుకు పోలీసు కమిషనర్‌ను రాజ్‌భవన్ ఇప్పటికే ఆదేశించింది. డీఎంకేకు, గవర్నర్‌కు చాలాకాలంగా పలు విషయాల్లో ఉప్పూ నిప్పుగా ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడిది కేసుల దాకా వెళ్లడం చర్చనీయాంశమైంది.

ముందుంది ముప్పు

వాతావరణ మార్పులతో పెను విపత్తులు
- జోషి మఠ్ కుంగుబాటు దానికే సంకేతం
- నష్ట నివారణ చర్యలు తక్షణావసరం
- లేదంటే పరిస్థితి చేయి దాటే ప్రమాదం

దేవభూమి ఉత్తరాఖండ్‌లోని జోషి మఠ్‌లో కాళ్లకింది నేల ఉన్నపళంగా కుంగిపోతున్న తీరు పర్యావరణపరంగా మానవాళి ముందున్న పెను ముప్పును కళ్లకు కట్టింది. పరిస్థితి చేయి దాటక ముందే మేల్కొనాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తు చేసింది. జోషి మఠ్ సమస్యకు కారణమైన అడవుల విచ్చలవిడి నరికివేత, పెచ్చరిల్లిన వాతావరణ కాలుష్యం వంటివి ప్రపంచమంతటినీ వేధిస్తున్న సమస్యలే. వాటి పర్యవసానాలను గ్లోబల్ వార్మింగ్, ఆకస్మిక వరదలు, తీవ్ర కరువుల రూపంలో అన్ని దేశాలూ చవిచూస్తూనే ఉన్నాయి. ఈ ప్రాకృతిక విపత్తుల తీవ్రత కొన్నేళ్లుగా బాగా పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం. ఇవన్నీ మనిషి అత్యాశకు ప్రకృతి ప్రతిస్పందన తాలూకు సంకేతాలే. వాటిని ఇప్పటికైనా అర్థం చేసుకుని తక్షణం నష్ట నివారణ చర్యలు చేపట్టాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. ''లేదంటే అతి త్వరలో పరిస్థితి పూర్తిగా చేయి దాటడం ఖాయం. ఇప్పుడు జోషి మఠ్‌లో జరుగుతున్నది రేపు అన్నిచోట్లా జరుగుతుంది. ప్రకృతితో ఇష్టారాజ్యపు చెలగాటం అంతిమంగా వినాశనానికే దారి తీస్తుంది'' అంటూ హెచ్చరిస్తున్నారు.

ఏం జరుగుతుంది?

గ్లోబల్ వార్మింగ్ తదితరాల వల్ల సముద్ర మట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ ధోరణి కొన్నేళ్లుగా వేగవంతమవుతోంది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా తీర ప్రాంతాలు క్రమంగా నీట మునుగుతాయి. మానవాళిపై పెను ప్రభావం చూపగల పరిణామమిది. ఎందుకంటే ప్రపంచ జనాభాలో పదో వంతుకు పైగా సముద్ర తీర ప్రాంతాల్లోనే వ్యాపించి ఉంది. మహా నగరాల్లో కూడా అధిక శాతం అక్కడే ఉన్నాయి. అవన్నీ మునగడమో, పూర్తిగా నివాసయోగ్యం కాకుండా పోవడమో జరుగుతుంది. ఫలితంగా కోట్లాది మంది పొట్ట చేత పట్టుకుని వలస బాట పడతారు. వారందరికీ పునరావాసం, ఉపాధి తదితరాలన్నీ అతి పెద్ద సవాళ్లుగా నిలుస్తాయి. మానవాళి చరిత్రలో ఇది పెను విపత్తుగా మారినా ఆశ్చర్యం లేదు. అంతేగాక మితిమీరిన కాలుష్యం ఇప్పటికే ప్రాణాంతక వ్యాధులకు దారి తీస్తోంది. సురక్షితమైన తాగునీటికి చాలా దేశాల్లో ఇప్పటికే తీవ్ర కొరత ఏర్పడింది. ముున్ముందు ఇది మరింత తీవ్రతరం కానుంది. ప్రజలు సరైన తిండికి, తాగునీటికే కాదు, పీల్చేందుకు స్వచ్ఛమైన గాలికి కూడా నోచుకోని పరిస్థితి తలెత్తనుంది!


మాటలకే పరిమితం

పర్యావరణ నష్టాలకు అడ్డుకట్ట వేసేందుకు చారిత్రక పారిస్ ఒప్పందం మొదలుకుని పలు కాప్ శిఖరాగ్రాల దాకా పేరుకు ప్రయత్నాలెన్నో జరుగుతున్నాయి. కానీ చిత్తశుద్ధితో కూడిన చర్యలు మాత్రం కన్పించడం లేదు. కర్బన ఉద్గారాల తగ్గింపు తదితరాలకు సంబంధించి గొప్ప లక్ష్యాలు నిర్దయించుకోవడం, తర్వాత మర్చిపోవడం ఆనవాయితీగా సాగుతోంది. ఎవరికి వారు పొరుగు దేశమే ప్రధానంగా బాధ్యత తీసుకోవాలన్నట్టుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. కళ్లు మూసుకుని పాలు తాగుతున్న చందంగా వ్యవహరిస్తున్నారు.

ఎటు చూసినా విపత్తులే...

- మంచు ఖండమైన అంటార్కిటికాతో పాటు ప్రపంచవ్యాప్తంగా హిమానీ నదాలు శరవేగంగా కరుగుతున్నాయి. దీని దుష్ప్రభావం పర్యావరణంపై చాలా రకాలుగా ఉండబోతోంది.
- ఆర్కిటిక్ బ్లాస్ట్ కారణంగా ముందుగా ఇంగ్లండ్ తదితర యూరప్ దేశాలు అతి శీతల వాతావరణంతో అల్లాడాయి. తర్వాత అమెరికా దాని దెబ్బకు 10 రోజులకు పైగా దాదాపుగా స్తంభించిపోయింది. దేశ చరిత్రలో ఎన్నడూ ఎరగనంతటి చలి గాలులు, మంచు తుఫాన్లతో అల్లాడింది. వేల కోట్ల డాలర్ల ఆస్తి నష్టం చవిచూసింది.
- అమెరికాలో ఇటీవలి దాకా కార్చిచ్చులతో అల్లాడిన కాలిఫోర్నియా ఇప్పుడేమో కనీవినీ ఎరగని వరద బీభత్సంతో తల్లడిల్లుతోంది.
- ఉత్తర భారతం కొన్నేళ్లలో ఎన్నడూ లేనంతటి చలితో వణుకుతోంది.
- పొరుగు దేశం పాకిస్తాన్ గతేడాది దేశ చరిత్రలో ఎన్నడూ చూడనంతటి వరదలతో అతలాకుతలమైంది. మూడొంతుల ప్రాంతాలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. ఆ ప్రభావం నుంచి పాక్ ఇప్పటికీ కోలుకోలేదు.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఏటా 10 సెం.మీ. కుంగిన జోషీ మఠ్!

జోషి మఠ్‌లో నేల 2018 నుంచి ఏటా 10 సెంటీమీటర్ల చొప్పున కుంగుతూ వస్తోందట! అధునాతన శాటిలైట్ ఇమేజ్ విశ్లేషణ ఆధారంగా జరిగిన ఒక తాజా అధ్యయనంలో ఈ మేరకు తేలింది.

ఎన్ని నష్టాలో...!

- వాతావరణ మార్పుల దుష్పరిణామాలతో మానవాళిలో ఏకంగా 85 శాతం ఇప్పటికే తీవ్రంగా ప్రభావితమవుతోంది.
- ఉష్ణోగ్రతలు పదేళ్లకు 0.18 సెంటీగ్రేడ్ చొప్పున పెరుగుతున్నాయి.
- కర్బన ఉద్గారాలు 2020 కల్లా 3,481 కోట్ల టన్నులకు చేరాయి.
- మొత్తం కర్బన ఉద్గారాల్లో 50 శాతానికి 10 శాతం అత్యంత ధనిక దేశాలే కారణమవుతున్నాయి.
- గత 50 ఏళ్లలో వాతావరణ మార్పుల వల్ల ఆర్థికంగా 3.64 లక్షల కోట్ల డాలర్ల నష్టం వాటిల్లినట్టు అంచనా.
- వాతావరణ మార్పుల వల్ల వచ్చే వ్యాధులకు 2030 నుంచి ఏటా 25 లక్షల మంది బలవుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది.
- వాతావరణ మార్పుల ఫలితంగా 2050 కల్లా ఏకంగా 30 కోట్ల మందికి పైగా నిర్వాసితులవుతారని అంచనా.

కారణాలేమిటి?

- దశాబ్దాల తరబడి విచ్చలవిడిగా సాగుతున్న అడవుల నరికివేత
- బొగ్గు తదితర శిలాజ ఇంధనాల మితిమీరిన వాడకం
- కోట్లాది టన్నుల ప్రమాదకర వ్యర్థాలను సముద్రాల్లోకి వదలటం
- భూగర్భ జలాలను ఇష్టారాజ్యంగా తోడేయడం, విచ్చలవిడి డ్రిల్లింగ్
- అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్న కాంక్రీట్ నిర్మాణాలు

నష్ట నివారణకు ఏం చేయాలి?

- శిలాజ ఇంధనాలకు వీలైనంత త్వరగా స్వస్తి పలకాలి. సౌర విద్యుత్ తదితర సంప్రదాయేతర ఇంధన వనరులకు మళ్లాలి.
- నీరు, ఇంధనం తదితర వనరుల పొదుపుపై మరింతగా దృష్టి పెట్టాలి.
- పచ్చదనాన్ని వీలైనంతగా పెంచాలి.
- ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి.
- వ్యర్థాల రీసైక్లింగ్‌పై బాగా దృష్టి పెట్టాలి.



ఇక చాలు..

న్యూజిలాండ్ ప్రధాని జెసిండా అనూహ్య రాజీనామా

పదవికి న్యాయం చేయలేనని వ్యాఖ్య • నివ్వెరపోయిన ప్రపంచ దేశాలు

వెల్లింగ్టన్: పదవీ కాలం ఇంకా పది నెలలుంది. ప్రజా బలమూ ఉంది. అయినా ఆమె పదవి కోసం తాపత్రయపడలేదు. బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలనా, లేదా అనే ఆలోచించారు. ప్రధాని పదవి వీడాల్సిన సమయం వచ్చిందంటూ హుందాగా తప్పుకున్నారు. ఆమె ఎవరో కాదు. ప్రగతి శీల పాలనకు పెట్టింది పేరైన న్యూజిలాండ్ ప్రధాన మంత్రి జెసిండా ఆర్డెర్న్. ఆమె వయసు 42 ఏళ్ల మాత్రమే. రాజకీయంగా ఎంతో భవిష్యత్ ఉంది. సమర్థ పాలకురాలిగా, శక్తిమంతమైన నాయకురాలిగా పేరుంది. కరోనా సంక్షోభం, మైనార్టీ ఊచకోత, ప్రకృతి వైపరీత్యాలు సవాల్ ఏదైనా ఆ సమయంలో ఆమె చూపించిన సంయమనం సర్వత్రా ప్రశంసలు అందుకుంది. అయినప్పటికీ ప్రధాన మంత్రి పదవికి జకిండా ఆర్డెర్న్ రాజీనామా చేశారు. ప్రధానమంత్రిగా ఫిబ్రవరి 7 తన ఆఖరి రోజని కన్నీళ్లని అదిమిపెట్టుకుంటూ గురువారం లేబర్ పార్టీ సభ్యుల సమావేశంలో ప్రకటించి ప్రపంచ దేశాలను షాక్‌కి గురి చేశారు. ''నేనూ మనిషినే. ఎంత కాలం చెయ్యగలమో అంతే చేస్తాం. అప్పుడు సమయం వస్తుంది. ఇప్పుడు నా సమయం వచ్చింది. ఒక దేశాన్ని నడిపించడం సర్వోన్నతమైన పని. అంతే సవాళ్లతో కూడుకున్నది. అనూహ్యంగా వచ్చే సవాళ్లను, పదవితో సంక్రమించిన బాధ్యతల్ని పూర్తి స్థాయిలో సమర్థంగా నిర్వహించలేనప్పుడు ఎవరూ ఆ పదవిలో ఉండకూడదు. ఉండలేరు కూడా. ప్రధాని పదవిలో ఉండడానికి మీరు సరైన వ్యక్తా, కాదా అన్నది తెలుసుకోవడం కూడా మీ బాధ్యతే. ఇంక ఈ పదవికి నేను న్యాయం చెయ్యలేనని నాకు అనిపిస్తోంది. అందుకే తప్పుకుంటున్నాను. నేనేదో వచ్చే ఎన్నికల్లో ఓడిపోతానని ఈ పదవిని వీడడం లేదు. ఆ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచే సత్తా మనకుంది'' అని పార్టీ సభ్యులతో ఆమె ఉద్విగ్నభరితంగా చెప్పారు. గత ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని సాధించిన జెసిండా హఠాత్తుగా ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారోనన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.

ఎందరో మహిళలకు స్ఫూర్తి

జెసిండా 2017లో 37 ఏళ్లకే ప్రధాని అయ్యారు. అత్యంత పిన్న వయసులో ఆ ఘనత సాధించిన వ్యక్తిగా రికార్డులకెక్కారు. ఎందరో మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. ప్రపంచమంతటా రైట్ వింగ్ ప్రభుత్వాలున్న నేపథ్యంలో వామపక్ష భావజాలం కలిగిన ఆమె కొత్త తరానికి ప్రతినిధిగా నిలిచారు. ప్రధానిగా ఉంటూనే బిడ్డకు జన్మనిచ్చారు! కుటుంబ బాధ్యతలు కూడా ముఖ్యమేనని ఈ తరం అమ్మాయిలకు సందేశమిచ్చారు. పొత్తిళ్లలో పాపతోనే ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సమావేశంలో పాల్గొన్నారు. బిడ్డను లాలించే తల్లికే ప్రజల్ని పాలించడం బాగా తెలుస్తుందన్న సామెతను నిజం చేస్తూ, సంక్షోభం ఎదురైన ప్రతిసారీ తానేంటో ఎప్పటికప్పుడు నిరూపించుకుంటూ వచ్చారు. న్యూజిలాండ్ చరిత్రలోనే చీకటి రోజుల్ని 2019 మార్చిలో ఎదుర్కొన్నారు. క్రైస్ట్‌చర్చ్‌లో రెండు మసీదులపై ఒక దుండగుడు దాడి చేసి ప్రార్థనలు చేసుకుంటున్న 51 మంది ముస్లింల ప్రాణాలను నిర్దాక్షిణ్యంగా తీసినప్పుడు చలించిన హృదయంతో బాధితుల పట్ల ఆమె చూపించిన దయ, సానుభూతి ప్రజలందరి మనసుల్లో చెరగని ముద్ర వేసింది. కాల్పులు జరిగిన కొద్ది వారాల్లోనే సెమీ ఆటోమేటిక్ తుపాకుల్ని నిషేధిస్తూ ఆమె కఠిన చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. 50 వేలకిపైగా తుపాకుల్ని, ఏఆర్–15 స్టైల్ రైఫిల్స్‌ని ధ్వంసం చేశారు. ఇక కరోనా సంక్షోభాన్ని ఆమె ఎదుర్కొన్న తీరు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. కరోనా వైరస్ సరిహద్దుల్లోనే కట్టడి చేయడానికి ఆమె తీసుకున్న చర్యలకు అందరూ భేష్ అన్నారు. వాతావరణ మార్పులే ప్రపంచ దేశాలకు అసలైన సవాల్ అని నమ్మిన ఆమె కర్బన ఉద్గారాలను పూర్తిగా నిర్మూలించడానికి 2050ని లక్ష్యంగా నిర్ణయిస్తూ విధానపరమైన నిర్ణయాలు ప్రకటించారు. ప్రధానిగా ఆమె తెగువ, శక్తి సామర్థ్యాలకు ప్రజలు ఫిదా అయ్యారు. 2020 ఎన్నికల్లో రికార్డు విజయం ఆమెకు కట్టబెట్టారు.

మా సిఫార్సులను... పదేపదే తిప్పి పంపొద్దు

- కేంద్రానికి కొలీజియం స్పష్టీకరణ
- మూడోసారి ఐదు పేర్ల సిఫార్సు
- పలు హైకోర్టులకు మరో 20 పేర్లు



న్యూఢిల్లీ: న్యాయమూర్తులుగా తాము చేసిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం పదేపదే తిప్పి పంపజాలదని సుప్రీంకోర్టు కొలీజియం మరోసారి స్పష్టం చేసింది. పలు హైకోర్టులకు న్యాయమూర్తులుగా ఇప్పటికే పలుమార్లు చేసిన ఐదు గత సిఫార్సులను తాజాగా మరోసారి కేంద్రానికి పంపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.కె.కౌల్, జస్టిస్ కె.ఎం. జోసెఫ్‌తో కూడిన సుప్రీంకోర్టు కొలీజియం మంగళ, బుధవారాల్లో సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వీరిలో తాను స్వలింగ సంపర్కినని ప్రకటించుకున్న సీనియర్ అడ్వకేట్ సౌరభ్ కృపాల్ కూడా ఉన్నారు. ఆయనను ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమించాలన్న 2021 నవంబర్ 11 నాటి సిఫార్సును కొలీజియం తాజాగా పునరుద్ఘాటించింది. న్యాయవాదులు ఆర్.జాన్ సత్యంను మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా, సోమశేఖర్ సుందరేశన్‌ను బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా తిరిగి సిఫార్సు చేసింది. వీరితో పాటు అమితేశ్ బెనర్జీ, సఖ్య సేన్‌ను కలకత్తా హైకోర్టు న్యాయమూర్తులుగా వెంటనే నియమించాలని కూడా పేర్కొంది. అలాగే కర్నాటక, అలహాబాద్, మద్రాస్ హైకోర్టులకు న్యాయమూర్తులుగా మరో 20 పేర్లను సిఫార్సు చేసింది. వీరిలో 17 మంది న్యాయవాదులు, ముగ్గురు జడ్జిలున్నారు. ఈ సందర్భంగా కేంద్రాన్ని ఉద్దేశించి కొలీజియం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తమ సిఫార్సులను కేంద్రం పదేపదే తిప్పి పంపడాన్ని అనుమతించలేమని స్పష్టం చేసింది. అమితేశ్, సేన్ పేర్లను కేంద్రం ఇప్పటికే రెండేసిసార్లు తిప్పి పంపింది. అమితేశ్ తండ్రి జస్టిస్ యు.సి.బెనర్జీ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి. గోద్రాలో సబర్మతి రైలు ప్రమాదం వెనక కుట్రకోణమేదీ లేదని తేల్చిన కమిషన్‌కు సారథి. ఇక సత్యం ప్రధాని మోదీపై విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారని, ప్రభుత్వ విధానాలు, పథకాలపై సుందరేశన్ ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారని వారి పేర్లను కేంద్రం తిప్పి పంపింది. ఈ అభ్యంతరాలను కొలీజియం తాజాగా తోసిపుచ్చింది. స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తీకరించడం రాజ్యాంగపరమైన పదవులు చేపట్టేందుకు అడ్డంకి కాబోదని స్పష్టం చేసింది.

హిమగర్భంలో భారీ ఉల్క



న్యూఢిల్లీ: అంటార్కిటికాలో దట్టమైన మంచు గర్భంలో 7.6 కిలోల బరువైన ఉల్కను అంతర్జాతీయ సైంటిస్టుల బృందం వెలికితీసింది. మంచు ఖండంలో ఇంతటి భారీ ఉల్క దొరకడం అత్యంత అరుదైన విషయమని పేర్కొంది. గత డిసెంబర్ 11 నుంచి నెల రోజుల పాటు జరిపిన అన్వేషణలో మరిన్ని చిన్న సైజు ఉల్కలు కూడా దొరికాయి. శాటిలైట్ ఇమేజీలు, జీపీఎస్ సాయంతో వీటి జాడను కనిపెట్టారు. ''ఇవి బహుశా ఏదో ఆస్టిరాయిడ్ నుంచి రాలి పడి ఉంటాయి. వేలాది ఏళ్లుగా మంచు గర్భంలో ఉండిపోయాయి. వీటిని పరిశోధన నిమిత్తం బ్రెసెల్స్‌కు పంపాం. అందులో భూమి ఆవిర్భావంపై కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది'' అని సైంటిస్టులు చెబుతున్నారు.

ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ మలివాల్‌కు... నడిరోడ్డుపై వేధింపులు!

తెల్లవారుజాము తనిఖీ వేళ అసభ్యంగా ప్రవర్తించిన తాగుబోతు



హరీశ్



స్వాతి మలివాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్‌కు దేశ రాజధానిలో ఘోర అవమానం జరిగింది. కంఝావాలాలో యువతిని కొందరు కారుతో ఢీకొట్టి 12 కిలోమీటర్లు ఈడ్చుకెళ్లి మరణానికి కారణమైన ఉదంతం నేపథ్యంలో రాత్రిళ్లు బస్టాండ్‌ల వంటి చోట్ల మహిళలకు కనీస భద్రతపై తనిఖీ కోసం స్వాతి మలివాల్ తన బృందంతో కలిసి గురువారం తెల్లవారుజామున మూడింటపుడు ఎయిమ్స్ ప్రాంతంలో పర్యటించారు. ఎదురు బస్టాప్‌లో ఉన్న వారితో మాట్లాడుతుండగా తప్పతాగిన 47 ఏళ్ల హరీశ్ చంద్ర తన కారులో అక్కడికొచ్చి స్వాతిని కారులో కూర్చోవాలని బలవంతపెట్టాడు. అందుకు ఆమె నిరాకరించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికే మళ్లీ వచ్చి బూతులు తిడుతూ కారులో కూర్చోవాలని తప్పుడు సంజ్ఞలు చేశాడు. కోపంతో ఆమె అతడిని పట్టుకోబోగా కారు తలుపు అద్దం పైకెత్తాడు. దీంతో కార్ డోర్‌కు, అద్దానికి మధ్య స్వాతి చేయి ఇరుక్కుంది. కారులో పారిపోతూ స్వాతిని అలాగే కొన్ని మీటర్ల దూరం ముందుకు ఈడ్చుకెళ్లాడు. అదృష్టవశాత్తు ఆమె ఎలాగోలా చేతిని విడిపించుకోగలిగింది. కొద్దిసేపటికే అక్కడికొచ్చిన పోలీసులకు స్వాతి విషయం చెప్పడంతో వెంటనే కారు జాడ కనుక్కొని నిందితుడు హరీశ్‌ను అరెస్ట్‌చేశారు. 'సాక్షాత్తు మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కే ఇలా జరిగితే దేశ రాజధానిలో ఎంతటి దారుణ పరిస్థితి ఉందో ఊహించుకోవచ్చు' అని తనకు జరిగిన అవమానకర ఘటనపై స్వాతి హిందీలో ట్వీట్‌చేశారు.

అభివృద్ధే మాకు ముఖ్యం

ఓటు బ్యాంకు రాజకీయాలకు మేం సుదూరం: మోదీ



రాయచూరు రూరల్/శివాజీనగర/ముంబై: అభివృద్ధే తమకు అత్యంత ప్రధాన అంశమని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఇతర పార్టీల్లా ఓటు బ్యాంక్ రాజకీయాలు తమకు పట్టవన్నారు. గురువారం కర్నాటకలో కాలువలు, తాగునీరు, రహదారి సంబంధ పలు ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. యాద్గిరి, కలబుర్గి జిల్లాల్లో బహిరంగ సభల్లో మాట్లాడారు. ''రాష్ట్రంలోని బీజేపీ సర్కార్ కేవలం రాష్ట్రాభివృద్ధిపైనే దృష్టిపెడుతుంది. ఇతర పార్టీల మాదిరిగా ఓటు బ్యాంక్ రాజకీయాలుచేయదు. కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే పార్టీ అధికారంలో ఉంటే ఎంతో మేలు చేకూరుతుంది. డబుల్ ఇంజన్‌తో డబుల్ లాభం, డబుల్ సంక్షేమం, డబుల్ వేగంతో అభివృద్ధి. ఇందుకు కర్నాటకే చక్కని ఉదాహరణ. యాద్గిరి వంటి వెనకబడిన జిల్లాలను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి'' అన్నారు. కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటకలో మోదీ పర్యటించడం నెలరోజుల్లో ఇది రెండోసారి. 52,072 మంది లంబాడీలకు మోదీ ఇంటి హక్కు పత్రాలను అందజేశారు.

మహారాష్ట్రలో రూ.38వేల కోట్ల ప్రాజెక్టులు..

అనంతరం ముంబైలో పర్యటించిన మోదీ మహారాష్ట్రలో రూ.38 వేల కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముంబై మెట్రో 2ఏ, 7 లైన్లను ప్రారంభించి ప్రయాణించారు. పలు కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలకు ఎంపికైన 71 వేల మందికి మోదీ శుక్రవారం వర్చువల్‌గా నియామక పత్రాలు అందజేయనున్నారు.

రాయడమంటే ప్రతిఘటించడమే

జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో నోబెల్ గ్రహీత అబ్దుల్ గుర్నాహ్

జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి: రచించడమంటే ప్రతిఘటించడమేనని నోబెల్ సాహితీ పురస్కార గ్రహీత, టాంజానియా–బ్రిటిష్ రచయిత అబ్దుల్ రజాక్ గుర్నాహ్ అన్నారు. గురువారం జైపూర్‌లో 16వ జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌నుాయన ప్రారంభించి కీలకోపన్యాసం చేశారు. ''రచన ద్వారా ప్రతిఘటన అంటే నిరంకుశులను ఎదిరించడం, ఉపన్యాసాలివ్వడమే కాదు. ఏవి సజీవంగా ఉండాలో వాటిని సజీవంగా ఉంచుకోవడానికి ప్రయత్నించడం కూడా'' అన్నారు. వేడుకలో ఫెస్టివల్ డైరెక్టర్లు సంజయ్ రాయ్, విలియమ్ డార్లింపల్, నమిత గోఖలే పాల్గొన్నారు.

ఐదురోజుల వేడుక

జనవరి 19 నుంచి 23 వరకు ఐదురోజుల పాటు జరుగనున్న ఈ భారీ సాహితీ ఉత్సవంలో 11 అంతర్జాతీయ, 20 దేశీయ భాషల నుంచి వక్తలు, రచయితలు, అనువాదకులు, పబ్లిషర్లు పాల్గొంటున్నారు. మలయాళ కవి సచ్చిదానంద్‌ను 'మహాకవి కన్హయ్యాలాల్ సేథియా' అవార్డు, లక్ష రూపాయల నగదుతో సన్మానించనున్నారు.

ప్రజాధనం లూటీ చేయడంలో బీజేపీ బిజీ: రాహుల్

లఖాన్‌పూర్/పఠాన్‌కోట్: ప్రజల దృష్టిని కీలక సమస్యల పై నుంచి మళ్లించి తప్పుడు జీఎస్‌టీ వంటి విధానాలతో ప్రజాధనాన్ని బీజేపీ సర్కార్ దోచుకుంటోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కన్యాకుమారి నుంచి మొదలై దాదాపు 3,200 కిలోమీటర్ల పొడవునా కొనసాగిన భారత్ జోడో యాత్రలో చివరి అంకం గురువారం జమ్మూకశ్మీర్‌లో మొదలైంది. లఖాన్‌పూర్‌లో రాహుల్‌కు భారీసంఖ్యలో కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తమ పూర్వీకులు ఇక్కడి వారేనని రాహుల్ అన్నారు. ఇక్కడికొస్తే సొంతింటికి వచ్చిన భావన కలుగుతోందన్నారు. అంతకు ముందు పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో సభలో మాట్లాడుతూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. 'ప్రతీ మతం మరో మతంపై ఘర్షణకు దిగేలా, ఒక కులం వారు మరో కులం వారితో కొట్లాడేలా, ఒక భాష మాట్లాడే వారు మరో భాష మాట్లాడేవారితో గొడవకు దిగేలా విద్వేష వాతావరణాన్ని సృష్టిస్తోందన్నారు.

గుజరాత్ ఘర్షణలకు మోదీయే బాధ్యుడు!

- బీబీసీ డాక్యుమెంటరీ
- పక్షపాత ధోరణి: కేంద్రం
- మోదీకి రిషి సునాక్ మద్దతు

లండన్/న్యూఢిల్లీ: 2002లో గుజరాత్‌లో వెయ్యి మందిని బలి తీసుకున్న మత ఘర్షణలకు నాటి సీఎం నరేంద్ర మోదీయే నేరుగా బాధ్యుడంటూ బీబీసీ ప్రసారం చేసిన డాక్యుమెంటరీ వివాదాస్పదంగా మారింది. 'ఇండియా: ది మోదీ క్వశ్చన్'' పేరుతో బ్రిటన్లో ప్రసారమైన ఈ డాక్యుమెంటరీ భారత్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. బ్రిటన్ ప్రభుత్వం రహస్యంగా చేసిన విచారణలో ఈ మేరకు తేలిందని అందులో పేర్కొన్నారు. 2002 ఫిబ్రవరి 27న గోధ్రాలో సబర్మతి ఎక్స్‌ప్రెస్ బోగికి దుండగులు నిప్పు పెట్టి 59 మంది కరసేవకుల్ని సజీవదహనం చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా మత ఘర్షణలు పెల్లుబుకాయి. ఆ సమయంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం అల్లర్లను కట్టడి చేయకుండా ప్రోత్సహించిందని ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో దీనిపై బ్రిటన్ రహస్యంగా విచారణ చేయించిందని వార్తలొచ్చినా ఆ నివేదికను బయటపెట్టలేదు. బీబీసీ తాజా డాక్యుమెంటరీలో ఆ నివేదికలో కొన్ని పేజీలను చూపించారు. అందులో 'గుజరాత్ మత ఘర్షణలకు మోదీయే నేరుగా బాధ్యుడు' అన్న వాక్యాలను హైలైట్ చేసి మరీ చూపించారు. ఒక వర్గం వారిని లక్ష్యంగా చేస్తూ కుట్రపూరితంగా, ప్రణాళిక ప్రకారం హింసకు దిగారంటూ నివేదిక ఆరోపించింది. దీన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. బీబీసీ డాక్యుమెంటరీ తప్పుడు ప్రచారంలో ఒక భాగమని, పక్షపాతంతో రూపొందించారని విమర్శించింది.

మోదీకి మాయని మచ్చ: జాక్ స్ట్రా

గోధ్రా మత ఘర్షణలప్పుడు బ్రిటన్ విదేశాంగ మంత్రిగా ఉన్న జాక్ స్ట్రా కూడా బీబీసీ డాక్యుమెంటరీలో మాట్లాడారు. ''మత ఘర్షణలు జరిగిన వెంటనే ఒక విచారణ బృందాన్ని గుజరాత్‌కు పంపించాం. వారు రాష్ట్రమంతటా తిరిగి హింస ఎలా చెలరేగిందో, దానికి కారకులెవరో సవివరంగా ఒక నివేదిక ఇచ్చారు. సీఎం మోదీ అత్యంత వ్యూహాత్మకంగా హింస జరిగే ప్రాంతాల నుంచి పోలీసుల్ని తప్పించారు. హిందూ శక్తుల్ని పరోక్షంగా ప్రోత్సహిస్తూ దారుణ మారణ కాండకు పాల్పడ్డారు. మోదీ వ్యక్తిగత చరిష్మాపై ఇదొక మాయని మచ్చ'' అని ఆరోపించారు. ''ఆ సమయంలో బయటకు చెబుతున్న దాని కంటే హింస అత్యధికంగా జరిగింది. ముస్లిం మహిళలపై దారుణమైన అత్యాచారాలు జరిగాయి. ఈ హింస అంతా రాజకీయ ప్రేరేపితమే. హిందువులు నివసించే ప్రాంతాల్లోని ముస్లింలను పూర్తిగా నిర్మూలించడం కోసమే ఘర్షణలకు పాల్పడ్డారు. నిస్సందేహంగా మోదీ నుంచే ఈ ఆదేశాలు వచ్చాయి. దీనిక వెనక వీహెచ్‌పీ హస్తమూ ఉంది'' అని ఆ నివేదిక ఆరోపించింది.

తప్పుడు ఎజెండాలో భాగమే: కేంద్రం

బీబీసీ డాక్యుమెంటరీ పక్షపాత ధోరణితో, ఒక లక్ష్యం లేకుండా సాగిందని కేంద్రం దుయ్యబట్టింది. బ్రిటన్ ఇప్పటికీ వలసవాద బుద్ధిని పోనిచ్చుకోలేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందం బాగ్చీ విమర్శించారు. ఉద్దేశపూర్వకంగా అవమానకర రీతిలో కథనాన్ని వండి వార్చారని అన్నారు. ఈ డాక్యుమెంటరీని భారత్‌లో ప్రజలు వీక్షించడానికి కుదరదని అందుకే దీని వెనకాల ఏదో ఎజెండా ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ''డాక్యుమెంటరీ కోట్లాది మంది భారతీయుల హృదయాలను గాయపరిచేలా ఉంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకున్ని అవమానించింది'' అన్నారు.

యూకే పార్లమెంటులో సునాక్ మద్దతు

ఈ అంశాన్ని బ్రిటన్ పార్లమెంటులో ఎంపీ ఇమ్రాన్ హుస్సేన్ ప్రస్తావించారు. బ్రిటన్ ప్రభుత్వమూ మోదీయే బాధ్యుడని భావిస్తోందా అని ప్రశ్నించారు. ''దీనిపై యూకే ప్రభుత్వం ఎప్పుడో ఒక వైఖరి తీసుకుంది. అందులో ఎలాంటి మార్పు లేదు'' అని రిషి బదులిచ్చారు. గుజరాత్ ఘర్షణల అనంతరం మోదీపై దౌత్యపరమైన నిషేధం విధించిన బ్రిటన్ 2012లో దాన్ని ఎత్తివేసింది.



కార్మికుల రిటైర్మెంట్ వయసును 62 ఏళ్ల నుంచి 64కు పెంచాలన్న ఫ్రాన్స్ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పారిస్‌లో కార్మిక సంఘాల సభ్యులు ఇలా నిరసనకు దిగారు. కార్మికుల హక్కులకు భంగం కలగొచ్చని, పెన్షన్ చందాపై అధిక పన్నులు వసూలుచేస్తారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 20 । జనవరి । 2023



దారిదీపం వేమన

సమాజంలోని జాఢ్యాలను పదాలు, పద్యాలతో దునుమాడిన మహా వైతాళికుడు యోగి వేమన. గురువారం బెళగావిలో కలెక్టర్ నితేష్ పాటిల్ ఆధ్వర్యంలో జయంతి ర్యాలీ

న్యూస్‌రీల్

దొరికిన చిరుతపులి

మైసూరు: జిల్లాలోని హుణసూరు తాలూకా హరళహళ్లి గ్రామ పంచాయతీతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో పశువులను చంపుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న చిరుత పులి ఎట్టకేలకు బోనులో చిక్కింది. ఇప్పటికి మూడు దూడలను, రెండు కుక్కలను చంపిన చిరుత గత 20 రోజుల నుంచి పరిసర గ్రామాల ప్రజలకు కంటికి నిద్ర లేకుండా చేసింది. దాంతో అటవీ శాఖ సిబ్బంది పలుచోట్ల బోనులు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి మగ చిరుత పులి బోనులో పడింది. దీని వయసు రెండు సంవత్సరాలు ఉంటుందని అధికారులు తెలిపారు. చిరుత దొరకడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

యశవంతపుర: మంగళూరు విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు జనవరి ఒకటి నుంచి 18వ తేదీ వరకు ప్రయాణికులు దొంగతనంగా తరలిస్తున్న 3.6 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ 2.2 కోట్లు ఉంటుంది. 8 మంది పురుష ప్రయాణికులను అదుపులోకి తీసుకున్నారు. కొందరు బంగారాన్ని పేస్ట్ మాదిరిగా చేసి లోదుస్తుల్లో దాచుకుని వెళ్తుండగా పట్టుకున్నారు. ఒక ప్రయాణికుని నుండి రూ. మూడు లక్షలు విలువగల రెండు బంగారు సిగరెట్లను స్వాధీనం చేసుకున్నట్లు గురువారం తెలిపారు.

ఎస్ఐ స్కాం సూత్రధారి ఇంటికి ఈడీ

బనశంకరి: ఎస్ఐ పరీక్షల స్కాంలో సూత్రధారి ఆర్‌డీ పాటిల్ అలియాస్ రుద్రగౌడ పాటిల్ కలబురిగి అక్క మహాదేవి లేఔట్‌లోని నివాసంపై ఈడీ అధికారులు దాడులు చేశారు. రెండు బృందాలుగా అధికారులు వచ్చి ఇంట్లో గాలించారు. ఆర్‌డీ పాటిల్ ఆ సమయంలో అక్కడే ఉన్నాడు. ఎస్ఐ అభ్యర్థుల నుంచి తీసుకున్న నగదు, ఇతర సమాచారం సేకరించారు.

వినసొంపుగా వయోలిన్ వాయిస్తూ...



గోకర్ణలో రోడ్డు పక్కన వయోలిన్ వాయిస్తున్న విదేశీయురాలు

బనశంకరి: జీవనోపాధి కోసం కళలను రోడ్డుపై ప్రదర్శించడం విదేశాలలో సాధారణంగా చూస్తూ ఉంటాము. అటువంటి దృశ్యమే ఓ ధార్మిక క్షేత్రంలో కనిపించింది. పొట్టకూటి కోసమే లేక తన కళను చూపించాలనో తపనో తెలియదు కాని ఓ విదేశీ మహిళ దేశం కాని దేశం వచ్చి వయోలిన్ వాయిస్తూ డబ్బు సంపాదన చేస్తోంది. ఉత్తర కన్నడ జిల్లాలో ప్రముఖ ధార్మిక క్షేత్రమైన కుమటా తాలూకా గోకర్ణకు వచ్చే విదేశీయులు వివిధ మార్గాల్లో డబ్బు సంపాదిస్తూ ఉంటారు. రెండు రోజులుగా ఓ విదేశీ యువతి వయోలిన్‌ను వినసొంపుగా వాయిస్తూ రోడ్డు పక్కన నిలబడి ప్రతి ఒక్కరిని ఆకర్షిస్తోంది. ప్రజలు తమకు తోచిన విధంగా సాయం చేస్తున్నారు. ఆమె ఆర్థిక సమస్యల వల్ల ఇలా యాచిస్తోందో, లేక కళారాధన చేస్తోందో తెలియడం లేదని స్థానికులు చెప్పారు.

ప్రగతిపథంలో ఉత్తర కర్ణాటక



యాదగిరి సభలో నమస్కరిస్తున్న ప్రధాని మోదీ



యాదగిరి సభలో జనావళికి అభివాదం చేస్తూ వస్తున్న ప్రధాని



కలబుర్గిలో ఇళ్ల హక్కు పట్టాలతో గిరిజనులు

- శ్రీమంతుల కోట యాదగిరి
- కలబుర్గి, యాదగిరి సభల్లో ప్రధాని మోదీ ప్రశంసల జల్లు

శివాజీనగర: ఉత్తర కర్ణాటకలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రశంసనీయం. మునుముందు రోజుల్లో మరింత ఉత్సాహంగా పురోగమనం సాగుతుంది అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు రెండూ సమృద్ధిగా అయినప్పుడు దేశ ప్రగతి సాధ్యపడుతుందన్నారు. ప్రధాని గురువారం కలబుర్గి, యాదగిరి జిల్లాల్లో పర్యటించారు. యాదగిరి జిల్లాలో సుమారు రూ. 10,800 కోట్ల అభివృద్ధి పథకాల శంకుస్థాపన, ప్రారంభాలు నెరవేర్చారు. సూరత్– చెన్నై ఎక్స్‌ప్రెస్‌వేకు సంబంధమున్న రహదారి పథకాన్ని ప్రారంభించారు.

దేశంలో 100 ముఖ్య జిల్లాల్లో యాదగిరి

ఆ తరువాత బహిరంగ సభలో మాట్లాడారు. కన్నడ భాషలో ప్రసంగాన్ని ఆరంభించారు. యాదగిరి శ్రీమంతులున్న ప్రాంతమని వర్ణించారు. అద్భుతమైన స్మారకాలు, శ్రీమంత సంస్కృతి ఈ ప్రాంతం సొంతమన్నారు. దేశంలో 100 ప్రాధాన్య జిల్లాల్లో యాదగిరి కూడా ఒకటి. 100 జిల్లాల్లో టాప్ 10లో యాదగిరి ఉందని, ఇందుకు జిల్లా యంత్రాంగాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. కాగా, సభాస్థలి టెంటు చిన్నగా ఉండడం వల్ల ఎంతోమంది బయట ఎండలో నిలబడ్డారని, మీ ఆశీస్సులే తనకు బలమని మోదీ అన్నారు. కలబుర్గిలో జరిగిన సభలో ప్రధాని మోదీ గిరిజన మహిళలకు ఇళ్ల హక్కు పత్రాలను అందజేశారు.



యాదగిరిలో హెలికాప్టర్ దిగుతున్న మోదీ



కలబుర్గి సభకు హాజరైన ప్రజానీకం

గదగ్‌లో లవ్ జిహాద్?

యశవంతపుర: నలుగురు పిల్లలున్న తల్లి భర్తను కాదని మరొకరితో వెళ్లిపోయిన సంఘటన గదగ్‌లో కలకలం పుట్టిస్తోంది. వివరాలు.. గదగ్‌వాసి ప్రకాశ్ గుజరాతి దంపతులు, అతని స్నేహితుడు మక్బూల్ బాయబడి గోవాలో పనిచేసుకుంటూ ఉంటున్నారు. మక్బూల్ తరచూ ప్రకాశ్ ఇంటికి రాకపోకలు సాగిస్తూ అతని భార్యతో చనువు పెంచుకున్నాడు. ఇటీవల వారిద్దరూ గదగ్‌కు వచ్చి గుట్టుగా కాపురం పెట్టారు. మక్బూల్‌కు ఇప్పటికే పెళ్లయినా ఆమెను ఇస్లాంలోకి మార్చి రెండో భార్యగా చేసుకున్నాడని భర్త ప్రకాశ్ ఆరోపించారు. ఆమె ఇద్దరు కూతుళ్లను తీసుకుని వచ్చేసిందని, నా భార్యాపిల్లలను కలవడానికి కూడా మక్బూల్ ఒప్పుకోవడం లేదని వాపోయాడు. ప్రకాశ్‌కు న్యాయం చేయాలని, పోలీసులు కఠిన చర్యలు తీసుకోకుంటే పోరాటం చేస్తామని శ్రీరామసేన హెచ్చరించింది. గదగ పట్టణంలో ఈ విషయం పెద్ద చర్చనీయాంశమైంది.

పోలీసు జీపులకు జరిమానా

మైసూరు: నో పార్కింగ్ చోట వాహనాలు నిలిపిన పోలీసు జీపులకు జరిమానా విధించిన ఘటన మైసూరు నగరంలో చోటు చేసుకుంది. నగరంలోని అరసు రోడ్డులో నో పార్కింగ్ చోట పోలీసులు రెండు జీపులను నిలిపారు. ఇది గమనించిన స్థానికులు మొబైళ్లలో ఫొటో తీసి ఏకంగా పోలీస్ కమిషనర్‌కు వాట్సాప్ చేశారు. అదే సమయంలో సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్ చేశారు. దీనిపై తీవ్రంగా స్పందించిన కమిషనర్ ఎవరైనా చట్టం ప్రకారం నడుచుకోవాలని, వెంటనే ఆ రెండు పోలీసు జీపులకు జరిమానా విధించాలని ఆదేశించారు. దీంతో ఒక్కో జీపునకు రూ. 1000 జరిమానా విధించారు.

అతివలపై ఇప్పటికీ చిన్నచూపేనా?



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ చంద్రు తదితరులు

- ఆలయాల్లోకి ప్రవేశం లేదా?
- మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రు

కోలారు: మహిళను దేవతగా భావించి పూజించే మన సమాజంలో పలు ఆలయాల్లో మహిళలకు ప్రవేశం లేకపోవడం శోచనీయమని, మహిళలను అర్చకులుగా ఎందుకు నియమించడం లేదని మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ కె చంద్రు ప్రశ్నించారు. గురువారం కోలారు నగరంలోని చెన్నయ్య రంగమందిరంలో న్యాయమూర్తి చంద్రు, విశ్వ కుందాపుర రచించిన పుస్తకాల విడుదల, మహిళలకు సత్వర న్యాయం అనే అంశాలపై చర్చాగోష్టిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు అర్చకులు కారాదని, ఆలయాల్లోకి ప్రవేశం లేదని రాజ్యాంగంలో ఎక్కడా లేదు, ఎలాంటి చట్టం చేయలేదన్నారు. కుల, మతాలు, లింగ తారతమ్యం లేకుండా రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశం కల్పించారన్నారు.

రాష్ట్రాన్ని ప్రయోగశాలగా మార్చారు

మతం పేరుతో దమనకాండకు గురిచేయడంలో కర్ణాటక రాష్ట్రం ప్రయోగశాలగా మారిపోయిందని ఆయన ఆరోపించారు. హిజాబ్, హలాల్, ఆజాన్‌పై వివాదాలు లేవదీస్తున్నారన్నారు. హిజాబ్ పేరుతో విద్యార్థినులను విద్యకు దూరం చేస్తున్నారన్నారు. హైకోర్టు నివృత్త న్యాయమూర్తి జస్టిస్ నాగమోహన్ దాస్ మాట్లాడుతూ నాగరికత పెరుగుతున్న కొద్దీ సమాజంలో మహిళలకు సమానత్వం సాధించడం సాధ్యం కావడం లేదన్నారు. పలు విషయాలపై మహిళలు కోర్టును ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. జేడీఎస్ తాలూకా అధ్యక్షురాలు కుర్కి రాజేశ్వరి, ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సాంగ్లియానాకు గ్లోబల్ పీస్ అవార్డు



సాంగ్లియానాకు గ్లోబల్ పీస్ అవార్డును అందజేస్తున్న కేపీ పాల్

శివాజీనగర: రిటైర్డు ఐపీఎస్ అధికారి, మాజీ ఎంపీ హెచ్‌టీ సాంగ్లియానాకు గ్లోబల్ పీస్ అవార్డును అందజేస్తున్నట్లు గ్లోబల్ పీస్, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కే.ఏ.పాల్ తెలిపారు. గురువారం బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన తొలిసారి గ్లోబల్ పీస్ అవార్డును మాజీ ప్రధాని హెచ్.డీ.దేవేగౌడకు అందజేశామని, ఆ తరువాత రూపాలికి, మూడో వ్యక్తిగా సాంగ్లియానాను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాంగ్లియానాకు అవార్డును బహూకరించారు. పాల్ మాట్లాడుతూ దేశంలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ అవినీతి కుంభకోణాలతో ఆర్థిక పరిస్థితిని దివాలాకు తీసుకొచ్చాయని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రజాశాంతి పార్టీ ముందుకు వెళుతోందన్నారు. కర్ణాటకలో శాసన సభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

అధ్వాన్నపు రోడ్లపై ఫిర్యాదుల వెల్లువ

- బీబీఎంపీ యాప్‌కి 15 రోజుల్లో 2,500 ఫిర్యాదులు
- రాజధాని రోడ్ల దుస్థితికి అద్దం





సాక్షి, బెంగళూరు: ఐటీ సిటీ బెంగళూరులో రోడ్ల గుంతలు తేలి ప్రమాదాలు జరగడం, జనం ఆస్పత్రుల పాలు కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోతుల రోడ్ల నగరంగా మారిందని ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రోడ్ల దుస్థితిపై రాష్ట్ర హైకోర్టు కూడా పలు సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో రోడ్ల పై ఫిర్యాదులు తీసుకోవడానికి బీబీఎంపీ ఫిక్స్ మై స్ట్రీట్ పేరుతో ఒక యాప్‌ను విడుదల చేసింది. గూగుల్ ప్లేస్టోర్‌లో ఈ యాప్ ఉంది. జనవరి 1 నుంచి అందుబాటులోకి వచ్చింది.

ఫిర్యాదుల హోరు

యాప్ ద్వారా నగరంలో ఎక్కడైన రోడ్లపై గుంతలు కనిపిస్తే వెంటనే ఫోటోలు తీసి పౌరులు సమాచారం అందిస్తున్నారు. ఈ యాప్‌ను ప్రారంభించిన 15 రోజుల్లోనే నగరవాసుల నుంచి సుమారు 2,500 ఫిర్యాదులు అందాయి. మా వీధిలో రోడ్డు బాగా లేదని, మా ప్రాంతంలో అధ్వాన్నంగా ఉందని నగరవాసులు ఫిర్యాదులతో హోరెత్తిస్తున్నారు. దీనిని బట్టి నిజంగానే రహదారుల పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది.

పరిష్కరిస్తున్నామన్న పాలికె

బీబీఎంపీ అధికారుల వాదన మరోలా ఉంది. సుమారు 1500 ఫిర్యాదులను పరిష్కరించినట్లు, వచ్చిన ఫిర్యాదుల్లో వచ్చినవే మళ్లీ వస్తున్నాయని, వాటిపై కూడా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. యాప్‌లో సాంకేతిక దోషాలు తలెత్తుతున్నాయని, వాటిని త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

జిల్లా జైల్లో అవినీతి కంపు!



తుమకూరు: తుమకూరు జిల్లా జైలులో ఖైదీలను చూడటానికి వచ్చే వారి నుంచి సిబ్బంది డబ్బులు తీసుకుని లోనికి అనుమతిస్తున్నారని ఆరోపణలు రావడంతో పాటు డబ్బులు తీసుకుంటున్న వీడియో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఖైదీలు జిల్లా అధికారి, జిల్లా న్యాయ సేవల ప్రాధికార, ఏడీజీపీ, లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, హోం మంత్రికి ఫిర్యాదు చేశారు. దాదాపు 40 మందికి పైగా ఖైదీలు నాలుగు పేజీల ఫిర్యాదులో జైలు సిబ్బంది అవినీతిపై ప్రస్తావించారు. సరిగా భోజనం కూడా ఇవ్వడం లేదని, నాణ్యతలేని ఆహారం ఇస్తున్నారని, జైలులోకి తమ కుటుంబ సభ్యులను అనుమతించడానికి డబ్బులు తీసుకుంటున్నారని జైలర్‌పై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నేపథ్యంలో తుమకూరు జిల్లా న్యాయ సేవల ప్రాధికార కార్యదర్శి నూరిన్నిసా జైలుకు వచ్చి విచారణ చేశారు. సిబ్బంది నెలకు రూ. 2 లక్షల దాకా వసూలు చేస్తున్నారని, ఇందులో జైలర్‌దే ప్రధాన పాత్ర అని ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

కారు వదిలి మెట్రో ఎక్కిన వధువు

బనశంకరి: బెంగళూరు నగరంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వధువు సకాలంలో కళ్యాణ మండపానికి చేరుకోవడానికి కారును వదిలిపెట్టి మెట్రో రైలులో ప్రయాణించింది. పట్టుచీర, నిండుగా బంగారు నగలు ధరించి మెట్రోలో ప్రయాణిస్తున్న వధువు వీడియో వైరల్‌గా మారింది. నాలుగు రోజుల కిందట ఈ సంఘటన చోటుచేసుకుంది. పెళ్లి మండపానికి కారులో వెళ్తున్న వధువు, ఆమె స్నేహితురాళ్లు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోగా కారును వదిలేసి సమీప మెట్రో స్టేషన్‌లో రైలు ఎక్కి ప్రయాణించారు. తరువాత పెళ్లిమండపానికి చేరుకున్నారు. ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాగా, సోషల్ మీడియాలో వైరల్ కావడానికి కూడా ఈ వీడియో చేసి ఉండవచ్చని నెటిజన్లు కామెంట్లు పెట్టారు. పెళ్లిళ్ల వీడియోలు సోషల్ మీడియాలో ఏదో ఒక కారణంతో చర్చనీయాంశం కావడం తెలిసిందే.

బాలికకు గర్భం, కామాంధునికి 22 ఏళ్ల జైలు

మండ్య: మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి గర్భవతిని చేసిన కేసులో కామాంధునికి 22 సంవత్సరాల జైలు శిక్షను కోర్టు విధించింది. వివరాలు... కరోనా వైరస్ లాక్‌డౌన్ ఉన్న సమయంలో హలగూరులో రవి అనే కామాంధుడు ఇంటి పక్కన ఉండే 7వ తరగతి బాలికను లోబర్చుకుని వాంఛలు తీర్చుకోవడంతో బాధితురాలు గర్భం దాల్చింది. బాలికను తల్లిదండ్రులు విచారించగా విషయం చెప్పడంతో హలగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు రవిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. గురువారం కేసు విచారణలో నేరం రుజువు కావడంతో రవికి 22 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ మండ్య 2వ అదనపు కోర్టు జడ్జి కే.ఎ.నాగజ్యోతి తీర్పు చెప్పారు. అలాగే రవితో పాటు బాలికను వేధించిన మహేష్ అనే వ్యక్తికి 3 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. రవికి రూ.50 వేలు, మహేష్‌కి రూ. 19 వేలు జరిమానా విధిస్తూ ఆ మొత్తాన్ని బాధిత కుటుంబానికి చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

కాంగ్రెస్ సమావేశాలకు జనసాగరం

- ప్రజాధ్వని యాత్రలో డీ.కే.శివకుమార్

శివాజీనగర: ప్రజల సమస్యలు, బాధలు, అభిప్రాయాలు సేకరించి మీకు శక్తినిచ్చేది ప్రజాధ్వని యాత్ర ఉద్దేశమని కేపీసీసీ చీఫ్ డీ.కే.శివకుమార్ అన్నారు. గురువారం హావేరి కాంగ్రెస్ ప్రజాధ్వని యాత్ర సమావేశంలో పాల్గొని మాట్లాడిన ఆయన, ప్రతిరోజు జన సాగరంతో కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయన్నారు. కోవిడ్ సమయంలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. రైతులు ఆదాయం డబుల్ చేయలేదు. అందుకు ప్రజలు మీకు ఓటు వేయాలా? అంటూ బీజేపీపై ధ్వజమెత్తారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధి కోసం అందరికీ ఉద్యోగం ఇప్పించేందుకు కొత్త ఆర్థిక విధానాన్ని ప్రకటించామని తెలిపారు. హుబ్లీలో సిద్దరామయ్య మాట్లాడుతూ కల్బుర్గిలో తాను సీఎంగా చేసిన పనులనే ప్రధాని మోదీ ఇప్పుడు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

లాల్‌బాగ్.. పుష్పపల్లకి





ఆకట్టుకునే పూల కళాకృతులు



ఆకర్షణీయంగా హరిత మయూరం

- నేటి నుంచి గణతంత్ర ఫ్లవర్ షో

బనశంకరి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా బెంగళూరు లాల్‌బాగ్ ఉద్యానంలో 213 వ ఫల పుష్ప ప్రదర్శన సందర్శకుల వీక్షణకు సిద్ధమైంది. ఈసారి బెంగళూరు నగర చరిత్ర థీమ్‌తో షో జరుగుతోంది. అంతరిక్ష రంగంలో బెంగళూరు ఖ్యాతి, ఐటీ బీటీ విజయాలు ఇలా పలు అంశాలను ప్రతిబింబించేలా పుష్ప కళాకృతులు కొలువయ్యాయి. నాడప్రభు కెంపేగౌడ కాలం నాటి గోపురాలు, దొడ్డబసవణ్ణ, మరాఠా కాలంనాటి కాడు మల్లేశ్వర దేవాలయం, టిప్పుసుల్తాన్ వేసవి విడిది, హైకోర్టు కట్టడం, బెంగళూరు ప్యాలెస్, విధానసౌధ కళాకృతులు ఇలా అనేకం గ్లాజ్‌హౌస్ ఫ్లవర్ షో లో రూపుదిద్దుకున్నాయి. ఇందుకోసం వందలాది రకాల పూలను ఉపయోగించారు. దేశ విదేశాల నుంచి పుష్పాలను తెప్పించారు. ప్రదర్శనను శుక్రవారం ఉదయం 10 గంటల కు సీఎం బొమ్మై ప్రారంభిస్తారు. భారీగా సందర్శకులు వస్తారని అంచనా.

క్లుప్తంగా

దేశభక్తి, సమాజసేవ ధ్యేయం కావాలి


హరిప్రియను సన్మానిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: దేశప్రేమ యువజనుల ధ్యేయం కావాలని, వివేకానందుని బోధనలు ఆదర్శం కావాలని ప్రాథమిక విద్యాశాఖా మంత్రి బిసి నాగేశ్ అన్నారు. బుధవారం రాత్రి దక్షిణ కన్నడ జిల్లా కుక్కే సుబ్రహ్మణ్యంలోని వల్లీశ సభా భవనంలో యువ ఐక్యతావేదిక, దక్షిణకన్నడ జిల్లా జడ్పీ ఆధ్వర్యంలో యువ సమ్మేళనం జరిగింది. మంత్రి మాట్లాడుతూ దేశభక్తితో పాటు సమాజ సేవను సైతం అలవరచుకోవాలి అన్నారు. ఈ సందర్భంగా దిక్సూచి నాట్యాలయ విద్యార్థిని హరిప్రియను మంత్రులు సన్మానించారు. బాలాజీ, మోహన్‌రాం, మనోహర రై పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం బలోపేతానికి పిలుపు

రాయచూరు రూరల్: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం బలోపేతం కావాలని రాష్ట్ర అధ్యక్షుడు శివ శంకర్ పేర్కొన్నారు. గురువారం వ్యవసాయ వర్సిటీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సంఘం ప్రథమ సమ్మేళనం, ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం టెన్త్, పీయూసీ ఉత్తమ విద్యార్థులను సన్మానించారు. ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, సంఘం జిల్లాధ్యక్షుడు జిందప్ప, ప్రధాన కార్యదర్శి సంతోష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సరస్వతి, తాయిరాజ్, రాఘవేంద్రలున్నారు.

భవిష్యత్తుకు పునాది పీయూసీ


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరణ్ణ

గంగావతి: నగరంలోని ఎంఎన్ఎం పీయూ కళాశాల ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు పీయూసీ పునాది అన్నారు. ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లాలంటే పీయూసీలో ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శాంతప్ప, కౌన్సిలర్ వాసుదేవ నవలి, వీఎస్కేయూ వర్సిటీ సభ్యులు శివానంద తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్సవాలను జరపాలి

రాయచూరు రూరల్: జిల్లా ఉత్సవాలను కూడా జరపాలని చళువళి సమితి డిమాండ్ చేసింది. గురువారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనలో సమితి అధ్యక్షులు గోవిందరాజ్ మాట్లాడారు. హావేరి, బీదర్, బళ్లారి జిల్లాల్లో ఉత్సవాలను నెరవేర్చారని, దశాబ్దం గడిచినా నేటికీ జిల్లా ఉత్సవాలు జరపలేదన్నారు. జిల్లా గడినాడు ఉత్సవాలను కూడా నిర్వహించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

కంప్లి: యజ్ఞ హోమాదుల నిర్వహణలోని శాస్త్రీయతను తెలుసుకోవాలని హెబ్బాళ మఠాధిపతి నాగభూషణ శివాచార్యులు పేర్కొన్నారు. గురువారం నెంబర్ 10 ముద్దాపుర మార్గంలోని విజయనగర కాలువ గట్టు వద్ద గల కాశి బావాజీ తాత, కల్మఠ అభినవ ప్రభుమహాస్వామి పుణ్యస్మరణోత్సవం సందర్భంగా సమాధులకు అభిషేకం, ప్రధాన దేవతలకు కలశ స్థాపన, లోకకళ్యాణార్థం సంగీత యుక్త మహారుద్ర యాగంతో పాటు అనేక ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్యక్రమంలో కాశీ బావాజీ మఠం వ్యవస్థాపకులు మల్లికార్జున స్వామి, అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

కేఆర్‌పీపీలోకి భారీగా చేరికలు


జనార్దన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన దృశ్యం

గంగావతి: పలు సమాజాల వారు, బీజేపీ కార్యకర్తలు గురువారం కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష(కేఆర్‌పీపీ)లో చేరారు. సవితా సమాజం వారు, హిరేజంతకల్‌కు చెందిన బీజేపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి లలిత నేతృత్వంలో వందలాది మంది, 23వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ రామచంద్రప్ప నేతృత్వంలో సుమారు 200 మందికి పైగా ఐరకల్‌గడ ఏరియాలో సవితా సమాజానికి చెందిన వారు కన్నడ స్వాభిమాన రక్షణా వేదిక రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో, కొప్పళకు చెందిన వారు వందలాది మంది గుంపులుగా విచ్చేసి గాలి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన పార్టీలో చేరారు.

చిక్క ఉత్సవాలకు అణ్ణామలై

యశవంతపుర: చిక్కమగళూరు జిల్లా ఉత్సవంలో గురువారం మాజీ ఐపీఎస్ తమిళనాడు బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు అణ్ణామలై పాల్గొన్నారు. ఆయనకు ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి స్వాగతించి ఎద్దుల బండిపై ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆయన గతంలో జిల్లా ఎస్పీగా పనిచేశారు. ఈసందర్భంగా జెడ్పీ సీఈఓ, కలెక్టర్, ఎంపీ తేజస్వీ సూర్యలు తదితరులు పాల్గొన్నారు.

వేమన ఆదర్శాలు అనుసరణీయం

- మహాజ్ఞాని, గొప్ప సంఘ సంస్కర్త
- గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్


రాయచూరు రూరల్: వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన దృశ్యం


బళ్లారి అర్బన్: వేమన జయంతిలో పాల్గొన్న ఐనాథ్‌రెడ్డి తదితరులు

రాయచూరు రూరల్ : సమాజంలో గతకాలం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని పెద్దలు చూపిన మార్గాలను, ఆదర్శాలను అలవర్చుకోవాలని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ పిలుపు ఇచ్చారు. గురువారం కన్నడ భవనంలో ఏర్పాటు చేసిన యోగి వేమన జయంతినుద్దేశించి ఆయన మాట్లాడారు. యోగి వేమన చెప్పిన నీతి పద్యాలు నేడు కనుమరుగయ్యాయన్నారు. కార్యక్రమంలో నగరసభ అధ్యక్షురాలు లలిత, ఏపీఎంసీ అధ్యక్షుడు అచ్యుత్ రెడ్డి, ఆర్డీఏ అధ్యక్షులు తిమ్మప్ప, మాజీ జెడ్పీ అధ్యక్షులు రామచంద్రా రెడ్డి, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, కన్నడ సంస్కృతి శాఖాధికారిణి మంగళ నాయక్, లక్ష్మీకాంతరెడ్డిలున్నారు.

ఘనంగా వేమన జయంతి

కంప్లి: వచనకారుడు, సంఘ సంస్కర్త వేమన మహాయోగి, తెలుగు భాష సర్వజ్ఞుడని తహసీల్దార్ గౌసియాబేగం తెలిపారు. గురువారం తాలూకా కార్యాలయ సభాంగణంలో వేమన జయంతిని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వేమన లౌకిక జీవితంలో ఉంటూనే సాధనతో మహాయోగి అయ్యారన్నారు. ఫిర్కా రెడ్డి జన సంఘం పదాధికారులు టీవీ.సుదర్శన్‌రెడ్డి, సదాశివప్ప, మురళి మోహన్‌రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, సందీప్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, దుర్గాప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఇటిగి శరణేగౌడ, వీఏ లక్ష్మణనాయక్, వైష్ణవి, మంజునాథ, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గంగావతిలో...

గంగావతి: మహాజ్ఞాని వేమన జయంతిని కేఆర్‌పీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు గురువారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూజలు నెరవేర్చారు. కేఆర్‌పీపీ నేత జిలాన్ పాషా మాట్లాడుతూ వేమన 12వ శతాబ్దంలో బసవణ్ణలా వేదాలను వల్లించడం ద్వారా నూతన విప్లవాన్ని సృష్టించారన్నారు. వేమన చెప్పిన ప్రతి వాక్కు గడిచే రోజుల్లో ఆచరణలో రుజువైందన్నారు. ఆయన తత్వాలను ప్రజలు పాటించడం ద్వారా సుఖజీవితాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు యమనూరు చౌడికి, వుండగౌడర్ తదితర ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేమన ఒక వర్గానికే పరిమితం కాదు

సిరుగుప్ప: సమాజ శ్రేయస్సు కోసం గ్రంథాలు, వచనాలు, కీర్తనలు, పురాణ ప్రవచనాల ద్వారా మానవత, సమానత్వ సందేశాన్ని చాటిన వేమనను ఒక వర్గానికే పరిమితం చేయకూడదని తహసీల్దార్, పండుగల ఆచరణ సమితి అధ్యక్షులు ఎస్.ఆర్.మంజునాథస్వామి తెలిపారు. ఆయన నగరంలోని టీపీ సభాంగణంలో గురువారం ఆచరించిన వేమన జయంతిలో పాల్గొని మాట్లాడారు. వేమన చూపిన బాట, ఆదర్శాలను ప్రస్తుత సమాజానికి పరిచయం చేసే ఉద్దేశ్యంతో ప్రభుత్వం జయంత్యుత్సవాలను ఆచరిస్తోందన్నారు. కార్యక్రమంలో టీపీ ఈఓ ఎం.బసప్ప, నగరసభ అధ్యక్షురాలు సుశీలమ్మ, లింగారెడ్డి, గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాయోగి రెడ్డి వేమనకు పుష్పాంజలి

బళ్లారిఅర్బన్: నగర శివార్లలోని హొసపేటె రోడ్డులో వేణివీరాపురం సమీపంలోని శ్రీశ్రీ మహాయోగి వేమన పీఠం రెడ్డి సంస్థానంలో యోగి వేమన 611వ జయంతిని గురువారం ఆచరించారు. సమాజ బాంధవులు వేమన ప్రతిమకు పూలమాలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేమన పీఠం గౌరవ అధ్యక్షులు గణపాల్ ఐనాథరెడ్డి, అధ్యక్షులు బసవరాజరెడ్డి, ఉపాధ్యక్షులు సిద్ధమ్మనహళ్లి హనుమంతరెడ్డి, కార్యదర్శి సంజీవ్‌రెడ్డి, ధర్మకార్యదర్శి శేషారెడ్డి, గోపాల్‌రెడ్డి, సూరపురెడ్డి, గంగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఎడ్లబండ్ల ఊరేగింపు


ఊరేగింపులో బారులు తీరిన ఎడ్లబండ్లు


బైస్కై ఆరంభిస్తున్న మేయర్ రాజేశ్వరి, అధికారులు

బళ్లారిటౌన్: బళ్లారి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం నగరంలోని ఏపీఎంసీ మార్కెట్ యార్డు నుంచి మున్సిపల్ కళాశాల వరకు చేపట్టిన ఎడ్లబండ్ల ఊరేగింపు ఆకట్టుకుంది. తొలుత స్థానిక మార్కెట్ యార్డు వద్ద సిటీ ఎమ్మెల్యే జి. సోమశేఖర్‌రెడ్డి ఊరేగింపును ప్రారంభించారు. ఊరేగింపులో వివిధ నృత్య కళాకారులు తమదైన శైలిలో ప్రదర్శన నిర్వహించి చూపరులను ఆకట్టుకున్నారు. జిల్లాలోని శ్రీధరగడ్డ, కొళగల్లు, సంజీవరాయనకోటె, చరకుంటె తదితర గ్రామాల నుంచి 100కు పైగా ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. జిల్లాధికారి పవన్‌కుమార్, జెడ్పీ సీఈఓ లింగమూర్తి, ఏసీ హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

బళ్లారి బైస్కైకి శ్రీకారం

జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి రెండు రోజుల పాటు చేపడుతున్న బళ్లారి ఉత్సవాల్లో భాగంగా గురువారం నుంచి ఈనెల 23 వరకు స్థానిక కొళగల్లు రోడ్డులోని విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన హెలికాప్టర్ ద్వారా బళ్లారి బైస్కైను తొలి రోజున జిల్లాధికారి ఎం.పవన్ కుమార్, నగర మేయర్ రాజేశ్వరి ప్రారంభించారు. బైస్కై ద్వారా నగరంతో పాటు మించేరి, తుమటి కొండల అందాలను ఆకాశంలో నుంచి చూడవచ్చు. దీని కోసం ఒక్కొక్కరికి రూ.3500 చొప్పున ధరను ఖరారు చేశారు. హెలికాప్టర్‌లో 6 మంది ఒకేసారి కూర్చోవచ్చు. 8 నిమిషాల పాటు గాలిలో చక్కర్లు కొడుతుంది.

మార్చి ఆఖరులోగా పనుల పూర్తికి సూచన

రాయచూరు రూరల్: జిల్లాలో వివిధ అభివృద్ధి పనులను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ మహ్మద్ యూసఫ్ అధికారులకు సూచించారు. ఆయన గురువారం జెడ్పీ భవనంలో జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. నరేగ పథకం కింద పనులు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. తరచుగా గ్రామాల్లో పర్యటించాలని, అక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన నిర్దేశించారు.

అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న మంత్రి శ్రీరాములు

బళ్లారిటౌన్: నగరంలో వివిధ అభివృద్ధి పనులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.శ్రీరాములు గురువారం భూమిపూజ నిర్వహించారు. నగరంలోని టీబీ శ్యానిటోరియం వద్ద రూ.9 కోట్ల బుడా నిధుల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులకు, రాజ్‌కుమార్ పార్కులో రూ.3.5 కోట్లతో, గాంధీనగర్‌లో ఓపెన్ జిమ్, రూపనగుడిలోని హరిశ్చంద్ర ఘాట్ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సోమశేఖర్‌రెడ్డి, నాగేంద్ర, మేయర్ రాజేశ్వరి, మాలన్‌బీ, బుడా అధ్యక్షుడు మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

130 స్థానాల్లో గెలుపు మాదే

రాయచూరు రూరల్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో 130 స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి బీ.శ్రీరాములు విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం జెడ్పీ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గాలి జనార్దనరెడ్డి పార్టీ కేఆర్‌పీపీ తమ పార్టీకి బీ–టీం కాదని ఆయన అన్నారు.

22న సువర్ణ మహోత్సవాలకు ముస్తాబు


దేశభక్తి గీతానికి విద్యార్థుల రిహార్సల్


కళాశాల ఆవరణలో వేదిక నిర్మాణానికి ఏర్పాట్లు

గంగావతి రూరల్: గంగావతి సమీపంలోని విద్యానగర్‌లో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ వారి తెలుగు పాఠశాలలు స్థాపితమై 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా హెచ్.ఆర్.సరోజమ్మ ఎయిడెడ్ తెలుగు మీడియం ప్రాథమికోన్నత పాఠశాల, శ్రీగొట్టిపాటి వెంకటరత్నం ఎయిడెడ్ తెలుగు మీడియం ఉన్నత పాఠశాల, శ్రీరామనగర్ అప్పాని ఎయిడెడ్ తెలుగు మీడియం ప్రాథమికోన్నత పాఠశాలల యాజమాన్యపు నేతృత్వంలో పూర్వ విద్యార్థుల సౌజన్యం, దాతల విరాళాలతో పాఠశాలల ఆవరణలో ఈనెల 22వ తేదీ ఆదివారం జరిగే సువర్ణ మహోత్సవ వేడుకలకు శారదా విద్యా సంస్థలు ముస్తాబవుతున్నాయి. ఇందులో భాగంగా విద్యార్థులతో పలు సాంస్కృతిక నృత్యప్రదర్శనలు, దేశభక్తి గీతాభినయాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఆదర్శప్రాయుడు నేతాజీ


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బళ్లారిఅర్బన్: నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఏఐడీఎస్ఓ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ప్రమోద్ పేర్కొన్నారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన నేతాజీ జయంతిలో మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే దృఢసంకల్పంతో నేతాజీ పోరాటం చేశారన్నారు. అనంతరం విద్యార్థులు గాంధీభవన్ నుంచి రాయల్ సర్కిల్, సిటీ బస్టాండ్ మీదుగా భారీ ర్యాలీని నిర్వహించారు. ఏఐడీఎస్ఓ పదాధికారులు జీ.సౌమ్య, ఎం.శాంతి, అనుపమ, సిద్ధు, నిహారిక, ఉమా, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అడ్డపల్లకీ ఉత్సవం

బళ్లారి అర్బన్: శ్రీమద్ కాశీజ్ఞాన సింహాసనాధీశ్వర శ్రీశ్రీశ్రీ 1008 జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య భగవత్పాదుల అడ్డ పల్లకీ ఉత్సవం గురువారం గుగ్గరహట్టి, హొన్నళ్లి రోడ్డులోని శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లికార్జున శివదీక్ష మందిరంలో నిర్వహించినట్లు దేవస్థాన అర్చకులు రాజశేఖర్‌గౌడ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు సంగీతయుక్త ఇష్టలింగ మహాపూజ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో స్థానిక భక్తులతో పాటు వీరశైవ సమాజ బాంధవులు, పదాధికారులు, రక్షణా వేదిక నేతలు పాల్గొన్నట్లు తెలిపారు.

పౌరకార్మికుల ధర్నా


ఆందోళనలో పాల్గొన్న పౌరకార్మికులు

గంగావతి రూరల్: తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ బేసిక్‌పై పని చేస్తున్న నగరసభ పౌర కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. కార్మిక నాయకుడు భరద్వాజ్ మాట్లాడుతూ అర్హులైన పౌరకార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఒత్తిడి చేశారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి విజయ్ దొరరాజు, ఏఐసీసీటీయూ జిల్లాధ్యక్షులు పరశురామ, తాలూకా అధ్యక్షులు గిడ్డప్ప, పౌరకార్మిక నాయకుడు బాబర్, రమేష్, మాయమ్మ, నింగమ్మ, పార్వతమ్మ, దుర్గప్ప, గంగప్ప, శేఖరప్ప పాల్గొన్నారు.

ధార్వాడ ఐఐటీలో చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్

హుబ్లీ: ధార్వాడ ఐఐటీ ఆవరణలో మొత్తం రూ.2.10 లక్షల విలువ చేసే పైపులు, కేబుళ్లు తదితర భవన నిర్మాణ సామగ్రి చోరీకి పాల్పడిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ధార్వాడ తాలూకా చిక్కమల్లిగెవాడ గ్రామ శివార్లలోని ఐఐటీలో అదే తాలూకా ఉప్పినబెటగేరి గ్రామానికి చెందిన అల్తాఫ్, మహమ్మద్ యాసిన్, ఇస్మాయిల్, ఆజమ్‌పీర్, ఇనామ్ మొంగళకు చెందిన ఇమ్రాన్‌రసూల్ అరెస్ట్ అయిన నిందితులు. ఈ నెల 15న వీరు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనపై ధార్వాడ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితులను, చోరీకి గురైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీ హేమలత తదితరులు

గంగావతి రూరల్: మానసిక ఒత్తిడి నివారణకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్సీ హేమలతా నాయక్ అన్నారు. గురువారం జిల్లా క్రీడాంగణంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల క్రీడాకూటమిని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సాధారణంగా ప్రభుత్వోద్యోగులు శారీరక దృఢత్వం బాగుంటేనే ఒత్తిడిలో పని చేస్తారన్నారు. ఉద్యోగులందరూ కూడా తమ ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాధికారి ఎం.సుందరేశ్ బాబు, జిల్లా జెడ్పీ అధికారిణి బి.ఫౌజియా తరన్నుమ్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లాధ్యక్షులు నాగరాజ్ ఆర్.జంబణ్ణ, జిల్లా గౌరవాధ్యక్షులు సుధాకర్, ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ మాలిపాటిల్, కోశాధికారి సుశీలేంద్ర దేశ్‌పాండే, కార్యాధ్యక్షులు శివప్ప జోగి తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

ఆహార పదార్థాల వృథా వద్దు

- కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె


ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె

కోలారు : ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితిలోను వృథా చేయరాదని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజె అభిప్రాయ పడ్డారు. గురువారం నగరంలోని ఐసీఏఆర్ వ్యవసాయ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రైతుల వసతి నిలయాలు, టమాటా సంస్కరణ యూనిట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. ఏడాది క్రితం కోలారు పర్యటనకు వచ్చినప్పుడు స్థానికులు టమాటా సంస్కరణ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారన్నారు. దీనిపై కేంద్రానికి ప్రతిపాదన పంపగా అనుమతి లభించిందన్నారు. జిల్లా రైతులు ఎంతో కష్టపడి తక్కువ నీటితోనే ఉద్యాన పంటలను పండిస్తున్నారన్నారు. నేడు రోజుకు నాలుగు టన్నుల టమాటాలను సంస్కరించే యూనిట్‌ను రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటరాజ, ఎమ్మెల్సీ పూజార, ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ పాల్గొన్నారు.

23న జిల్లాలో ప్రజాధ్వని యాత్ర

కోలారు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకు వెళ్లడానికి కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన ప్రజాధ్వని బస్సు యాత్ర ఈనెల 23న కోలారులో సాగుతుందని, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కేపీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఆర్ సీతారాం తెలిపారు. గురువారం నగరంలోని కాంగ్రెస్ భవనంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికే ప్రజా ధ్వని బస్సు యాత్ర ప్రారంభమైందని, యాత్రకు ప్రజల నుంచి ఉత్తమ స్పందన లభిస్తోందన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో గుండా యాత్ర వెళుతుందన్నారు. అన్ని స్థానాలలో పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు రమేష్‌కుమార్, ఎస్ ఎన్ నారాయణస్వామి, కె వై నంజేగౌడ, ఎమ్మెల్సీలు ఎం ఎల్ అనిల్‌కుమార్, నజీర్ అహ్మద్, మాజీ ఉప సభాపతి వి ఆర్ సుదర్శన్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కోలారు : యువత మాదక ద్రవ్యాలకు సదా దూరంగా ఉండాలని, ఆరోగ్యాన్ని కాపాడుకుని ఆరోగ్యవంత భారత నిర్మాణానికి సహకరించాలని ఆరోగ్య శిక్షణాధికారి ప్రేమా తెలిపారు. గురువారం నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై నిర్వహించిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మత్తు కలిగించే పదార్థాలకు బానిసలు కావద్దు, ఇది తమ ఆరోగ్యంపై తీవ్ర పరిణామాలను చూపుతుందన్నారు. వివిధ రకాల రోగాల పాలు కావడమే కాకుండా భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. అందువల్ల యువతీ యువకులు మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దన్నారు. ఇదే సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో భారత సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కెఎస్ గణేష్, సభ్యుడు వి పి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో తేలిన తల్లీబిడ్డల మృతదేహాలు


చెరువులో లభించిన తల్లీబిడ్డల మృతదేహాలివే

మాలూరు : పట్టణ సమీపంలోని పెద్ద చెరువులో తల్లీబిడ్డల మృతదేహాలు గురువారం లభించాయి. ఓ తల్లి తన ఇద్దరు బిడ్డలతో సహా చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం అవుతోంది. మృతులు ఎవరనే విషయం ఇంకా తెలియరాలేదు. వీరు కాలు జారి చెరువులో పడి మరణించారా? లేక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారా? అనే విషయం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. మధ్యాహ్నం పట్టణ సమీపంలోని పెద్ద చెరువులో మృతదేహాలు తేలుతుండడాన్ని గుర్తించిన స్థానికులు అందించిన సమాచారం మేరకు పట్టణ పోలీసులు చెరువు వద్దకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను వెలికి తీసిన అనంతరం పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చురీలో ఉంచారు. మృతుల సంబంధీకులు ఎవరైనా ఉంటే మాలూరు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

గంజాయి నిందకు వీడియోగ్రాఫర్ ఆత్మహత్య


అభిషేక్ (ఫైల్)

మైసూరు: యువకుని పైన గంజాయి ఆరోపణలు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురై డెత్‌నోటు రాసి పెట్టి ఉరి వేసుకొన్నాడు. మృతుడు అభిషేక్ (23) వీడియోగ్రాఫర్‌గా పనిచేసేవాడు. స్నేహితునికి ఇచ్చిన అప్పును వసూలు చేసుకోవాలని అభిషేక్ అక్కడికి వెళ్లిన సమయంలో కొందరు గంజాయి తాగుతుండగా పోలీసులు వచ్చి అందరినీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. నీవు కూడ గంజాయి తాగుతావా అని అభిషేక్‌ని ప్రశ్నించారు. తాగలేదని చెప్పడంతో ఇంటికి పంపించారు. విచారణకు అవసరమైతే మళ్లీ రావాలని సూచించారు. ఈ సంఘటనతో తీవ్రంగా మథనపడ్డాడు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, కానీ ఇలాంటి ఆరోపణలు రావడం భయంగా ఉందని, ఇప్పటివరకు ఎన్ని కష్టాలు వచ్చినా కూడా భరించానని, కానీ ఎలాంటి తప్పు చేయకున్నా గంజాయి తాగినట్లు పట్టుకుని వెళ్లడాన్ని తట్టుకోలేకపోతున్నానని రాశాడు. ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. అశోకపురం పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 21 నుంచి ముట్టడిలు

శివాజీనగర: జస్టిస్ ఏ.జే.సదాశివ కమిషన్ నివేదిక అమలుపరచడంలో జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 21 నుంచి ఫిబ్రవరి 10 వరకు బెంగళూరులో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేల, ఎంపీల ఇళ్లను ముట్టడించి వినతి పత్రాలను సమర్పించనున్నామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు ఎం.సీ.శ్రీనివాస్ తెలిపారు. గురువారం బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం చేకూరాలంటే జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్ చేయాలని 2012లో సదాశివ కమిషన్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందన్నారు. ఇప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని, అందుకే ఇళ్ల ముట్టడికి సిద్ధమైనట్లు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్.రామకృష్ణ, కత్తి వెంకటేష్, త్రిలోకచందర్, నారాయణమ్మ, డేవిడ్ రంగన్న పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు శిక్షణా శిబిరం


శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సిరుగుప్ప: స్థానిక ప్రజాప్రతినిధులు అన్ని వర్గాలతో సౌజన్యంగా మెలుగుతూ తమ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అధికారులు నిర్లక్ష్యం చేస్తే వెంటనే తమ దృష్టికి తెస్తే పరిశీలించి బాధ్యులపై చర్యలు చేపడతామని తాలూకా జేఎంఎఫ్‌సీ న్యాయమూర్తి హాజీ హుసేన్ యాదవాడ తెలిపారు. ఆయన నగరంలోని టీపీ సభాంగణంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన శిక్షణా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో టీపీ ఈఓ ఎం.బసప్ప, గ్రామస్థాయి అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల మధ్య పని చేస్తే మంచి ఫలితాలు


ప్రారంభిస్తున్న బీఎల్ సంతోష్, మంత్రి మునిరత్న

కోలారు : వచ్చే ఎన్నికలను పార్టీలో అందరూ కలిసికట్టుగా 60 రోజుల పాటు అహోరాత్రులు కష్టపడి ప్రజల మధ్యకు వెళ్లి పని చేస్తే మంచి ఫలితాలను చూడవచ్చని బీజేపీ జాతీయ సమన్వయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ తెలిపారు. గురువారం నగర సమీపంలోని ప్రైవేటు కళ్యాణ మంటపంలో బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా శక్తి కేంద్రాల ప్రముఖులతో సమావేశాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మునిరత్న మాట్లాడుతూ జిల్లా ప్రజలను మోసం చేసి అధికారం అనుభవిస్తున్న నాయకులను సాగనంపాలన్నారు. జిల్లాలో బీజేపీకి ఉన్న మెరుగైన విజయావకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సిద్ధరామయ్యకు ఓటమి తథ్యం

కోలారులో పోటీ చేస్తున్న మాజీ సీఎం సిద్ధరామయ్యను బీజేపీ సమర్థంగా ఎదుర్కొంటుందని, ఆయనకు ఓటమి తథ్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మునిరత్న తెలిపారు. గురువారం నగరంలోని ప్రభుత్వ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్తూరు ప్రకాష్ చేరికతో కోలారులో బీజేపీ పటిష్టంగా ఉందన్నారు. గత ఎన్నికల్లో చాముండేశ్వరిలో ఘోరంగా ఓడినట్లుగానే కోలారులో కూడా ఓటమి పాలవుతారన్నారు. ఎంపీ ఎస్ మునిస్వామి, మాజీ మంత్రి వర్తూరు ప్రకాష్, ఎమ్మెల్సీలు వై.ఏ.నారాయణస్వామి, ఛలవాది నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యేలు వెంకటమునియప్ప, మంజునాథ్‌గౌడ, వై సంపంగి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్‌లున్నారు.

బెదిరింపులకు భయపడొద్దు

కోలారు : ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు విధినిర్వహణలో బ్లాక్ మెయిల్ చేసే వారి గురించి భయపడొద్దని, అలాంటి వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని నూతన ఎస్పీ ఎం.నారాయణ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున సన్మానం స్వీకరించి ఆయన మాట్లాడారు. ప్రామాణికంగా విధులు నిర్వహించే ఉద్యోగులకు బెదిరింపులు లాంటివి వస్తే తన దృష్టికి తేవాలన్నారు. సంఘం అధ్యక్షుడు జి సురేష్ బాబు, కార్యదర్శి అజయకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటును అమ్ముకోవద్దు

మైసూరు: ఓటు హక్కు ఎంతో అమూల్యమైనది, మెరుగైన భారత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని శాసనసభ స్పీకర్ విశ్వేశ్వర హెగ్డె కాగేరి అన్నారు. గురువారం మైసూరు నగరంలోని కళా మందిరంలో ఎన్నికల వ్యవస్థలో మార్పులు రావాలని అన్నారు. గురువారం జిల్లా యంత్రాంగం, మైసూరు పాలికె సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ....యువత డబ్బు, మద్యం కోసం ఓటును అమ్ముకోకూడదని, మంచి నాయకుడిని ఎన్నుకోవాలని అన్నారు.

ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య

మైసూరు: జీవితంపై విరక్తితో ఫొటోగ్రాఫర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చామరాజనగర జిల్లా కొళ్లెగాల పట్టణంలో చోటు చేసుకుంది. ఇక్కడి పోస్టాఫీసు రోడ్డులో ఉంటున్న గోపీ (45) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్ని సంవత్సరాల క్రితం భార్య తమిళనాడులోని సొంతూరికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపంతో జీవితంపై విరక్తి చెందిన గోపి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మైసూరులో ఆగని స్నాచింగ్‌లు

మైసూరు: రాచనగరిలో మైసూరులో స్నాచర్ల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. తాజాగా మైసూరు జిల్లా కేఆర్ నగర పట్టణంలోని బజార్‌రోడ్డులో నివాసం ఉంటున్న మణియమ్మ గురువారం ఉదయం నడుచుకుంటూ వస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో ఉన్న 20 గ్రాముల బంగారు చైన్ లాక్కొని పారిపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్‌పై నుంచి పడి మృతి..

బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మైసూరు నగరంలోని గిరియాబోపిపాళ్య గేట్ వద్ద చోటు చేసుకుంది. మృతుడిని కెఎస్ పురలో నివాసం ఉంటున్న శేఖర్ (45)గా గుర్తించారు. ఇతను గురువారం ఉదయం తన బైక్‌పై వేగంగా వస్తుండగా అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మేల్ మరవత్తూరుకు భక్తులు



బొమ్మనహళ్లి: నగరంలో బీటీఎం లేఔట్ 2వ స్టేజ్‌లో నివాసం ఉంటున్న పలువురు మహిళలు ఓం శక్తి మాల ధరించి గురువారం తమిళనాడులోని మేల్‌మరవత్తూరుకు తరలివెళ్లారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ జీఎన్‌ఆర్ బాబు భక్తుల కోసం ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించారు. దాదాపు వంద మంది తరలివెళ్లారు.

అన్ని మతాలు శాంతిని కోరుకోవాలి



బచ్చేగౌడను సన్మానిస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: ఇస్లాం మతంతోపాటు అన్ని మతాలు సమాజంలో శాంతిని కోరుకోవాలని బీజేపీ ఎంపీ బచ్చేగౌడ అన్నారు. బెంగళూరు ఉత్తర తాలూకా భూదిగెరె క్రాస్ వద్ద ఈ నెల 28 నుంచి 30వ తేది వరకు నిర్వహించే ఇస్లాం ధర్మ సందేశాల ప్రవచన కార్యక్రమాలు జరుగుతాయని, ఇందులో వేల మంది పాల్గొంటారని, గురువారం జరిగిన ముందస్తు సమావేశంలో పలువురు ముస్లిం పెద్దలతో ఆయన చర్చించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ... మూడు రోజుల పాటు ఇస్తమా జరుగుతుందని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

ప్రేమ విఫలమై.. ప్రియుడి ఆత్మహత్య

బనశంకరి: ప్రేమ విఫలం కావవడంతో ప్రియుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జ్ఞానభారతి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఉల్లాళ ఉపనగర నివాసి రోహిత్ (25) కొరియర్ కంపెనీ ఉద్యోగి. రోహిత్ ఆరేళ్లుగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఇటీవల ఇద్దరు ఏదో విషయంపై గొడవపడ్డారు. ప్రేమకు బ్రేకప్ చెప్పుకున్నారు. అప్పటి నంచి తీవ్ర మనోవేదనలో ఉన్న యువకుడు గురువారం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దారుణ హత్య

యశవంతపుర: ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన విజయపురలో జరిగింది. మల్లికార్జున దొడ్డమని (43)ని బుధవారం రాత్రి హత్య చేశారు. గురువారం తెల్లవారు జామున రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మూడేళ్ల క్రితం ఇతను బీజేపీ ఎంపీ రమేశ్ జిగజిణగి కారు డ్రైవర్‌గా పనిచేశారు. ఇటీవల ఆటోతో జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి అక్కను ఇంటి వద్ద వదిలి వస్తుండగా గుర్తు తెలియని దుండగులు అడ్డగించి హత్య చేసినట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాపుచేపట్టారు.

పల్లె జీవితానికి దర్పణం స్వదేశీ మేళా

- తుమకూరులో ప్రారంభం



ఆకట్టుకుంటున్న పల్లెసీమ జీవన చిత్రం

తుమకూరు: తుమకూరు నగరంలోని గ్లాస్ హౌస్‌లో స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఆరంభమైన స్వదేశీ మేళా ఆకట్టుకుంటోంది. 22 వ తేదీ వరకు జరిగే మేళా పల్లెసీమల జీవన చిత్రాన్ని తెలిపే అనేక వస్తు సామగ్రి అబ్బురపరుస్తోంది. ఒకప్పుడు ధాన్యాలను పిండి చేయడానికి ఉపయోగించే విసర్రాయి, గింజలను నిల్వచేసే పెద్ద మట్టి పాత్రలు, గుడిసెల నమూనాలు అనేకం ఇక్కడ ఆకట్టుకుంటాయి. నేటి తరానికి తెలియని గత కాలపు అపురూపమైన వస్తువులను ఇక్కడ చూడవచ్చు. ఈ సందర్భంగా వస్త్రాలు, అలంకరణ సామగ్రి విక్రయాలు చేపట్టారు.

విదేశీ వ్యామోహం తగదు..

అదమ్య చేతన సంస్థ అధ్యక్షురాలు తేజస్విని అనంతకుమార్ పాల్గొని మాట్లాడుతూ ఆధునికత పేరుతో మనల్ని మనమే మోసం చేసుకుంటూ విదేశీ వస్తువులపై వ్యామోహం పెంచుకుని స్వదేశీ కలలను నశించిపోయేలా చేయడం జరుగుతోందని వాపోయారు. ప్రతిఒక్కరూ కూడా స్వదేశీ వస్తువులు, జీవన విధానంపై అవగాహన కలిగి ఉండడం కోసం స్వదేశీ జాగరణ్ మంచ్ ఎంతో కృషి చేస్తోందని అన్నారు. మన ఆహారపుటలవాట్లు, ఔషధాలు, వనమూలికల మొక్కల వినియోగించడం గురించి తెలుసుకోవాలని సూచించారు.



స్టాళ్ల వద్ద సందర్శకుల సందడి



విసర్రాయిని తిప్పుతున్న తేజస్విని అనంత్ కుమార్ తదితరులు

అధికారి బెదిరింపు ఫోన్ కాల్ కలకలం

శివాజీనగర: శాంతినగర శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేయరాదని అక్కడ ఎమ్మెల్యే తరఫున ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైన ఓ అధికారి బెదిరిస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఏఏపీ) రాష్ట్ర అధికార ప్రతినిధి కే.మథాయి ఆరోపించారు. ఓ అధికారి బెదిరించారనే ఆడియోను విలేకరుల సమావేశంలో ఆయన విడుదల చేశారు. గురువారం ఆప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కేఏఎస్ అధికారి జనవరి 13న ఉదయం తనకు ఫోన్ చేశారు. సుమారు 15 నిమిషాలు మాట్లాడిన ఆయన, ఎమ్మెల్యే పేరును పలుసార్లు ప్రస్తావిస్తూ ఆయనకు మద్దతుగా మాట్లాడారని తెలిపారు. శాంతినగర నియోజకవర్గం నుంచి తాను పోటీ చేయకూడదని ఒత్తిడి చేశారని, ఒప్పుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారని మథాయి వివరించారు. సదరు ఎమ్మెల్యే ఓటమి భయంతో ఓ అధికారితో ఫోన్ చేయించటం దురదృష్టకరమని తెలిపారు.

చిక్కలో జాతరలు, సంత నిషేధం

చిక్కబళ్లాపురం: పశువుల్లో చర్మరోగ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో చిక్కబళ్లాపురం జిల్లాలో ఎద్దుల పరుస, జాతరలు నిషేధించామని కలెక్టర్ నాగరాజు తెలిపారు. రాష్ట్రంలో కొద్ది రోజులుగా పశువులు చర్మవ్యాధుల బారిన పడుతుండటంతో చర్యలు తీసుకున్నామన్నారు. నిషేధం ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 10 వరకు అమల్లో ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

చిక్కబళ్లాపురం జైలుకు ప్రశస్తి..

రాష్ట్రంలో నిర్వహిస్తున్న జైళ్లలో చిక్కబళ్లాపురం జైలు అత్యుత్తమ జైలుగా ఎంపికైందని జిల్లా జైలు సూపరింటెండెంట్ జయరామయ్య తెలిపారు. 2002 సెప్టెంబర్ నెలకు గాను బెస్ట్ ప్రిజన్ ఆఫ్ ది మంత్ అవార్డుకు ఎంపికైందన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్



ద్విచక్ర వాహనాలతో పట్టుబడిన యాసిన్

బనశంకరి: ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న వ్యక్తిని గురువారం బనశంకరి పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ. 10 లక్షల విలువైన 14 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని వసంతపురకు చెందిన యాసిన్‌గా గుర్తించారు. ఇటీవల బనశంకరి రెండోస్టేజ్ 23 క్రాస్‌లో లక్ష్మణ బగలూరు అనే వ్యక్తికి చెందిన స్కూటర్ అపహరణకు గురైంది. బాధితుడు బనశంకరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తీవ్రంగా గాలించి యాసిన్‌ను అరెస్ట్ చేశారు. ఇతని అరెస్ట్‌తో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీల కేసులు వెలుగు చూశాయి.

రేపు బెంగళూరులో ఆశీర్వాద కూడిక



దైవజనుడు రెవరెండ్ జీ.విజయ్య

శివాజీనగర: బెంగళూరు గ్లోరీ టు జీసస్ మినిస్ట్రీస్ వారిచే ఈ నెల 21న శనివారం నూతన సంవత్సర ఆశీర్వాద కూడికను జరపనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కూడికలో ఆంధ్రప్రదేశ్ బిట్రగుంటకు చెందిన దైవజనుడు రెవరెండ్ జీ.విజయ్య పాల్గొని దైవ వర్తమానాన్ని అందిస్తారు. తెలుగు ప్రజలు అధికంగా ఉన్న ఫ్రేజర్‌టౌన్, నేతాజీ రోడ్డులో ఉన్న జీసస్ కాల్స్ ప్రేయర్ టవర్‌లో నూతన సంవత్సర ఆశీర్వాద కూడికను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 5.30 గంటలకు క్రైస్తవ భక్తి పాటలతో ఆశీర్వాద కూడిక ప్రారంభమవుతుందని తెలిపారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

బనశంకరి: విద్యార్థులకు నేడు మంచి అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యా వాచస్పతి అరళుమల్లిగే పార్థసారథి తెలిపారు. గురువారం బనశంకరి మూడోస్టేజ్ ఐటీఐ లేఔట్‌లోని శ్రీకృష్ణ విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన కాలేజీ వార్షికోత్సవం, ద్వితీయ పీయూసీ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశాన్ని నిర్మించడంలో ప్రముఖ పాత్ర వహించాలని, తల్లిదండ్రులు, గురువులు ఆశీర్వాదంతో ఉత్తమపౌరులుగా ఎదగాలని తెలిపారు. అనంతరం విద్యాసంస్థ అధ్యక్షుడు రుక్మాంగదనాయుడు మాట్లాడుతూ.. గురువు లేకపోతే దేనిని సాధించలేమని, అందరి ఉత్తమ శ్రేయస్సుకు గురువులే కారణమని అన్నారు. ఈ సందర్భంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ డీఎం.గోపాల్, మల్లారిభట్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దొంగ అరెస్ట్



మండ్య: మండ్య తాలూకా కేఎందొడ్డి, హలగూరు చుట్టు పక్కల గ్రామాల్లో చోరీలకు పాల్పడుతున్న సావిత్రి అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి రూ. 7 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. మళవళ్లి తాలూకాలో చోరీలు అధికం కావడంతో పోలీసులు నిఘా ఉంచారు. గురువారం హలగూరు బస్టాండ్‌వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న సావిత్రిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా చోరీల విషయం వెలుగులోకి వచ్చింది.

గోల్డ్ ఫైనాన్స్ మేనేజర్ అరెస్ట్



నిందితుడు సిద్దేశ్, స్వాధీనం చేసుకున్న సొత్తు

యశవంతపుర: గోల్డ్ ఫైనాన్స్‌లో పెట్టిన బంగారాన్ని దొంగలించి అమ్మేసిన ఫైనాన్స్ మేనేజర్‌ను నందిని లేఔట్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు క్రికెట్ బెట్టింగ్‌లు ఆడి డబ్బులను పోగొట్టుకున్నారు. దీంతో ఫైనాన్స్ సంస్థలో ఇతరులు పెట్టిన 40 గ్రాముల బంగారం దోచుకుని పరారయ్యాడు. తుమకూరు జిల్లా మధుగిరికి చెందిన సిద్దేశ్ నందిని లేఔట్‌లో ఉంటున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌కు బానిసైన సిద్దేశ్ అధిక మొత్తంలో అప్పులు చేశాడు. ఎలా తీర్చాలో తెలియక ఫైనాన్స్‌లో పెట్టిన బంగారాన్ని చోరీ చేసి పరారయ్యాడు. సంస్థ ఫిర్యాదు మేరకు దొడ్డబళ్లాపురలో తలదాచుకున్న సిద్దేశ్‌ను పోలీసులు పట్టుకున్నారు.

వేడుకగా సామూహిక వివాహాలు



సామూహిక వివాహాల దృశ్యం

మైసూరు: మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా సుత్తూరు మఠంలో గురువారం నిర్వహించిన సామూహిక వివాహ వేడుకల్లో 114 కొత్త జంటలు కొత్త జీవితంలోకి అడుగు పెట్టారు. హరగురు చరమూర్తులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, తల్లిదండ్రులు, బంధువుల సమక్షంలో కొత్తజంటలు ఒక్కటయ్యారు. కొత్త జంటలకు నూతన వస్త్రాలు, మంగళ్య చైన్, మెట్టెలు అందజేశారు.

హోసూరు వార్తలు..

ప్రేమ విషయమై యువకుడి ఆత్మహత్య

కెలమంగలం: ప్రేమ వ్యవహారంలో బంధువులు దాడి చేయడంతో జీవితంపై విరక్తి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకొన్న ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు డెంకణీకోట తాలూకా బెట్టముగిళాలం ప్రాంతానికి చెందిన నాగరాజ్ కొడుకు గిరీష్(19) ఈరోడ్‌లో ప్రైవేట్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్న ఇతను సంక్రాంతి సెలవులకు స్వగ్రామానికొచ్చాడు. ఇతడు బంధువుల అమ్మాయిని ప్రేమిస్తూ ఉన్నాడు. ఆ అమ్మాయిని గిరీష్ ఇంటికి వచ్చింది. ఇది తెలుసుకొన్న ఆమె తల్లిదండ్రులు, బంధువులు ఇరువురిపై దాడి చేశారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన గిరీష్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేసి గిరీష్‌పై దాడి చేసిన ఆరు మందిని అరెస్ట్ చేశారు.

పెళ్లి ఇష్టం లేక యువతి...

హోసూరు: తల్లిదండ్రులు పెళ్లి కోసం ఒత్తిడి చేయడంతో విరక్తి చెందిన యువతి ఆత్మహత్య చేసుకొంది. వివరాల మేరకు హోసూరు కార్పొరేషన్ పరిధిలోని జవహర్ నగర్‌కు చెందిన ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి కూతురు గిరిజ (29). ఈమెకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు ఒక సంబంధాన్ని చూశారు. ఆ యువకుడు తనకు నచ్చలేదని ఆమె చెప్పినా తల్లిదండ్రులు పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశారు. ఆవేదన చెందిన గిరిజ బుధవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఈ ఘటనపై మత్తిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

సినిమా చూసి వస్తుంటే యాక్సిడెంట్

- యువకుడు మృతి

కెలమంగలం: రెండు రోజుల క్రితం విడుదలైన తమిళ సినిమా వారిసును చూసుకుని కారులో తిరిగి వస్తుండగా చెట్టును ఢీకొనడంతో ఏర్పడిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. అంచెట్టి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం చోటు చేసుకొంది. వివరాల మేరకు తాలూకా కేంద్రం అంచెట్టికి చెందిన సబీర్ (25), సాదిక్ (24), మణివేల్ (24) ముగ్గురు కలిసి బుధవారం సినిమా చూడాలని కారులో హోసురుకెళ్లారు. సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వెళ్లుతూ అంచెట్టి సమీపంలో రోడ్డుపక్కన చెట్టును ఢీకొనడంతో ప్రమాదం ఏర్పడింది. తీవ్ర గాయాలేర్పడిన ముగ్గురినీ స్థానికులు చికిత్స కోసం బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక సబీర్ మృతి చెందాడు. సాదిక్, మణివేల్‌లకు చికిత్సనందిస్తున్నారు. అంచెట్టి పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

క్రిష్ణగిరి: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో బైకిస్ట్ మృతి చెందిన ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు... సూళగిరి సమీపంలోని కర్నపల్లి గ్రామానికి చెందిన గోవిందన్ (50) హోసూరు- క్రిష్ణగిరి జాతీయ రహదారి సూళగిరి వద్ద ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఆ మార్గంలో వచ్చిన లారీ ఢీకొంది. దీంతో గోవిందన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సూళగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మూఢనమ్మకాలపై వేమన పోరాటం



వేమన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తదితరులు

గౌరిబిదనూరు: మూఢ నమ్మకాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన వైరాగ్య మూర్తి యోగి వేమన అని ఎమ్మెల్యే శివశంకరరెడ్డి తెలిపారు. గురువారం తహసీల్దారు కార్యాలయం సభాభవనంలో వేమన జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి సామాజిక రుగ్మతపై వేమన తన కలం ఝుళిపించారని అన్నారు. వేమన అధ్యయన పీఠం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాస్, టౌన్‌ప్లానింగ్ అథారిటీ అధ్యక్షుడు రవికుమార్, బిజి వేణుగోపాలరెడ్డి, మరళూరు హనుమంతరెడ్డి, జిఆర్ గోవిందరెడ్డి, ప్రకాశరెడ్డి, జగన్నాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు కృషి చేసిన గొప్పకవి

బొమ్మనహళ్లి: వేమన పద్యాలు తెలుగు సాహిత్య వనంలో విరబూసిన హారాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ ఎం.సతీష్ రెడ్డి అన్నారు. గురువారం యోగి వేమన జయంతి వేడుకల సందర్భంగా నగరంలోని సోమసంద్రపాళ్య సర్కిల్‌లో వేమన విగ్రహానికి పూజలు చేసి మాట్లాడారు. తన పద్యాల ద్వారా మంచిని బోధించి సమాజ శ్రేయస్సుకు కృషి చేసిన గొప్ప కవి వేమన అన్నారు. వేమన ఒక సముదాయం, ఒక రాష్ట్రానికి, ఒక దేశానికి మాత్రమే పరిమితం కాదని ప్రపంచానికే ఆయన పద్యాలు, ఆయన చూపిన మార్గం ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గురుమూర్తి రెడ్డి, ఎస్.వి.ఆర్. విద్యా సంస్థల అధ్యక్షుడు. కే.వాసుదేవ, సమాజ సేవకుడు శ్రీనివాస్ రెడ్డి, సోమసంద్రపాళ మహయోగి వేమన యువకుల సంఘం సభ్యులు వెంకటేష్, మురళీధర్, సంతోష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమన ఆదర్శాలను పాటించాలి

కృష్ణరాజపురం: వేమన పద్యాలలో ఎక్కువగా లోకనీతులు, సామాజిక చైతన్యానికి సంబంధించిన అంశాలే ఎక్కువగా ఉంటాయని, అటువంటి మహాయోగిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మహాదేవపుర ఎమ్మెల్యే అరవింద లింబావళి అన్నారు. గురువారం నగరంలోని మహాదేవపుర తాలూకా పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన యోగి వేమన జయంతి వేడుకలను ప్రారంభించి, వేమన చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్, బెంగళూరు ఉత్తర తాలూకా రెడ్డిజన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో...

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి హెచ్ఎస్ఆర్ లేఔట్ కూల్ జాయింట్ సమీపంలో ఉన్న యోగి వేమన విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మాజీ రాజ్యసభ సభ్యుడు, రెడ్డి సముదాయం నాయకుడు డి.కుపేంద్రరెడ్డి వేమన విగ్రహానికి పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం నూతన క్యాలెండర్‌ను ప్రారంభించారు. వేడుకల్లో కేపీసీసీ ప్రచార సమితి సమన్వయ సమితి సభ్యుడు కే.వాసు దేవ, మాజీ కార్పొరేటర్ గురుమూర్తి రెడ్డి, టి.వాసుదేవరెడ్డి, అనిల్ఎస్. రెడ్డి, నరసింహ మూర్తి, శేఖర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

కొరగజ్జని దర్శించుకున్న నటి ప్రేమ

యశవంతపుర: నటి ప్రేమ గురువారం కాపు సమీపంలోని కొరగజ్జని దర్శించుకున్నారు. తనకు కంకణ భాగ్యం కలగాలని కోరుకున్నట్లు ఆమె తెలిపారు. ఆమెతో నటి అను అయ్యప్ప కూడా ఉన్నారు. గురువారం ఉడుపిలో ఒక కార్యక్రమంలో పాల్గొని అనంతరం ప్రేమ కొరగజ్జని దర్శించుకున్నారు.

హాసన జైల్లో తనిఖీలు

యశవంతపుర: హాసన జిల్లా జైల్లో గురువారం పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అడిషనల్ ఎస్పీ తమ్మయ్య, డీఎస్పీ ఉదయభాస్కర్‌లు తనిఖీ చేసి ఖైదీల వద్ద మొబైళ్లు, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బెళగావి జైలు నుంచి కేంద్రమంత్రి నితిన్ గడ్కరికి బెదిరింపు కాల్ వెళ్లిన నేపథ్యంలో పోలీసులు తనిఖీలు చేశారు.

ఎమ్మెల్యే కారుకు లాక్ !

బనశంకరి: బెంగళూరు నగరంలో నో పార్కింగ్ బోర్డు పెడతారు కానీ, వాటిని లెక్కచేయకుండా ప్రజలు కార్లు, బైక్‌లు పార్కు చేస్తారు. నిబంధనలు ఉల్లంఘన కింద పోలీసులకు పట్టుబడతారు. తాజాగా ఓ ఎమ్మెల్యే అదే తప్పు చేశారు. చట్టం అందరికీ సమానమే కాదా, బసవనగుడి బీఎంఎస్ కాలేజీ వద్ద మూడిగెరె ఎమ్మెల్యే స్టిక్కర్ కలిగిన థార్‌జీపు వాహనాన్ని నోపార్కింగ్ ప్రాంతంలో నిలిపారు. దీనిని గమనించిన ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని క్లాంప్‌తో లాక్ చేసి చట్టం ముందు అందరూ ఒక్కటేనని నిరూపించారు.

సప్లమ్మ పశువుల జాతరకు సన్నాహాలు



విశేష అలంకరణతో సప్లమ్మ దేవి మూలవిరాట్

హోసూరు: హోసూరు కెలవరపల్లి రిజర్వాయర్ సమీపంలోని తిమ్మసంద్రం వద్ద వెలసిన ప్రసిద్ధి గ్రామదేవత సప్లమ్మ పశువుల జాతరకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా 23వ తేదీ నుంచి సప్లమ్మ పశువుల జాతర ప్రారంభం కానుంది. బుధవారం నుంచి ఆలయంలో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామదేవత సప్లమ్మ మూల విరాట్‌ను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. 23వ తేదీ సోమవారం ఆలయ కమిటీ వారిచే విశేష పూజలు, 24వ తేదీ దేవిశెట్టిపల్లి గ్రామస్తులచే అన్నదానం, 25వ తేదీ నందిమంగలం గ్రామస్థుల అన్నదానం , 29వ తేదీ సిడి ఉత్సవం, అదే రోజు రాత్రి కురుక్షేత్రం పౌరాణిక నాటకం, పల్లకీ ఉత్సవాలు, బాణ వేడుకలు జరుగుతాయి. జాతరలో పాల్గొనే ఉత్తమ పశువులకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది.

కారుపల్లి చెరువులో తెప్పోత్సవం



చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని జే.కారుపల్లి చెరువులో గురువారం తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గత ఏడాది భారీ వర్షాల కారణంగా 20 ఏళ్ల తర్వాత చెరువు నిండడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ తెప్పోత్సవం జరిపారు. మొదట గ్రామంలో గ్రామదేవతకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పాలకుండలు, పిండిదీపాలతో ఊరేగింపుగా చెరువు వద్దకు చేరుకొని పూజలు చేసి చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు.

వేడుకగా కుచ్చుల పండుగ



వృషభాన్ని పరుగెత్తిస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి: సూళగిరి తాలూకా మరుదాండపల్లి గ్రామంలో గురువారం కుచ్చుల పండుగను ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఉదయాన్నే పశువులకు స్నానం చేయించి, అలంకరణ చేసి ఆలయం వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. అనంతరం 50కి పైగా వృషభాలను పరుగెత్తించారు. జల్లికట్టు వీరులు ఉత్సాహంగా పాల్గొని వృషభాలను నిలువరించారు. కుచ్చుల పండుగను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

గంగమ్మ ఆలయ జీర్ణోద్ధరణ



గంగమ్మదేవి మూల విరాట్

హోసూరు: హోసూరు పట్టణంలో సంతపేటలో వెలసిన గంగమ్మదేవి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో బెస్త కమిటీ సభ్యులచే పునఃరుద్ధరణ గావించారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం అమ్మవారికి విశేష అలంకరణ, అభిషేకం, వివిధ హోమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హోసూరు మాజీ ఎమ్మెల్యే కే.ఏ.మనోహరన్ పాల్గొన్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త వెంకటేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో చేగువేరా కుమార్తె



కార్యక్రమంలో అలిడా చేగువేరా, ఆస్తి ఫానియా

బాగేపల్లి: క్యూబా–లాటిన్ అమెరికాకు చెందిన విప్లవకారుడు, మానవతావాది చేగువేరా కుమార్తె డాక్టర్ అలిడా చేగువేరా, మనవరాలు డాక్టర్ ఆస్తి ఫానియా మాచిన్‌లు గురువారం బాగేపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని కమ్యూనిస్టు నేతలు, కార్యకర్తలు జాతీయ రహదారి వర్లకొండ వద్ద బైక్ ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని సూర్య కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమసమానత్వం హబ్బ కార్యక్రమాన్ని వారివురు ప్రారంభించారు. ఈ సందర్భంగా అలిడా చేగువేరా మాట్లాడుతూ... యువత మార్పు కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.


పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


తిరుపతి జిల్లా తమ్మినపట్నంలో దివ్యాంగుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు

గడప గడపకు మన ప్రభుత్వం


శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరులో మహిళలకు పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


విజయనగరంలో ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

క్లుప్తంగా...

దావోస్ లేఖపై తప్పుడు ప్రచారం

కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరిక

సాక్షి, అమరావతి : దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్)కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానిస్తూ రాసిన లేఖపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సీఎంను ఆహ్వానిస్తూ నవంబర్ 25న వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రెసిడెంట్ బోర్జ్ బ్రెండే రాసిన లేఖ నకిలీదంటూ పచ్చ మీడియా తప్పుడు ప్రచారానికి శ్రీకారం చుట్టింది. తొలుత దావోస్‌కు సీఎంకు ఆహ్వానం అందలేదంటూ చేస్తున్న ప్రచారం అబద్ధమని తేలడంతో, ఆ లేఖ నకిలీదని మరో తప్పుడు ప్రచారం మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలో డబ్ల్యూఈఎఫ్ రాసిన లేఖను యథాతథంగా విడుదల చేశామని, దీనిపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గురువారం ప్రభుత్వం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.

పోలీసులను దూషించిన అయ్యన్నపై చర్యలు తీసుకోవాలి

- ఆయన బేషరతుగా క్షమాపణలు చెప్పాలి
- రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: నిబద్ధతతో పనిచేస్తున్న పోలీసుల మనోభావాలు దెబ్బతీస్తూ అసభ్యంగా కించపరిచే వ్యాఖ్యలు చేసిన టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం డిమాండ్ చేసింది. టీడీపీ అధికారంలోకి వచ్చి తాను హోంమంత్రిని అయితే షూట్ ఎట్ సైట్ ఆర్డర్ ద్వారా పోలీసుల సంగతి తేలుస్తానని ఆయన అనడాన్ని సంఘం గురువారం ఓ ప్రకటనలో ఖండించింది. అయ్యన్నపాత్రుడు ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోతే ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. రాజ్యాంగ వ్యవస్థలపై ఏమాత్రం గౌరవం లేని ఇలాంటి బాధ్యతారహితమైన నేతలు గతంలో మంత్రులుగా చేయడం రాష్ట్ర ప్రజల దురదృష్టమని పేర్కొంది. స్వలాభం, రాజకీయ ప్రయోజనాల కోసం అయ్యన్నపాత్రుడు గతంలోనూ పలుమార్లు పోలీసు వ్యవస్థపై అవాకులు చవాకులు పేలారని విమర్శించింది. ఆయనపై న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని సంఘం తెలిపింది.

ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడండి

గవర్నర్‌కు ఉద్యోగుల సంఘం నాయకుడు సూర్యనారాయణ వినతి

సాక్షి, అమరావతి: ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకొనేందుకే గవర్నర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినట్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ చెప్పారు. గురువారం ఆయన గవర్నర్‌ను కలిసిన అనంతరం సంఘం నాయకుడు ఆస్కారరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. తమ న్యాయమైన కోర్కెలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మంత్రివర్గ ఉప సంఘం, ప్రభుత్వ సలహాదారులను కలిసి విన్నవించుకున్నా సమస్య పరిష్కారమవలేదని, గత్యంతరం లేకనే రాజ్యాంగ పదవిలో ఉన్న గవర్నర్‌ను కలిసి న్యాయం చేయాలని కోరామని చెప్పారు.

'బంగారు' బాటలో..

చిప్పగిరిలో మొదలైన పుత్తడి వెలికితీత	చిగురుకుంట, బిసనాతం గనుల్లో ఎన్‌ఎండీసీ పనులు ప్రారంభం	అనంతపురం జిల్లాలో 4 గనులకు అత్యధిక ధరతో బిడ్లు ఖరారు	మరో 6 గనులకు కొనసాగుతున్న వేలం ప్రక్రియ	రూ.10 వేల కోట్ల ఆదాయం సమకూరేలా ప్రభుత్వం ప్రణాళిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని బంగారు గనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సాధ్యమైనంత త్వరగా గనుల్లో తవ్వకాలు ప్రారంభించి ఆదాయాన్ని సమకూర్చుకునేలా అడుగులు వేస్తోంది. కొత్త బంగారు గనులకు టెండర్లు పిలిచి ఖరారు చేయడంతోపాటు గతంలో తవ్వకాలు నిలిచిపోయిన గనులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టింది. బంగారు గనుల ద్వారా రూ.10 వేల కోట్ల రాబడి లక్ష్యంగా ప్రణాళిక రూపొందించింది.



చిప్పగిరిలో మైనింగ్ ప్రారంభం

చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పాత కర్నూలు జిల్లా చిప్పగిరి బంగారు గనిలో ఇటీవలే తవ్వకాలు మొదలై ప్రయోగాత్మకంగా ఉత్పత్తి కూడా ప్రారంభమైంది. 2002లో ఇక్కడ తవ్వకాలకు జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ కంపెనీకి లీజు మంజూరు కాగా పలు కారణాలతో పనులు ప్రారంభం కాలేదు. 20 ఏళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న ఈ గనుల్లో తవ్వకాలను సీఎం జగన్ ప్రభుత్వం పట్టుదలతో ఓ కొలిక్కి తెచ్చింది. ఆ కంపెనీతో పలుదఫాలు సంప్రదింపులు జరిపి మైనింగ్ ఆపరేషన్స్ మొదలు పెట్టేలా చర్యలు తీసుకుంది. చేసింది. కంపెనీ ఇటీవల ప్రభుత్వానికి రూ.2 కోట్ల రాయల్టీ చెల్లించింది. బంగారాన్ని ప్రాసెస్ చేసే మినీ స్మెల్టర్‌ని గనిలో సొంతంగా ఏర్పాటు చేసుకుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి స్థాయిలో బంగారం వెలికితీత ప్రారంభం కానుంది.

చిగురుకుంట, బిసనాతంలో లైన్ క్లియర్..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 118 హెక్టార్లలో ఉన్న చిగురుగుంట, బిసనాతం బ్లాకుల్లో మైనింగ్ ఆపరేషన్స్ త్వరలో మొదలు కానున్నాయి. ఈ గనిని గతంలో కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌కి చెందిన భారత్ గోల్డ్ మైన్స్ లీజుకు తీసుకుంది. అయితే వివిధ కారణాల వల్ల లీజు రద్దయింది. 2018లో మళ్లీ నిర్వహించిన వేలంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌ఎండీసీ (నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) దీన్ని దక్కించుకుంది. ఇటీవలే స్టే ఆర్డర్‌ను కోర్టు ఎత్తివేయడంతో ఎన్‌ఎండీసీకి లైన్ క్లియర్ అయింది. వచ్చే ఏడాది ఈ గనిలో కూడా బంగారం ఉత్పత్తి మొదలు కానుంది.

ముందుచూపుతో ప్రణాళిక..



మైనింగ్ రంగంలో ఉన్న విస్తారమైన అవకాశాలను వినియోగించుకుంటూ ఆదాయాన్ని పెంచుకునేలా సీఎం వైఎస్ జగన్ స్పష్టమైన కార్యాచరణ ఇచ్చారు. అందులో భాగంగానే బంగారు గనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. రానున్న రోజుల్లో వీటి ద్వారా రాష్ట్రానికి ఊహించనంత ఆదాయం లభించే అవకాశం ఉంది. ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో రూపొందించిన ప్రణాళిక విజయవంతమైంది.

– వీజీ వెంకటరెడ్డి, గనుల శాఖ డైరెక్టర్



10 గనులపై ఫోకస్

కొత్త గనులపైనా దృష్టి సారించిన ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 10 బంగారు గనులకు (ఏరియాలు) కాంపోజిట్ లైసెన్సులు ఇచ్చేందుకు సిద్ధమైంది. భారత నూతన గనుల చట్టం ప్రకారం (ఎంఎండీఆర్ చట్టం) వేలం ద్వారా కాంపోజిట్ మైనింగ్ లైసెన్సులు (అన్వేషణ, ఆ తర్వాత మైనింగ్ లీజు) ఇచ్చేందుకు టెండర్లు పిలిచారు. రామగిరి నార్త్, రామగిరి సౌత్, బొక్కసంపల్లి నార్త్, బొక్కసంపల్లి సౌత్ ఏరియాలకుగాను మూడు లీజులు ముంబై కేంద్రంగా ఉన్న ఆంధ్రా మైనింగ్ కంపెనీకి దక్కాయి. దేశంలోనే అత్యధికంగా మినరల్ వాల్యూలో 20 శాతం షేర్ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించేలా ఈ బిడ్లు ఖరారయ్యాయి. మరో లీజు మంజూరు ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఉమ్మడి అనంతపురం జిల్లా జవుకులలో 57 చదరపు కిలోమీటర్లను ఆరు బ్లాకులుగా విభజించి టెండర్లు పిలిచారు. మొదటిసారి సరైన స్పందన రాకపోవడంతో ఇటీవల మళ్లీ టెండర్లు ఆహ్వానించారు. ఫిబ్రవరిలో వాటికి వేలం జరగనుంది. మారిన పరిస్థితుల్లో ఆ బిడ్లు ఖరారయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

చెత్తపన్నులు వేసేవాడిని చెత్త నా కొడుకు అనక ఏమనాలి

- ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అయ్యన్నపాత్రుడు
- పోలీసుల పైనా వీరంగం



మోతడక (తాడికొండ): టీడీపీ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడు ముఖ్యమంత్రిని నోటికొచ్చినట్లు తిడుతూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. బుధవారం రాత్రి గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడక గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. చెత్తపై పన్నులు వేసేవాడిని చెత్తనా కొడుకు అనక ఏమనాలి అని అడిగితే తనపై రెండు మూడు కేసులు పెట్టారని అయ్యన్నపాత్రుడు అన్నారు. ఇంకా 8 నెలల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతున్నారని, మళ్లీ ఈ దౌర్భాగ్యులందరూ జైలుకు పోతే పోలీసులంతా మా చంక నాకాలని అన్నారు. తనకు హోం మినిస్టర్ ఇస్తే పోలీసులు ఎవరైతే దౌర్జన్యం చేశారో లిస్టులు అన్నీ రాసుకుని నా కొడుకులను అప్పుడు చూస్తాను వారి అంతు అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడారు. షూట్ ఎట్ సైట్ అంటూ ప్రజలను రెచ్చగొట్టారు. రోజా తనను మగోడు కాదని అన్నదని, నేను మగాడిని కాదో అవునో ఆవిడకేం తెలుసండి ఒకసారి చూస్తే తెలుస్తుందని అన్నారు. అధికారముందని ఎన్టీఆర్ పేరు మార్చారని, కానీ ఆయన చరిత్ర మార్చగలరా బోసడికేల్లారా అంటూ ఊగిపోయారు. గృహ నిర్మాణ పథకం కేంద్రం ఇచ్చే నిధులని, కేంద్రానికి కొడుకు పుడితే రాష్ట్ర ప్రభుత్వం ఎత్తుకుంటున్నదన్నారు. గెలిచిన ఏడాదిలోగా బ్రాందీ షాపులు తీసేస్తానన్న ముఖ్యమంత్రి ఆ బ్రాందీ షాపులను 25 ఏళ్ళు తాకట్టు పెట్టి రూ.8 వేల కోట్లు అప్పు తెచ్చాడని, అంటే 25 ఏళ్ళు బ్రాందీ షాపులు ఉంటాయా లేదా అని ప్రశ్నించారు. ఇవన్నీ మాట్లాడితే అయ్యన్నపాత్రుడిపై కేసులు పెడతావా, పెట్టుకోరా ఏం పీకుతావో పీక్కో అంటూ వీరంగం వేశారు.

సూర్యనారాయణపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- సీఎస్‌ను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తాం
- ఉద్యోగుల్లో షో చేసేందుకే గవర్నర్‌ను కలిశారు
- ఏపీ ఎన్జీవోస్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి

సాక్షి, అమరావతి: గవర్నర్‌ను కలిసిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత కేఆర్ సూర్యనారాయణపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్జీవోల సంఘంపై విమర్శలు చేసిన సూర్యనారాయణపై మండిపడ్డారు. ఉద్యోగుల్లో షో చేసేందుకే గవర్నర్‌ను కలిశారని అన్నారు. గవర్నర్‌కు ఫిర్యాదు చేసే అధికారం ఏ ఉద్యోగ సంఘానికీ, ఉద్యోగులకు లేదని చెప్పారు. ప్రభుత్వం ఆయన్ని ఏమైనా చేయవచ్చని, ఆయన సంఘం గుర్తింపును రద్దు చేయవచ్చని చెప్పారు. సూర్యనారాయణ గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)ని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు. ఉద్యోగుల విషయంలో ప్రభుత్వ పోకడలు ఇలాగే ఉంటే ఉద్యమ కార్యాచరణకు వెళ్తామని తెలిపారు.

72 ఏళ్ల చరిత్ర ఉన్న ఏపీ ఎన్జీవోల సంఘం ఎప్పుడూ ఉద్యోగుల ప్రయోజనాల కోసమే పోరాడిందని, ఇతర సంఘాలపై నేతలెవరూ విమర్శలు చేయలేదని చెప్పారు. సూర్యనారాయణ ఇష్టానుసారం చేస్తున్న విమర్శలను ఇకపై భరించబోమన్నారు. ఆయన పీఆర్సీ చర్చలప్పుడు శ్రీకాకుళం పారిపోయారని ఎద్దేవా చేశారు. తర్వాత వచ్చి తాను ఉండి ఉంటే 30 శాతం వచ్చేదని ప్రగల్భాలు పలికారన్నారు. అదే సూర్యనారాయణ చర్చలు ముగిశాక సీఎం జగన్ వద్ద గుడ్ డీల్ అని చెప్పారన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలు తాకట్టు పెట్టి రూ. లక్షలు దండుకున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్జీవోల విషయంలో నాలుగు స్తంభాలాట ఆడటంలేదని, సూర్యనారాయణే ఒంటి స్తంభం ఆట ఆడుతున్నారని విరుచుకుపడ్డారు.

ఏపీ ఎన్జీవోల సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి మాట్లాడుతూ... సూర్యనారాయణ వెనుక ఉన్న శక్తులను ఉద్యోగులు గమనిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి సూర్యనారాయణ దొంగచాటుగా గుర్తింపును తెచ్చుకున్నారని తెలిపారు. డిపార్ట్‌మెంట్‌లో సూర్యనారాయణ అక్రమాలు చాలా ఉన్నాయన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారని, ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సంక్రాంతికి ఇవ్వాల్సిన డీఏను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం జగన్ చెప్పారన్నారు. వరుసగా 3 రోజులు సంక్రాంతి సెలవులు రావడం వల్ల సర్క్యులర్ ఇవ్వడంలో జాప్యం జరిగినట్లు సీఎంవో అధికారులు చెప్పారన్నారు.

ప్రచార ఆర్భాటం కోసమే గవర్నర్‌కు ఫిర్యాదు

ప్రచార ఆర్భాటం కోసమే ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుడు సూర్యనారాయణ గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశారని ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డి.సురేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఉద్యోగుల ప్రయోజనాలను గాలికొదిలేసి ప్రభుత్వం దగ్గర మెప్పు కోసం పాకులాడిన సూర్యనారాయణను ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఉద్యోగ సంఘం నాయకుల చేత కాని తనాన్ని ప్రభుత్వంపై రుద్దుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏపీజీఈఏ సంఘానికి ఇచ్చిన గుర్తింపుపై పునరాలోచన చేయాలని కోరారు.

కరెంట్ షాకుల్లేవ్

గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు డిస్కమ్‌ల ఊరట

సాక్షి, అమరావతి విశాఖపట్నం: విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ పంపిణీ సంస్థలు భారీ ఊరట కలిగించాయి! వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఏ కేటగిరీలోనూ చార్జీలను పెంచాలని డిస్కమ్‌లు ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. ఏటా ఏప్రిల్ 1 నుంచి కొత్త విద్యుత్ చార్జీలు అమలులోకి రావడం ఆనవాయితీ. పేదలు మినహా అన్ని వర్గాల వినియోగదారులపై ఎంతో కొంత పెంపు సాధారణంగా ఉంటుంది. అయితే అనూహ్యంగా ఈదఫా చార్జీలు పెంచాలని డిస్కమ్‌లు ప్రతిపాదించలేదు. దీంతో విద్యుత్ వినియోగదారులపై వచ్చే ఏడాది విద్యుత్ చార్జీల భారం ఉండదని స్పష్టమైంది. ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) సమర్పించిన 2023–24 వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరల ప్రతిపాదనపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ గురువారం విశాఖలో మొదలైంది. శనివారం వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారులు వెబ్ లింక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాలు (లైవ్ స్ట్రీమింగ్) చూడవచ్చు. డిస్కమ్‌ల సీఎండీలు తమ టారిఫ్ నివేదికలో గృహ, వాణిజ్య, వ్యవసాయ, పారిశ్రామిక విద్యుత్ వినియోగంపై చార్జీల పెంపునకు సంబంధించి ఎటువంటి ప్రతిపాదనలు చేయలేదు. కేవలం ఇంటెన్సివ్ పరిశ్రమల (ఫెర్రో అల్లాయిస్) టారిఫ్‌ను మాత్రమే మార్చాలని ఏపీఈఆర్సీని డిస్కమ్‌లు కోరాయి. హెచ్‌టీ పరిశ్రమలకు వర్తించే టారిఫ్‌నే వాటికీ వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశాయి. ఫెర్రో పరిశ్రమలు బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయి. అక్కడ ధరలు పెరిగినప్పుడు, వేసవిలోనూ డిస్కమ్‌ల నుంచి విద్యుత్ తీసుకుంటున్నాయి. దీనివల్ల డిస్కమ్‌లు ఆర్థికంగా నష్టపోతున్నట్లు సీఎండీలు మండలికి వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయాల స్వీకరణ

తొలిరోజు 20 మంది వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ అభ్యంతరాలు, సూచనలను, తెలియచేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరతతో గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చిత్తూరు జిల్లా పాకాలకు చెందిన మునిరత్నంరెడ్డి తిరుపతిలోని సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఆపరేషన్) సర్కిల్ కార్యాలయం నుంచి ఏపీఈఆర్సీ దృష్టికి తెచ్చారు. కుటీర పరిశ్రమలకు విద్యుత్ లోడ్ పరిమితిని 20 హెచ్‌పీ వరకు పెంచాలని కావలికి చెందిన శాంతకుమార్ కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ సరఫరా బాగుందని కడప జిల్లా నుంచి రమణారెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల తరహాలో బీసీలకు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలని పాకాల నుంచి మునుస్వామి నాయుడు విజ్ఞప్తి చేశారు. విజయవాడ ఎస్ఈ కార్యాలయం నుంచి మాట్లాడిన వామపక్ష పార్టీల నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. వ్యవసాయం, గృహాలకు మీటర్లు ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులపై భారం లేదు



విద్యుత్ వినియోగదారులపై చార్జీల భారం మోపేలా డిస్కమ్‌లు ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా గురువారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. డిస్కమ్‌లన్నీ సామాన్యులపై భారం మోపేందుకు అంగీకరించకపోవడం శుభపరిణామమన్నారు. గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులపై 2023–24లో ఎలాంటి భారం ఉండదని చెప్పారు. ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు రాయితీలు కొనసాగిస్తూ డిమాండ్ చార్జీలు, టైమ్ ఆఫ్ ది డే, కనీస చార్జీల పెంపు అంశాల్లో మార్పులు చేయాలని డిస్కమ్‌లు కోరినట్లు తెలిపారు. దీన్ని క్షుణ్నంగా పరిశీలించి తగిన నిర్ణయాన్ని తీసుకుంటామని చెప్పారు. డిస్కమ్‌లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల విషయంలో రాజకీయ ఆరోపణలన్నీ నిరాధారమని, వాస్తవ విరుద్ధమని స్పష్టం చేశారు. మూడు రోజుల పాటు ప్రతి ఒక్కరూ తమ అభ్యంతరాలను తెలియచేయవచ్చన్నారు. అందరి అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకొని ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని వెలువరిస్తామని తెలిపారు. విద్యుత్ సేవల్లో జాప్యం జరిగితే సంబంధిత డిస్కమ్‌లు వినియోగదారులకు పరిహారం చెల్లించాల్సిందేనని, దీనికి సంబంధించి వివరాలు సేకరిస్తున్నామని వెల్లడించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వారిపై భారం పడకుండా ప్రభుత్వం, ఏపీఈఆర్సీ ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. డిస్కమ్‌లు చేసే ఎన్నో ప్రతిపాదనల్ని తిరస్కరిస్తున్నామని, సహేతుక కారణాలుంటే మినహా ఈఆర్సీ అనుమతులు మంజూరు చేసే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో ఏపీఈఆర్సీ కార్యదర్శి రాజబాపయ్య, ఏపీఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు, సీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మజానార్ధనరెడ్డితో పాటు డిస్కమ్‌ల డైరెక్టర్లు ఏవీవీ సూర్యప్రతాప్, డి.చంద్రం, బి.రమేష్‌ప్రసాద్, ఎస్ఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

– ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి

అభివృద్ధి వ్యయం పరుగులు

▶ మొదటి పేజీ తరువాయి



నీటి సరఫరా, పారిశుధ్య రంగాలపై వ్యయం పెరుగుతోంది. మొత్తం వ్యయంలో అభివృద్ధి వ్యయం ఏటా పెరుగుతోంది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను మించి రాష్ట్రం అభివృద్ధి వ్యయం చేస్తోంది.

- 2020 – 21 (అకౌంట్స్)లో మొత్తం వ్యయంలో అభివృద్ధి వ్యయం 63.0 శాతం ఉండగా 2022 – 23 బడ్జెట్ అంచనాల ప్రకారం 72.0 శాతానికి పెరిగింది. ఇదే సమయంలో అభివృద్ధియేతర వ్యయం 29.7 % నుంచి 21.6 శాతానికి తగ్గింది.
- 2020 – 21 రెవెన్యూ వ్యయంలో వడ్డీల చెల్లింపుల వ్యయం 13.1 శాతం ఉండగా 2022 – 23 బడ్జెట్ అంచనాల్లో 10.2 శాతానికి తగ్గింది.
- ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం, నీటి సరఫరా, పారిశుధ్య వ్యయం 2020 – 21లో రూ.9,990.6 కోట్లు ఉండగా 2021–22లో రూ.16,659.5 కోట్లకు పెరిగింది. 2022–23లో రూ.17,988.2 కోట్లకు చేరుకుంది.

రాష్ట్ర ప్రధాన ఆర్థిక సూచికలు ఇలా

ఆర్థిక ఏడాది	అభివృద్ధి వ్యయం	అభివృద్ధియేతర వ్యయం	రెవెన్యూ వ్యయంలో వడ్డీల చెల్లింపు (శాతాలు)
2020-21	63.0	29.7	13.1
2021-22	68.7	24.3	12.7
2022-23	72.0	21.6	10.2

మొత్తం వ్యయంలో సామాజిక రంగం వ్యయం

ఆర్థిక ఏడాది	వ్యయం శాతం
2020-21	46.4
2021-22	48.7
2022-23	53.2



మూడు ఆర్థిక సంవత్సరాల్లో అభివృద్ధి వ్యయం పెరుగుదల ఇలా

ఆర్థిక ఏడాది	అభివృద్ధి వ్యయం రూ.కోట్లలో
2020-21 (అకౌంట్స్)	1,17,831.9
2021-22 (సవరించిన)	1,42,975.4
2022-23 (అంచనా)	1,84,525.9



సామాజిక విప్లవకారుడు వేమన

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా


వేమన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఆర్కే రోజా తదితరులు

గాండ్లపెంట: పండితులకే పరిమితమైన తెలుగు సాహిత్యాన్ని పామరులకు సైతం సులభంగా అర్థమయ్యేలా చేసి, తన పద్యాలతో సమాజాన్ని చైతన్య పరచిన వేమన సామాజిక విప్లవకారుడని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా కొనియాడారు. శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండల పరిధిలోని కటారుపల్లి యోగి వేమన ఆలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన వేమన జయంత్యుత్సవాల్లో ఆమె మాట్లాడారు. 'అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను, సజ్జనుండు పల్కు చల్లగానూ, కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా విశ్వదాభిరామ వినురవేమ' అని పద్యం పాడిన మంత్రి భావాన్ని నేటి రాజకీయాలకు అన్వయించారు. ప్రజల కష్టాల్ని స్వయంగా తెలుసుకుని వాటిని పారదోలేందుకు సజ్జనుడైన సీఎం వైఎస్ జగన్ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు కొందరు భౌభౌమని అరుస్తున్నారని, వారిని చూస్తుంటే అల్పుల నీచత్వం గుర్తుకు వస్తుందని అన్నారు. అంతకుముందు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేమన విగ్రహాన్ని రోజా ఆవిష్కరించారు. ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, శంకరనారాయణ, ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవికి అరుదైన గౌరవం

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని


వేమన విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి విడదల రజిని

యడ్లపాడు: ప్రజాకవి వేమనకు అరుదైన గౌరవాన్ని ఇస్తూ ఆయన జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవో ఇచ్చారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. వేమన జయంతి వేడుకలు పల్నాడు జిల్లా చారిత్రక కొండవీడుకోటలో గురువారం వైభవంగా జరిగాయి. బాలభారతి స్వచ్ఛందసంస్థ–కొండవీడు అభివృద్ధి కమిటీ సంయుక్తంగా వేడుకలను నిర్వహించాయి. ముఖ్య అతిథులుగా మంత్రి రజిని, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్, జిల్లాపరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెన్రీక్రిస్టినా, కలెక్టర్ శివశంకర్ లోతేటి, జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి హాజరయ్యారు. వేమన సాహిత్యాన్నే కాకుండా ఆయన నడయాడిన కొండవీడు చరిత్రను కూడా తరతరాలకు గుర్తుండిపోయేలా చేసేందుకు తమ ప్రభుత్వం రూ.70 కోట్లతో పలు సౌకర్యాలు కల్పిస్తూ ఈ ప్రాంతాన్ని చారిత్రక పర్యాటక ప్రాంతంగా రూపొందిస్తుందన్నారు. ముందుగా కొండవీడు కొండపై ఉన్న వేమన మండపాన్ని అతిథులు సందర్శించారు. వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండోఘాట్‌రోడ్డుపై ఏర్పాటు చేసిన సభా వేదిక వద్ద కవులు, గాయకులు, సాహిత్యకారులు వేమన సేవలను కొనియాడారు. వేమన శతక పద్య పుస్తకాలు, కేలండర్‌ను ఆవిష్కరించారు.

స్ఫూర్తి

ముందుకు సాగడమే జీవితం


నాగ చంద్రికాదేవి

కిన్నెర నాగ చంద్రికాదేవి పుట్టింది అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం (కడప జిల్లా). పెరిగింది కడప జిల్లా ఎర్రగుంట్లలో. ఉన్నత విద్యావంతుల కుటుంబంలో పుట్టిన నాగచంద్రాదేవికి పదో తరగతితోనే పెళ్లి చేసుకోవాల్సి వస్తుందని ఊహించ లేదు. అలాగే రెండు వందల తులాల బంగారంతో మొదలైన ఆమె జీవితంలో కాలంతోపాటు బంగారం కరిగిపోవడమూ ఊహించలేదు. ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని, సమాజ సేవ కోసం ఆ ఉద్యోగాన్ని వదిలేయాల్సి వస్తుందని కూడా ఊహించని సంఘటనలే. అలాగే సోదరులున్నప్పటికీ తల్లిదండ్రుల దహన సంస్కారాలు తన చేతులతో చేయాల్సి వస్తుందని కూడా ఊహించని పరిణామమే. అలాగే తన హోమ్‌లో కాలధర్మం చెందిన ఆరు వందల మందికి స్వయంగా అంత్యక్రియలు చేయడం కూడా ఊహించని సంఘటనలే. తన సేవా ప్రస్థానాన్ని 'సాక్షి'తో పంచుకున్నారామె.

'జీవితం అంటేనే గమ్యం ఏమిటో తెలియకనే మొదలు పెట్టే ప్రయాణం. ఊహకందని మలుపులతో సాగే ఈ ప్రయాణంలో స్పీడ్ బ్రేకర్‌లుంటాయి, గతుకులుంటాయి, వాహనం మొరాయిస్తుంది, మరమ్మతులు చేసి ముందుకు సాగబోతే ఇంధనం నిండుకోనూవచ్చు. ఇన్నింటినీ అధిగమిస్తూ ముందుకు సాగడమే మనం చేయగలిగింది. వృద్ధుల సేవలో నా జీవితానికి ఒక అర్థాన్ని నిర్వచించుకున్నాననే అనుకుంటున్నాను' అన్నారామె.

నైరాశ్యం- నేను- నా బిడ్డ

"మా నాన్న మెడికల్ ఆఫీసర్. అమ్మానాన్నలకు తొలి సంతానం నేను. నన్ను మా మేనత్తకు దత్తత ఇచ్చారు. అత్త, మామ ఇద్దరూ హైస్కూల్ టీచర్‌లు. ఎందుకు నిర్ణయం తీసుకున్నారో కానీ టెన్త్ క్లాస్‌తోనే పెళ్లి చేశారు. అయితే పెళ్లి తర్వాత కాలేజ్‌కెళ్లే అవకాశం ఉండింది. ఇంటర్ తర్వాత విద్యుత్‌సౌధలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ చేశాను. ఈ లోపు బాబుకి తల్లి కావడం... బిడ్డనెత్తుకుని ఇంటి నుంచి బయటపడడం వరకు జీవితంలో ముఖ్యమైన ఘట్టాలన్నీ చిన్నవయసుకే పూర్తయిపోయాయి.. ఉద్యోగం చేసుకుని ఇంటికి వస్తే నాలుగ్గోడల మధ్య నేను, నా కొడుకు. నైరాశ్యం ఆవరించినట్లయ్యేది. దాని నుంచి బయటపడడానికి వేసిన ఒక్కో అడుగూ నన్ను ఇవాళ ఇలా సేవకు ప్రతీకగా నిలబెట్టాయి. నా పనిని గుర్తించి అవార్డులు వరించాయి. నన్ను అంటిపెట్టుకుని నేడో రేపో అన్నట్లు కళ్లలో ప్రాణాలు నిలుపుకుని రోజులు లెక్కపెట్టుకుంటున్న వాళ్లు ఉన్నారు. నేను కనిపించగానే వాళ్ల కళ్లలో కనిపించే వెలుగు నన్ను నడిపిస్తోంది.


● వృద్ధుల సేవలో...


● అంత్యక్రియలు నిర్వహిస్తూ...

ఒకరికి ఒకరు తోడు

మగవాడి మోసానికి గురయి ఒంటరైన మహిళలకు నా ఇంట్లో ఉంచుకుని వాళ్లు ఏదో ఒక పని నేర్చుకుని వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడే వరకు ఆసరా ఇస్తూ వచ్చాను. అలాగే ఏ దిక్కూలేని వృద్ధులను ఇంటికి తీసుకురావడం కూడా. ఏ బంధుత్వం లేని వాళ్లను అలా ఇంట్లో ఉంచుకోవడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం అని తెలిసి 2003లో మా ఇంటి పేరుతోనే కిన్నెర ఫౌండేషన్ స్థాపించాను. అక్కడి నుంచి నా సర్వీస్ విస్తరణ కూడా మొదలైంది. స్కూల్లో ఉండాల్సిన పిల్లలు వీధుల్లో ఉంటే వారిని సమీకరించి కౌన్సెలింగ్ ఇచ్చి గవర్నమెంట్ స్కూల్లో చేర్చాను. ఎందుకో తెలియదు కానీ అక్కడ కూడా సింగిల్ పేరెంట్ సంరక్షణలో ఉన్న పిల్లలే ఎక్కువగా ఉండేవారు. ఆ బాధ నాకు తెలుసు కాబట్టి నా బిడ్డల్లా అనిపించేవారు.

సామాజిక చైతన్యం

మహిళలకు ఎదురయ్యే ఇబ్బందులను వివరిస్తూ ప్రభుత్వపరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంలో షీ టీమ్‌తో కలిసి పని చేశాను. నాగర్ కర్నూల్ జిల్లా, అచ్చంపేట దగ్గర జప్తేసద్గూడ గ్రామాన్ని దత్తత తీసుకుని ఫ్లోరోసిస్ బాధితులకు మంచి నీటి ఏర్పాటు చేయడం వంటి అనేక కార్యక్రమాలు నా చేతుల మీదుగా చేయగలిగాను. వృద్ధుల సేవనే ప్రధానంగా తీసుకోవడానికి కారణం మా అమ్మమ్మ, అత్త మంచం పట్టిన రోజులను దగ్గరగా చూడడమే. వాళ్ల మీద మనకు ఎంత ప్రేమ ఉన్నప్పటికీ వాళ్ల బాధను పంచుకోలేం. మనం చేయగలిగింది వారికి తోడుగా ఉంటూ భరోసా ఇవ్వడం మాత్రమే. అందుకే మా హోమ్‌లో హాస్పిస్ సేవలే ప్రధానంగా ఉంటాయి. హోమ్ నిర్వహణకు నెలకు మూడు లక్షల ఖర్చు వస్తుంది. ఒక కంపెనీ నుంచి అద్దెలో కొంత ఆర్థిక సహాయం, మరో కంపెనీ నుంచి బియ్యం నెలనెలా అందుతున్నాయి. పుట్టినరోజులు హోమ్‌లో చేసుకోవడానికి కొంతమంది వస్తారు. మిగిలిన ఖర్చుల కోసం ... ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో సంపాదించుకున్న ఇల్లు, రెండు ప్లాట్లు అమ్ముకున్నాను. బంగారం బ్యాంకులో తాకట్టు పెడుతూ విడిపిస్తూ, పెద్ద అవసరంలో అమ్ముకుంటూ అలా 30 తులాలు ఖర్చయింది. మాసాబ్ ట్యాంకులో అద్దె ఇంట్లో హోమ్ నిర్వహిస్తున్నాను. నా శక్తి తగ్గిపోతోందనే సమయం వచ్చిందని కాబోలు భగవంతుడు హోమ్ కోసం సొంత భవనాన్ని నిర్మించే మార్గం చూపించాడు. చిన్న జీయర్ స్వామి సూచనతో ముచ్చింతల్‌లో హోమ్ నిర్మాణం పూర్తయితే మా హోమ్ అక్కడికి మారుతుంది" అని వివరించారు నాగ చంద్రికాదేవి.

– వాకా మంజులారెడ్డి

సేవలోనే సాంత్వన

నా సర్వీస్‌కి గుర్తింపుగా స్టేట్ అవార్డు, ఉత్తమ మహిళ అవార్డు, సేవాధార్మిక, గవర్నర్ అవార్డు, నేషనల్ అవార్డు అందుకున్నాను. ఈ పనుల్లో నన్ను నేను ఎంగేజ్ చేసుకున్నాను. ఈ సేవలో నాకు సాంత్వన లభించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ఏపీలో గుణదలలో పోస్టింగ్ వచ్చింది. నేను హైదరాబాద్ వదిలి వెళ్లాలంటే హోమ్‌లో ఉన్న వాళ్ల సంరక్షణ ప్రశ్నార్థకమైంది. వాళ్లను ఎవరి మీద వదలాలి? తాత్కాలికంగా బాధ్యత అందుకోవడానికి కూడా ఏ ఆసరా లభించలేదు. దాంతో 2016లో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాను.

– నాగ చంద్రికాదేవి,
ఫౌండర్, కిన్నెర ఫౌండేషన్

ఫ్యాషన్

హితమైన నేస్తం



మది నచ్చేలా ఉండాలి
మేనికి హాయినివ్వాలి
తరాల జ్ఞాపకమై కదలాలి
పర్యావరణానికి హితమై
తరుణులకు నెచ్చెలి అయి
నిలిచేలా ట్రెండ్‌ను సెట్ చేస్తోంది
సస్టెయినబుల్ ఫ్యాషన్

మనవైన చేనేతలు ఎవర్‌గ్రీన్‌గా ఎప్పుడూ అలరిస్తూనే ఉంటాయి. ఇండో–వెస్టన్ మార్కులూ కొట్టేస్తుంటాయి.

ప్రపంచంలో చమురు తర్వాత ఫ్యాబ్రిక్ పరిశ్రమయే అతి పెద్దది. చమురు ప్రపంచవ్యాప్తంగా 10 శాతం కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తుంది. దీనితో పోల్చితే పాలిస్టర్‌తో తయారయ్యే ఫాస్ట్ ఫ్యాషన్ వల్ల పర్యావరణం విపరీతంగా కలుషితం అవుతుందనేది నిపుణుల మాట. ఇలాంటప్పుడు ఫ్యాషన్‌లో మనవైన ఫ్యాబ్రిక్‌ను ఉపయోగిద్దాం.. పర్యావరణానికి నేస్తాలుగా మారుదాం.

యువత నుంచే..

మన విద్యా విధానంలో ఆర్గానిక్ ఫ్యాబ్రిక్ వాడకానికి సంబంధించిన విషయాలు చెప్పడం ప్రారంభిస్తే పిల్లలు, యువతకు వాతావరణ మార్పులను అర్థం చేసుకోవడంలోనూ ఉపయోగపడుతుంది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పాఠ్యాంశాల్లో సస్టెయినబుల్ ఫ్యాషన్‌కు సంబంధించిన పాఠాన్ని చేర్చాలని పర్యావరణ అధ్యయనాలు సూచిస్తున్నాయి. వాడిన ఉత్పత్తులను తిరిగి ఉపయోగించడం, వాడిన వస్తువులను రీ సైక్లింగ్ చేయడం వల్ల పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరించబడుతుంది.

ఆర్గానిక్ ఫ్యాబ్రిక్స్‌ని బ్లాక్ ప్రింట్, టై అండ్ డై డిజైన్స్‌తో మెరిపించినా, చేతితో అల్లిన ఊలు శాలువాలు, జాకెట్స్ కానుకలుగా ఇచ్చినా అవి జ్ఞాపకాల దొంతరగా మనల్ని హత్తుకుపోతాయి.

పునరుద్ధరణ
ఉపయోగించని చీరలు, దుపట్టాలు చిన్నారుల సంప్రదాయ డ్రెస్‌లకు సరిగ్గా నప్పుతాయి. వేటిని తిరిగి ఉపయోగించవచ్చో తెలుసుకొని ఆచరణలో పెట్టినా ప్రకృతికి ఎంతో మేలు.

మైండ్ సెట్

ఫ్యాషన్ వ్యవస్థలో పరివర్తనకు కీలకమైన మార్పులు తీసుకువస్తున్నాయి కొన్ని ఇన్‌స్టిట్యూషన్స్. లండన్ ఫ్యాషన్ స్కూల్ 'యుఎఎల్' సస్టెయినబుల్ ఫ్యాబ్రిక్ డిజైనింగ్ కోసం ప్రత్యేకంగా కోర్సులను ఆఫర్ చేస్తోంది. యూనివర్శిటీ స్థాయిలో ఫ్యాషన్ విద్య అనేది కొత్త ఆలోచనలతో ప్రయోగాలు చేయడానికి, వాతావరణం, సామాజిక, న్యాయసూత్రాలను అమలు చేయడానికి వీలైనదని, యువతలో 'మైండ్‌సెట్' చేయడానికి ఈ విధానం బాగా ఉపకరిస్తుందని చెబుతోంది. ఇప్పటికే నిలకడ లేని ఫాస్ట్ ఫ్యాషన్ పద్ధతులు పర్యావరణాన్ని విపరీతంగా నాశనం చేశాయంటోంది న్యూయార్క్ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి ప్రభుత్వంతో కలిసి పని చేసిన మొట్టమొదటి ఉన్నత విద్యాసంస్థలలో ఒకటిగా నిలిచింది ఎన్ఎఫ్ఐఎటి. 2011లో కర్బన ఉద్గారాలను 30 శాతం తగ్గించిన ఈ సంస్థ, 2016 నాటికి 46 శాతానికి తగ్గించింది. 2025 నాటికి 50 శాతానికి చేరుకోవాలని ప్రణాళికలు రచిస్తోంది. మన దేశంలోనూ హ్యాండ్లూమ్స్‌తో యువత కోరుకునేవిధంగా డ్రెస్ డిజైన్ చేసే సంస్థలు ఉన్నాయి. ఫాస్ట్‌ఫ్యాషన్ పోకడలను నిలువరించి, స్వదేశీ నాణ్యమైన, పర్యావరణ హితమైన ఫ్యాబ్రిక్ డిజైన్స్ వైపు దృష్టి పెట్టాల్సిన అత్యవసర తరుణంగా ఈ యేడాది నిర్ణయం తీసుకుందాం.

కదంబ పాకం

వంటిల్లు

హెల్తీగా కొరియాండర్ రైస్
కాంబినేషన్‌గా
తెలంగాణ రెడ్ చికెన్
వెజ్జీల కోసం పంజాబీ కాజు కర్రీ
ఈ వారం మన వంటింట్లో...

తెలంగాణ రెడ్ చికెన్


కావలసినవి: చికెన్ – అర కిలో ; నిమ్మకాయ– ఒకటి ; అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒకటిన్నర టేబుల్ స్పూన్ ; ఉప్పు – రెండు టీ స్పూన్‌లు లేదా రుచికి తగినట్లు.
మసాలా కోసం: బాదం – పది ; పిస్తా – పది ; చిరోంజి– 2 టీ స్పూన్‌లు ; పచ్చిమిర్చి– 3 ; దాల్చిన చెక్క– అర అంగుళం ముక్క ; లవంగాలు – 2 ; ఏలకులు –4 ; మిరియాలు – అర టీ స్పూన్
గ్రేవీ కోసం: నూనె– 3 టేబుల్ స్పూన్‌లు ; నెయ్యి – 2 టీ స్పూన్‌లు ; పెరుగు– పావు కప్పు ; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు (వేయించాలి) ; టొమాటో పేస్ట్ – అర కప్పు ; రెడ్ చిల్లీ సాస్ – 2 టేబుల్ స్పూన్‌లు ; గ్రీన్ చిల్లీ సాస్ – టేబుల్ స్పూన్; షాజీరా– టీ స్పూన్ ; ధనియాల పొడి– టీ స్పూన్ ; వేయించిన జీలకర్ర పొడి – టీ స్పూన్ ; కశ్మీర్‌మిరప్పొడి – ఒకటిన్నర టేబుల్ స్పూన్ ; మిరప్పొడి – ఒకటిన్నర టేబుల్ స్పూన్ ; కొత్తిమీర తరుగు – కప్పు ; తాజా మీగడ– 2 టేబుల్ స్పూన్‌లు.
తయారీ: ● చికెన్‌ను శుభ్రం చేసి ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం కలపాలి. ● మందపాటి బాణలిలో మసాలా దినుసులన్నింటినీ ఒక్కొక్కటిగా వేసి సన్న మంట మీద దోరగా వేయించాలి. చల్లారిన తర్వాత వీటన్నింటినీ మిక్సీలో తగినంత నీటిని వేస్తూ మెత్తగా గ్రైండ్ చేయాలి. ● ఈ మసాలా పేస్టును చికెన్‌కు పట్టించాలి. అందులో నూనె, నెయ్యి, మీగడ మినహా గ్రేవీ కోసం తీసుకున్న అన్నింటినీ వేసి కలిపి రెండు గంటల సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. ● బాణలిలో నూనె, నెయ్యి వేడి చేసి అందులో ఫ్రిజ్‌లో నుంచి తీసిన చికెన్‌ను వేసి మీడియం మంట మీద అడుగు పట్టకుండా మధ్యలో కలుపుతూ ఇరవై నిమిషాల సేపు ఉడికించాలి. ముక్కలు ఉడికిన తర్వాత మీగడ వేసి దించేయాలి. గ్రేవీ చిక్కదనం చూసుకుని అవసరమనిపిస్తే మరిగించిన నీటిని తగినన్ని పోసి కలుపుకోవాలి. నోరూరించే తెలంగాణ రెడ్ చికెన్ కర్రీ రెడీ. ఇది చపాతీ, రోటీ, బగారా రైస్‌లకు మంచి కాంబినేషన్.

కాజు కర్రీ

కావలసినవి: జీడిపప్పు – 150 గ్రాములు ; నెయ్యి – 2 టీ స్పూన్‌లు ; నూనె – 2 టీ స్పూన్‌లు.
గ్రేవీ కోసం: జీడిపప్పు – 20 ; బాదం – 5 ; మెలన్ సీడ్స్ – టేబుల్ స్పూన్ ; ఉల్లిపాయ– ఒకటి ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; మిరియాల పొడి – అర టీ స్పూన్ ; లవంగాలు – 2 ; పెరుగు – అరకప్పు ; నీరు –300 ఎంఎల్ ; పచ్చిమిర్చి – ఒకటి.
కర్రీ కోసం: నెయ్యి – 2 టీ స్పూన్‌లు ; బిర్యానీ ఆకులు – 2 ; లవంగాలు – 2 ; యాలకులు –4 ; దాల్చినచెక్క– అంగుళం ముక్క ; అల్లం వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్ ; (ఎండిన) మెంతి ఆకుల పొడి – అర టీ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచికి తగినంత ; కొత్తిమీర తరుగు – పావు కప్పు ; పనీర్ – 100 గ్రాములు (తురమాలి) ; తాజా మీగడ– 2 టీ స్పూన్‌లు ; వెన్న – టేబుల్ స్పూన్.
తయారీ: ● మందపాటి బాణలి పెట్టి నెయ్యి, నూనె వేసి వేడి చేసి జీడిపప్పు వేయించి పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు అదే బాణలిలో గ్రేవీ కోసం తీసుకున్న దినుసుల్లో పెరుగు మినహా మిగిలినవి వేయించి అందులో నీళ్లు పోసి వేడి చేసి దించాలి. చల్లారిన తర్వాత నీటిని వడపోసి నీటిని పక్కన పెట్టుకోవాలి. ఆ దినుసుల్లో పెరుగు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.
కర్రీ ప్రిపరేషన్: బాణలిలో మరో రెండు స్పూన్‌ల నెయ్యి వేడి చేసి దాల్చిన చెక్క, లవంగాలు, యాలకులు, బిర్యానీ ఆకు వేసి వేయించాలి. అల్లం– వెల్లుల్లి పేస్ట్, అందులో ముందుగా వడపోసి పక్కన పెట్టిన నీటిని పోసి అందులో కసూరి మేథీ (ఎండిన మెంతి ఆకుల పొడి), ఉప్పు, కాజు పేస్ట్ వేసి సన్న మంట మీద ఉడికించాలి. గ్రేవీ చిక్కబడిన తరవాత మొదట వేయించి పక్కన ఉంచిన జీడిపప్పు, మీగడ, వెన్న వేసి కలిపి మూత పెట్టి ఒక నిమిషం పాటు రుచి పట్టనివ్వాలి. ఇప్పుడు పనీర్ తురుము, కొత్తిమీరతో గార్నిష్ చేయాలి.

కొరియాండర్ రైస్

కావలసినవి: కొత్తిమీర పేస్ట్ కోసం ; కొత్తిమీర – రెండు కప్పులు (తరిగి శుభ్రం చేసినది) ; పుదీనా ఆకులు – కప్పు (శుభ్రం చేసి ఒలిచిన ఆకులు) ; ఉడికించిన బఠాణీ: అర కప్పు ; అల్లం – అంగుళం ముక్క ; వెల్లుల్లి రేకలు – 12 ; ఉల్లిపాయ – 1 పెద్దది ; పసుపు – చిటికెడు.
రైస్ కోసం: బాసుమతి బియ్యం – పావు కేజీ ; నూనె– టేబుల్ స్పూన్ ; నెయ్యి– టేబుల్ స్పూన్ ; జీడిపప్పు – 15 ; బిర్యానీ ఆకు– 2 ; దాల్చిన చెక్క – అంగుళం ; లవంగాలు – 5 ; నిమ్మకాయ– 1 ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచికి తగినంత ; కొత్తిమీర తరుగు – పావు కప్పు.
తయారీ: ● కొత్తిమీర పేస్ట్ కోసం తీసుకున్న అన్నింటినీ తగినంత నీటిని కలుపుతూ మెత్తగా గ్రైండ్ చేయాలి. ఆ పేస్ట్‌ను పలుచటి వస్త్రంలో వేసి వడకట్టాలి. నీరు పచ్చదనం తగ్గే వరకు రెండు లేదా మూడు సార్లు నీటిని పోసి పిండి పిప్పిని పారేయాలి. నాలుగు వందల మిల్లీలీటర్ల నీటిని సిద్ధం చేసుకుంటే బియ్యం ఉడకడానికి సరిపోతాయి. ● బియ్యం కడిగి కొత్తిమీర పేస్ట్ నుంచి వడపోసిన నీటిలో వేసి, ఉప్పు కలిపి గంట సేపు నాననివ్వాలి. ● మందపాటి బాణలిలో నెయ్యి, నూనె వేడి చేసి జీడిపప్పు దోరగా వేయించి తీసి పెట్టుకోవాలి. అదే బాణలిలో బిర్యానీ ఆకులు, దాల్చిన చెక్క, లవంగాలు వేసి వేయించాలి. ఇప్పుడు నానబెట్టిన బియ్యాన్ని నీటితో సహా వేసి మంట పెంచాలి. అన్నం ఉడకడం మొదలైన తరవాత మంట మీడియంలో ఉంచి ఉడకనివ్వాలి. నీళ్లు తగ్గి పోయిన తర్వాత అన్నంలో బఠాణీ, నిమ్మరసం వేసి కలిపి మూతపెట్టాలి. తేమ ఇంకి పోయిన తర్వాత అన్నం మీద జీడిపప్పు, కొత్తిమీర తరుగుతో అలంకరించి దించేయాలి. ఘుమఘుమలాడే కొత్తిమీర రైస్ రెడీ.


కాజు కర్రీ
తెలంగాణ రెడ్ చికెన్

గెలుపు బాట


● రోమిత

పురుషాధిపత్య భావజాలం, లింగవివక్షత గురించి వినడమే కాని రోమిత అనుభవంలోకి ఎప్పుడూ రాలేదు. అయితే ఒకానొక దశలో తాను కూడా వాటి బారిన పడక తప్పలేదు. బాధ పడి ఆగిపోయి ఉంటే ఎంటర్‌ప్రెన్యూర్‌గా రోమిత మజుందార్ విజయం సాధించేది కాదు.

అందమైన విజయం

జార్ఖండ్‌లోని రాంచిలో పుట్టి పెరిగింది రోమిత. తండ్రి న్యాయవాది. తల్లిదండ్రులు తన పట్ల ఎప్పుడూ వివక్ష ప్రదర్శించలేదు. సోదరుడితో సమానంగా పెంచారు. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో బిజినెస్ ఎకనామిక్స్ చదువుకునే రోజుల్లో కూడా తనకు వివక్ష ఎదురు కాలేదు.

హార్బర్ రిడ్జ్ క్యాపిటల్‌లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించింది రోమిత. ఆ తరువాత వెంచర్ క్యాపిటలిస్ట్(వీసి)గా కూడా తనను తాను నిరూపించుకుంది.

ఒకానొకరోజు...తనకు వ్యాపారరంగంలోకి ప్రవేశించాలని ఆలోచన వచ్చింది. లాయర్ల కుటుంబం నుంచి వచ్చిన రోమితకు ఎలాంటి వ్యాపార అనుభవం లేదు.

'ఎందుకొచ్చిన రిస్క్' అని అనుకొని ఉంటే తన కలను నెరవేర్చుకునేది కాదు.

కాస్మోటిక్స్ బేస్డ్ స్టార్టప్ గురించి ఆలోచనతో నిధుల సమీకరణకు ప్రయత్నాలు మొదలు పెట్టినప్పుడు తనను బాధ పెట్టే ఎన్నో అనుభవాలు, ప్రశ్నలు ఎదురయ్యాయి.

'మీరు మాత్రమేనా?' 'మేల్ కో–ఫౌండర్ ఎవరూ లేరా?

'మీకు పెళ్లి అయిందా? అయితే పూర్తి సమయం కంపెనీ కోసం ఎలా కేటాయించగలరు?'

'మీరు సీరియస్‌గా వ్యాపారరంగంలోకి వచ్చినట్లుగా అనిపించడం లేదు. ఏదో సరదాగా వచ్చినట్లు అనిపిస్తుంది'... ఇవి మనసులోకి తీసుకునే ఉంటే రోమిత మజుందార్ తిరిగి వెనక్కి వెళ్లేదే తప్ప ముందుకు అడుగు వేసేది కాదు.

ఎన్నో రకాల అనుమానాలు, అవమానాలను ఎదుర్కొని ఎట్టకేలకు కాస్మోటిక్ బేస్డ్ స్టార్టప్ 'ఫాక్స్‌టేల్'తో తన కలను నిజం చేసుకుంది. ముంబై కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీ నాలుగు రకాల ఉత్పత్తులతో మార్కెట్‌లోకి ప్రవేశించి కొద్దికాలంలోనే విజయకేతనం ఎగరేసింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రోమిత మజుందార్ మంచి పేరు తెచ్చుకుంది.

కిచెన్ టిప్స్

వంటకాలలో పసుపు ఎక్కువ పడితే..?

మీ కూరలో పసుపును ఎక్కువగా కలిపినప్పుడల్లా అందులో కొన్ని తాజా బంగాళాదుంప ముక్కలను కట్ చేసి వేయండి. దానికి కొద్దిగా నీరు పోసి పూర్తిగా ఉడకనివ్వండి. బంగాళదుంపలు మీ వంటలో అదనపు పసుపు పొడి లేదా ఉప్పును పీల్చుకుని రుచిని సమతుల్యం చేస్తాయి.

లేదంటే స్పూను పెరుగు, చిటికెడు ఉప్పు, చిటికెడు కారం కాసిని నీటిలో కలిపి ఈ మిశ్రమాన్ని పసుపు ఎక్కువైన ఆహార పదార్థానికి కలిపితే సరి. లేదంటే పసుపు ఎక్కువైన ఆహారంలో అదనపు పసుపును సమతుల్యం చేయడానికి మరొక సులభమైన మార్గం చింతపండు పేస్ట్, ఉసిరి పొడి లేదా ఉసిరి పొడి వంటి పుల్లని, ప్రాసెస్ చేసిన పదార్థాలను కలపండి. ఇది పసుపు పొడి చేదు రుచిని సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది.



ఒక అరస్పూను చక్కెరను నీరు లేదా తాజా క్రీమ్‌తో కలపండి. దాన్ని పసుపు ఎక్కువైన ఆహారంలో చేర్చండి. ఇది పసుపు పొడి చేదు రుచిని తగ్గించడానికి సహాయకారిగా పని చేస్తుంది.

● గేమింగ్

ఆట కట్టించగలరా!

ఈ నెల 24న విడుదల కాబోతున్న యాక్షన్ రోల్-ప్లేయింగ్ గేమ్ ఫర్‌స్పోకెన్. ఈ ఓపెన్ వరల్డ్ గేమ్ ఫార్మట్‌లో ప్లేయర్స్ ఏ టైమ్‌లో అయినా, ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు. ప్రతి కంబాట్ ఎన్‌కౌంటర్‌లో ప్లేయర్స్ ఎక్స్‌పీరియన్స్ పాయింట్స్ సొంతం చేసుకోవచ్చు. ఈ గేమ్‌లో కథానాయిక పేరు ఫ్రైహాలండ్. న్యూయార్క్ నుంచి మాయా ప్రపంచంలోకి వెళుతుంది. తన దగ్గర ఉన్న శక్తిమంతమైన ఎర్త్‌మ్యాజిక్, ఫైర్‌మ్యాజిక్‌లను ఉపయోగించి రాక్షస సమూహాల పని పడుతుంది.



ఈ గేమ్‌లోని యూనిక్ ట్రావెల్ సిస్టమ్ అసాధ్యమైన వాటిని సుసాధ్యం చేస్తుంది. 'ఐసేకై' (జపనీస్‌లో) లేదా 'ఫిష్ ఔట్ ఆఫ్ వాటర్ యాక్షన్ గేమ్ 'ఫర్‌స్పోకెన్'లో 'రే-ట్రేసింగ్' అనేది ప్రత్యేకం.

జానర్: యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్

మోడ్: సింగిల్ ప్లేయర్

ప్లాట్‌ఫామ్: ప్లేస్టేషన్ 5, విండోస్

● సక్సెస్ స్టోరీ

ఏఐ రాగం ఎంత మధురం!

కంటెంట్ క్రియేషన్, పాడ్‌కాస్ట్... మొదలైన వాటిలో బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అనేది కీలకం. అయితే కాపీరైట్స్ అనేది ప్రధాన సమస్యగా మారింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కాపీరైట్స్‌తో పనిలేని ఎ.ఐ టూల్‌ను సృష్టించాడు సిద్ధార్థ భరద్వాజ్.



సిద్ధార్థ భరద్వాజ్

పాడ్‌కాస్ట్... మొదలైనవి చేసేవారికి, కంటెంట్ క్రియేటర్స్‌కు 'కాపీ రైట్' అనేది ప్రధాన సమస్య. ఈ నేపథ్యంలో ఎ.ఐ-ఆధారిత మ్యూజిక్ క్రియేషన్ టూల్ 'బీథోవెన్.ఏఐ' రాయల్టీ ఫ్రీ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌ను అందించడంలో తోడ్పడుతుంది. ఐఐఐటీ-అలహాబాద్‌లో చదువు పూర్తయిన తరువాత బెంగళూరు కేంద్రంగా 'బీథోవెన్.ఏఐ' స్టార్టప్‌కు శ్రీకారం చుట్టాడు సిద్ధార్థ భరద్వాజ్.

బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ పీస్‌ను క్రియేట్ చేయడానికి 'బీథోవెన్.ఏఐ' మ్యూజిక్ డైరెక్టర్‌లా ఉపయోగపడుతుంది. కోరుకున్న మ్యూజిక్‌కు సంబంధించి జానర్, టెంపో ఎంపిక చేసుకొని టైమ్ సెట్ చేసుకుంటే సరిపోతుంది. డీప్ లెర్నింగ్ నెట్‌వర్క్‌లను ఉపయోగించి పనిచేసే వ్యవస్థ ఇది.

ఒక నిమిషం ట్రాక్ కోసం పది సెకండ్ల టైమ్ పడుతుంది. పది సెకండ్ల గిటార్ రిఫ్, పదిహేను సెకండ్ల పియానో మెలోడీల కోసం ఎంతో మంది మ్యూజిక్ డైరెక్టర్లతో కలిసి పనిచేసింది కంపెనీ.

'ఇది మ్యూజిక్ డైరెక్టర్ల కోసం సృష్టించిన పరికరం కాదు' అని 'బీథోవెన్.ఏఐ' టూల్ గురించి చెబుతున్నాడు భరద్వాజ్.

'బీథోవెన్.ఏఐ ఉన్నంత మాత్రాన మ్యూజిక్ డైరెక్టర్‌తో అవసరం ఉండదు అనుకోవడం తప్పు' అని స్పష్టత ఇస్తున్నాడు.

ఈ టూల్ గురించి భరద్వాజ మాటల్లో చెప్పాలంటే...

హలో వరల్డ్

ఎంతోమంది రికార్డింగ్ ఆర్టిస్ట్‌లు ఎ.ఐతో లిరిక్ జెనరేట్ చేయడం గురించి ప్రయోగాలు జరుపుతున్నారు. మ్యూజిషియన్, టెక్ రిసెర్చర్, ఫ్రాన్స్వోయిస్ పచెట్ కృత్రిమ మేధస్సుతో కంపోజ్ చేసిన ఫస్ట్ ఆల్బమ్ 'హలో వరల్డ్' ఆదరణ పొందింది. అయితే భవిష్యత్ విషయానికి వస్తే ఎ.ఐ ఆధారిత సంగీతానికి కోర్టు సమస్యలతో పాటు రకరకాల సమస్యలు ఎదురుకానున్నాయి. ఆ పరీక్షలను తట్టుకోగలదా? లేదా? అనేది వేచిచూడాల్సిందే.

'ఎ.ఐ (కృత్రిమ మేధస్సు)కు శిక్షణ ఇస్తే అది వినసొంపైన మ్యూజిక్ బిట్‌ను అందిస్తుంది. అలా అని చారిత్రక సంగీతానికి సంబంధించి ఎ.ఐకి శిక్షణ ఇవ్వలేము. అందుకే మాదైన డాటాను క్రియేట్ చేసుకున్నాం' అంటాడు భరద్వాజ.

అవసరమైన మ్యూజిక్ బిట్‌ను అందించడం మాత్రమే కాదు మ్యూజిక్ ఎలా కంపోజింగ్ చేయాలి, మిక్సింగ్ అండ్ మాస్టరింగ్ లోనూ ఈ ఎ.ఐ టూల్ ఉపయోగపడుతుంది.

తాజాగా వీడియోగేమ్స్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం కూడా ఉపయోగిస్తున్నారు.

'సంగీతం అనేది సృజనాత్మక ప్రక్రియ. మానవ, కృత్రిమ మేధస్సుతో ముడిపడిన అంశం' అంటాడు భరద్వాజ.

'మరి ఈ కృత్రిమ సంగీతంలో సహజత్వం మాటేమిటి?' అనే ప్రశ్నకు భరద్వాజ్ జవాబు ఇది...

'తెరపై కనిపించే దృశ్యానికి నేపథ్య సంగీతం బలాన్ని ఇస్తుంది. అయితే అది ఎలాంటి సంగీతం అనేది ముఖ్యం. మేము సృష్టించిన సంగీతం సింథటిక్, ఎ.ఐ-జెనరేట్ అనిపించదు. ఒక మ్యూజిషియన్ కంపోజ్ చేసినట్లే సహజంగా ఉంటుంది'

'బీథోవెన్.ఏఐ' అనేది సబ్‌స్క్రిప్షన్‌కు సంబంధించిన మోడల్.

'ఎ.ఐ వ్యవస్థ మనం కోసం ఎంతో సృష్టించింది. అందులో ఏది, ఎలా ఎంపిక చేసుకోవాలనేది మన అవసరాలపై ఆధారపడి ఉంటుంది. బీథోవెన్.ఏఐ అందరికీ ఉపయోగపడే పరికరం కాదు. వ్యక్తిగత అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించింది' అంటున్న భరద్వాజ్ వచ్చే నెలలో వీడియోలోని దృశ్యానికి, మూడ్‌కు పర్‌ఫెక్ట్‌గా సరిపోయే 'మ్యూజిక్ పీస్'ను అందించే ఎ.ఐ-ఆధారిత టూల్‌ను తీసుకురానున్నాడు.

బెస్ట్ ఆఫ్ లక్... భరద్వాజ్



స్ఫూర్తి

ప్రవాహమై కదలింది

'నేను, నా చదువు మాత్రమే' అని ఎప్పుడూ అనుకోలేదు ఢిల్లీకి చెందిన 26 సంవత్సరాల భావి బరాడ్. సామాజిక సేవ నుంచి యువతరం హక్కుల వరకు ఎన్నో విషయాలపై తన గొంతు వినిపిస్తోంది. ప్రస్తుతం యూత్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ 'ప్రవాహ్'లో పని చేస్తున్న భావి బరాడ్ 'పది మందితో కలిసి పనిచేయడంలో ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు' అంటుంది.

కోవిడ్ సమయంలో ఎంతోమంది బాధితులకు అండగా నిలబడింది. సహాయక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంది.

'వర్గ, కుల, మత భేదాలు లేకుండా అందరూ కలిసి శాంతిసౌభాగ్యాలతో జీవించాలి' అనేది తన కోరిక.

ఐక్యరాజ్య సమితి 'ఇండియా యువ అడ్వకేట్స్'గా ఫస్ట్ బ్యాచ్‌కు ఎంపికైన ఆరుగురిలో భావి బరాడ్ ఒకరు.

'సామాజిక సేవలో ఉన్న గొప్పతనం ఏమిటంటే ఫలితం ఆశించకుండా నిజాయితీగా కష్టపడడం. అయితే నిజాయితీగా పని చేసే వారికి మంచి ఫలితం దూరంగా ఉండదు. వారిని మరో రెండు అడుగులు ముందుకు నడిపిస్తుంది' అంటుంది భావి బరాడ్.

సమాజసేవకు సంబంధించిన విషయాలను ఇతరులతో పంచుకోవడానికి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుంటుంది బరాడ్.

స్కూల్, కాలేజీలలో జెండర్ ఈక్వాలిటీ నుంచి పర్యావరణ స్పృహ వరకు రకరకాల విషయాలపై మాట్లాడడం, యూత్ కెరీర్‌కు సంబంధించి ప్యానల్ డిస్కషన్‌లలో చురుగ్గా పాల్గొంటుంది.

'పుస్తకాలు చదవడం అంటే ఇష్టం' అంటున్న భావి బరాడ్ సమాజాన్ని చదవడం ద్వారా మర్నిన్ని విషయాలను తెలుసుకుంటుంది.

● టెక్...టాక్

వాట్సాప్‌లో డిఫరెంట్ రింగ్‌టోన్స్ కోసం

ఇన్‌స్టంట్ మెసేజింగ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్‌లో (ఆండ్రాయిడ్) డిఫరెంట్ యూజర్‌లకు, డిఫరెంట్ రింగ్‌టోన్‌ల కోసం...



1. కన్వర్‌సేషన్ ట్యాబ్-సెలెక్ట్
2. కాంటాక్ట్‌ను సెలెక్ట్ చేసుకున్న తరువాత కస్టమ్ రింగ్‌టోన్ సెట్ చేసుకోవాలి.
3. పేజీ స్క్రోల్ డౌన్ చేసి-కస్టమ్ నోటిఫికేషన్ సెలెక్ట్ చేసుకోవాలి.
4. 'యూజర్ కస్టమ్ నోటిఫికేషన్' బాక్స్ టిక్ చేయాలి.
5. కాల్ నోటిఫికేషన్ కింద ఉన్న రింగ్‌టోన్ ట్యాప్ చేసి ఇష్టమైన రింగ్‌టోన్ సెలెక్ట్ చేసుకోవాలి.

డెల్ ఎక్స్‌పీఎస్ 13 ప్లస్



డిస్‌ప్లే: 13.4 అంగుళాలు
రిజల్యూషన్: 1920×1200 పిక్సెల్స్
బరువు: 1.23 కిలోలు
హైట్: 15.28 ఎంఎం
విడ్త్: 295.30 ఎంఎం
● వెబ్ కెమెరా ● ఫింగర్ ప్రింట్ సెన్సర్ ● ఐ సేఫ్ టెక్నాలజీ ● స్పీకర్స్-2

జెబ్రోనిక్స్ డ్రిప్ స్మార్ట్‌వాచ్



స్క్రీన్ సైజ్: 4.29 సీఎం టైప్: టీఎఫ్‌టీ కలర్ డిస్‌ప్లే
డైమెన్షన్స్: 112×16×163 బ్యాటరీ: 250 ఎంఏహెచ్
బిల్ట్-ఇన్ రీఛార్జబుల్
డాటా స్టోరేజ్: 5 రోజులు
ఫీచర్స్: స్లీప్ మానిటర్, హార్ట్‌రేట్, ఎస్పీవో2 అండ్ బీపీ మానిటర్...మొదలైనవి.

మల్టీ-ఫంక్షనల్ ఛార్జింగ్ స్టాండ్



బ్రాండ్: పిట్రాన్
కనెక్షన్ టైప్: యుఎస్‌బి
కలర్: బ్లాక్ స్పెషల్ ఫీచర్: ఫాస్ట్ ఛార్జింగ్
ధర: ₹ 999.00

సినిమా

బాక్సాఫీస్‌పై గురి

తుపాకీ పట్టారు.. విలన్లపై గురి పెట్టారు... రెచ్చిపోయి ఫైట్స్ చేస్తున్నారు... బాక్సాఫీస్ కలెక్షన్లపై గురి పెట్టారు... ప్రస్తుతం కొందరు కథానాయికలు సిన్సియర్ పోలీసాఫీసర్లుగా, లేడీ జేమ్స్ బాండ్ తరహా పాత్రల్లో నటిస్తున్నారు. ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.



● టబు



● త్రిష

సీనియర్ నటి టబు మరో రెండు నెలల్లో ఇన్‌స్పెక్టర్ దయానా జోసెఫ్‌గా కనిపించనున్నారు. అజయ్ దేవగన్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న హిందీ చిత్రం 'భోలా'లోనే ఆమె పోలీస్ ఇన్‌స్పెక్టర్ దయానా జోసెఫ్ పాత్ర చేస్తున్నారు. మూడు రోజుల క్రితం ఈ చిత్రంలో టబు లుక్ విడుదలైంది. మార్చి 30న ఈ చిత్రం విడుదల కానుంది. ఇక గత ఏడాది సెప్టెంబర్‌లో 'పొన్నియిన్ సెల్వన్' చిత్రంలో యువరాణి పాత్రలో కనిపించిన త్రిష త్వరలో విడుదల కానున్న వెబ్ సిరీస్ 'బృందా'లో తుపాకీ తూటాలను అలవోకగా వదిలే పోలీస్‌గా కనిపించనున్నారు. త్రిష నటించిన తొలి వెబ్ సిరీస్ ఇది. సూర్య వంగల దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ సీజన్ వన్ షూటింగ్ ఇటీవలే పూర్తయింది. త్వరలో స్ట్రీమింగ్ కానుంది. ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ చుట్టూ తిరిగే కథతో ఈ సిరీస్ రూపొందింది. ఇక కాజల్ అగర్వాల్ కూడా సిన్సియర్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. 'ఘోస్టీ' అనే చిత్రంలోనే ఈ పాత్ర చేశారామె. తన తండ్రి అడుగుజాడలను అనుసరించి, పోలీస్‌గా మారుతుంది ఆర్తి (కాజల్). ఇరవయ్యేళ్ల క్రితం తన తండ్రి కస్టడీ నుంచి తప్పించుకున్న ఖైదీని పట్టుకోవాలన్నదే ఆర్తి ఆకాంక్ష. ఈ క్రమంలో ఆమెకు విచిత్రమైన ఘటనలు ఎదురవుతుంటాయి. కాజల్ నటించిన తొలి హారర్ సినిమా ఇది. కల్యాణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. మరోవైపు అధికారిక ప్రకటన రాలేదు కానీ ఓ హిందీ షోలో తమన్నా పోలీస్‌గా చేస్తున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ షో సాగుతుందని సమాచారం. ఇంకోవైపు దాదాపు లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తున్న నయనతార తన తొలి హిందీ చిత్రం 'జవాన్'లో పోలీసాఫీసర్ పాత్ర చేస్తున్నారు. షారుక్ ఖాన్ హీరోగా తమిళ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న తొలి హిందీ చిత్రం ఇది. ఈ చిత్రంలో అన్యాయంగా జైలుపాలైన మహిళలను విడిపించి, వారిని సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడే ఒక టీమ్‌గా మార్చే కామన్ మేన్ పాత్రను షారుక్ ఖాన్ చేస్తున్నారని సమాచారం. ఈ కేసును ఛేదించే పోలీసాఫీసర్ పాత్రలో నయనతార కనిపిస్తారని టాక్. ఈ ఏడాది జూన్ 2న ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. ఇక అభినయానికి ఆస్కారం ఉన్న పాత్రలంటే దర్శకులకు గుర్తొచ్చే కథానాయికల్లో కీర్తి సురేష్ ముందు వరుసలో ఉంటారు. ప్రస్తుతం కీర్తి చేస్తున్న చిత్రాల్లో 'రివాల్వర్ రీటా' ఒకటి. రెండు చేతులతో రెండు తుపాకీలు పట్టుకుని అలవోకగా షూట్ చేసే రీటా పాత్రలో కనిపించనున్నారు కీర్తి. కె. చంద్రు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో లేడీ జేమ్స్ బాండ్ తరహా పాత్ర చేస్తున్నారామె. మరోవైపు హిందీ చిత్రం 'కమాండో' సీక్వెల్స్‌లో పోలీస్ ఇన్‌స్పెక్టర్ భావనా రెడ్డిగా కనిపించిన అదా శర్మ ప్రస్తుతం ఓ హిందీ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా చేస్తున్నారు. విశాల్ పాండ్య దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. మరోసారి పోలీస్‌గా నటించే అవకాశం రావడం ఆనందంగా ఉంది అంటున్నారు అదా. ఇక 'సీతారామం' చిత్రంతో పాపులర్ అయిన మృణాల్ ఠాకూర్ నటించిన హిందీ చిత్రం 'గూమ్రా'. 'సీతారామం'లో సున్నిత మనసు ఉన్న సీత పాత్రలో అందర్నీ ఆకట్టుకున్న మృణాల్ 'గూమ్రా'లో శక్తిమంతమైన పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ పాత్ర చేయడానికి శిక్షణ తీసుకున్నారు మృణాల్. తమిళ చిత్రం 'తడమ్'కి రీమేక్‌గా వర్ధన్ కట్కర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది.



● కాజల్



● షారుక్ నయనతార



● కీర్తి



● అదా శర్మ




● మృణాల్

ఈ తారలే కాదు.. మరికొందరు కథానాయికలు కూడా పోలీసాఫీసర్ పాత్రలో విజృంభించనున్నారు.

ఆర్ఆర్ఆర్ నో

● బాఫ్తా నామినేషన్లలో దక్కని చోటు



ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులు సొంతం చేసుకున్న 'ఆర్ఆర్ఆర్' చిత్రం ప్రతిష్ఠాత్మక 'బాఫ్తా' (బ్రిటీష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్) అవార్డు కోసం లాంగ్‌లిస్ట్‌లో చేరిన సంగతి తెలిసిందే. అయితే గురువారం ప్రకటించిన 'బాఫ్తా' తుది నామినేషన్ల జాబితాలో 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి చోటు దక్కలేదు. రామ్‌చరణ్, ఎన్టీఆర్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. ఈ సినిమా 'బాఫ్తా' నాన్ ఇంగ్లిష్ లాంగ్‌లిస్ట్ కేటగిరీలో చోటు దక్కించుకుంది. అయితే టాప్ 5తో కూడిన ఫైనల్ లిస్టులో స్థానం కోల్పోయింది. తుది నామినేషన్ల జాబితాలో 'ఆల్ క్వైట్ ఆన్ ద వెస్టర్న్ ఫ్రంట్, అర్జెంటీనా 1985, కోర్సేజ్, డెసిషన్ టు లీవ్, ద క్వయిట్ గర్ల్' చిత్రాలు నిలిచాయి. కాగా 'బెస్ట్ డాక్యుమెంటరీ' విభాగంలో ఇండియన్ డాక్యుమెంటరీ 'ఆల్ దట్ బ్రీత్స్'కి నామినేషన్ దక్కింది. మొత్తం 24 విభాగాల్లో నామినేషన్లు ప్రకటించగా, భారతదేశం నుంచి 'ఆల్ దట్ బ్రీత్స్' మాత్రమే నామినేషన్ దక్కించుకుంది. షౌనక్ సేన్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఫిబ్రవరి 19న 'బాఫ్తా' అవార్డుల వేడుక జరగనుంది. మరి.. 'ఆల్ దట్ బ్రీత్స్' అవార్డు కూడా గెలుచుకుంటుందా? చూడాలి.

గాండీవధారి అర్జున



● వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'గాండీవధారి అర్జున' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గురువారం (జనవరి 19) వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. మాస్క్ ధరించిన కొందరు మనుషులు ఓ రాజ భవనంలోనికి ప్రవేశించటానికి ప్రయత్నిస్తుడటం.. ఆ సందర్భంలో బాంబుల మోత, గన్ ఫైరింగ్ నడుమ వరుణ్ తేజ్ యాక్షన్ మోడ్‌లో కనిపిస్తుండటం మోషన్ పోస్టర్‌లో కనిపిస్తోంది. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మిక్కీ జె. మేయర్ సంగీతం, నేపథ్య సంగీతం అందిస్తున్నారు.

హంట్ నాకు మంచి రీ ఎంట్రీ

- 'ప్రేమిస్తే' భరత్



''హంట్' చిత్రంలో ఆర్యన్ దేవ్ అనే ఐపీఎస్ ఆఫీసర్‌గా నటించాను. అలాగే శ్రీకాంత్‌గారు, సుధీర్‌బాబు కూడా ఐపీఎస్ అధికారులుగా చేశారు. ఈ చిత్రకథ మా ముగ్గురి చుట్టూ తిరుగుతుంది. యాక్షన్, క్రైమ్, థ్రిల్లర్, ఎమోషన్, ఫ్రెండ్షిప్.. ఇలా అన్ని వాణిజ్య అంశాలున్నాయి. ఈ చిత్రం తెలుగులో నాకు మంచి రీ ఎంట్రీతో పాటు నా మార్కెట్‌కి ప్లస్ అవుతుందనే నమ్మకం ఉంది'' అని భరత్ ('ప్రేమిస్తే' ఫేమ్) అన్నారు. సుధీర్‌బాబు హీరోగా మహేశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హంట్'. శ్రీకాంత్, భరత్ కీలక పాత్రలు చేశారు. వి. ఆనంద ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదలకానుంది. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ - ''మహేశ్‌బాబుగారి 'స్పైడర్' చిత్రం తర్వాత తెలుగులో క్యారెక్టర్ ఆర్టిస్టుగా అవకాశాలు వచ్చాయి. అయితే తమిళంలో వరుసగా హీరోగా చేస్తున్న నేను తెలుగులో క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేయాలనుకోలేదు.. కాగా దర్శకుడు మహేశ్ చెప్పిన 'హంట్' కథ, నా పాత్ర నచ్చింది. అందుకే చేశాను. నేను ఇండస్ట్రీకి వచ్చి 20 ఏళ్లు అవుతోంది. ఇక్కడ మన స్థానం ఎప్పుడెలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. కొందరిలా నేను కూడా హిట్లు, ఫ్లాపులతో ప్రయాణం చేస్తున్నాను. అయితే తమిళ ఇండస్ట్రీలో హీరోగా సంతోషంగా ఉన్నాను. యాక్షన్, ఎమోషన్, రొమాంటిక్.. ఇలాంటి కథలతోనే నన్ను అప్రోచ్ అవుతున్నారు. కానీ, నాకు పూర్తి స్థాయిలో ఓ కామెడీ సినిమా చేయాలని, రా ఏజెంట్ పాత్ర చేయాలని ఉంది'' అన్నారు.

కాపీ కొట్టలేదు

- అనికా సురేంద్రన్



''ఎన్నో ఏళ్లుగా బాలనటిగా సినిమాల్లో నటించాను. తొలిసారి 'బుట్ట బొమ్మ' చిత్రంలో హీరోయిన్‌గా నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నా పాత్రలో ఎన్నో ఎమోషన్స్ ఉన్నాయి. నటనకు ఆస్కారం ఉంది'' అని అనికా సురేంద్రన్ అన్నారు. సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్, అనికా సురేంద్రన్ ప్రధాన పాత్రల్లో శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బుట్టబొమ్మ'. ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా అనికా మాట్లాడుతూ-''నాది కేరళ. మలయాళంలో 'కప్పేల' సినిమా హిట్ అయింది. ఆ సినిమాకి రీమేక్‌గా రూపొందిన 'బుట్టబొమ్మ'లో కథానాయిక అవకాశం రావడం, పైగా సితార వంటి ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మిస్తుండటంతో వెంటనే అంగీకరించాను. 'కప్పేలా'లో నటించిన నటి (అన్నా బెన్)ని కాపీ కొట్టే ప్రయత్నం చేయలేదు. పాత్రను అర్థం చేసుకొని, నటించాను. తొలిసారి హీరోయిన్‌గా చేయడంతో మొదట్లో కొంత ఒత్తిడి ఉండేది.. అయితే దర్శకుడు రమేశ్ గారు, మిగతా యూనిట్ సపోర్ట్‌తో ఆ తర్వాత ఎలాంటి ఒత్తిడి లేకుండా సినిమాని పూర్తి చేశాను'' అన్నారు.

సాక్షి బిజినెస్

శుక్రవారం
20-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
187	58
60,858	17,108

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	10,840	▽ 116
డోజోన్స్	33,027	▽ 270
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,747	▽ 83
డాక్స్	14,920	▽ 261
షాంఘై	3,240	△ 16
నికాయ్	26,405	▽ 386

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	
56,670	▽ 85
బంగారం (99.5 స్వచ్ఛత)	
56,443	▽ 95
వెండి (కేజీ)	
67,444	▽1,549

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎపీఉ	80.62	82.29
£	బ్రిటన్ పౌండ్	ఎపీఉ	86.41	89.45
€	యూరో	ఎపీఉ	98.79	102.12
¥	జపాన్ ఎన్ (100)	ఎపీఉ	62.43	64.49
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎపీఉ	55.14	57.48
S$	సింగపూర్ డాలర్	ఎపీఉ	60.59	62.60
SAR	సౌదీ రియాల్	ఖాతాదారుల	21.07	22.37
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతాదారుల	21.25	23.05
¥	చైనా యువాన్	ఖాతాదారుల	10.87	12.94

సన్ ఫార్మా చేతికి కాన్సెర్ట్ ఫార్మా!

రూ. 4,688 కోట్లకు కొనుగోలు ఒప్పందం

SUN PHARMA / CoNCERT Pharmaceuticals Inc.

న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ దేశీ దిగ్గజం సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ యూఎస్ కంపెనీ కాన్సెర్ట్ ఫార్మాస్యూటికల్స్‌ను సొంతం చేసుకోనుంది. ఇందుకు 57.6 కోట్ల డాలర్ల(సుమారు రూ. 4,688 కోట్లు)కు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. షేరుకి 8 డాలర్ల ముందస్తు ధరలో టెండర్ ఆఫర్ ద్వారా కాన్సెర్ట్ షేర్లను నగదు వెచ్చించడం ద్వారా కొనుగోలు చేయనున్నట్లు సన్ ఫార్మా వెల్లడించింది. 57.6 కోట్ల డాలర్ల విలువైన ఈక్విటీని చేజిక్కించుకునేందుకు కాన్సెర్ట్ ఫార్మాతో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. గత 30 రోజుల సగటు షేరు ధరను పరిగణిస్తే కాన్సెర్ట్ ఈక్విటీకి చెల్లిస్తున్న ధర 33 శాతం అధికమని తెలియజేసింది. కాన్సెర్ట్ వాటాదారులు ట్రేడింగ్‌కువీలులేని కంటింజెంట్ వేల్యూ రైట్(సీవీఆర్)కింద మరో 3.5 డాలర్లను అదనంగా పొందే వీలున్నట్లు వెల్లడించింది. అయితే నిర్ధారిత గడువులోగా నికర అమ్మకాల మైలురాళ్లను సాధించినప్పుడు మాత్రమే అదనపు చెల్లింపులకు వీలుంటుందని తెలియజేసింది.

కాన్సెర్ట్ ఫార్మా కొనుగోలు వార్తల నేపథ్యంలో సన్ ఫార్మా షేరు ఎన్‌ఎస్‌ఈలో రూ. 1,040 వద్ద యథాతథంగా ముగిసింది.

హెచ్‌యూఎల్ లాభం అప్

- క్యూ3లో రూ. 2,481 కోట్లు
- ఆదాయం రూ. 15,707 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యునిలీవర్(హెచ్‌యూఎల్) ఈ ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో రూ. 2,481 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో సాధించిన రూ. 2,300 కోట్లతో పోలిస్తే ఇది 8 శాతం వృద్ధి. మొత్తం ఆదాయం మరింత అధికంగా 16 శాతం వృద్ధితో రూ. 15,707 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 13,499 కోట్ల టర్నోవర్ నమోదైంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 10,329 కోట్ల నుంచి రూ. 12,225 కోట్లకు పెరిగాయి. అన్ని విభాగాలలోనూ మరోసారి పటిష్ట పనితీరును సాధించగలిగినట్లు హెచ్‌యూఎల్ సీఎండీ సంజీవ్ మెహతా పేర్కొన్నారు. ఇందుకు వ్యూహాలలో స్పష్టత, బ్రాండ్ల బలిమి, పటిష్ట ఆర్థిక నిర్వహణ తదితర అంశాలు దోహదపడినట్లు తెలియజేశారు. ద్రవ్యోల్బణ ప్రభావాన్ని అధిగమించామని, కన్జూమర్ డిమాండు నెమ్మదిగా పుంజుకోనుందని అభిప్రాయపడ్డారు.

రాయల్టీ పెంపు

మాతృ సంస్థ యూనిలీవర్ గ్రూప్‌నకు చెల్లించే రాయల్టీ, ఇతర సెంట్రల్ సర్వీసుల ఫీజును పెంచేందుకు బోర్డు అనుమతించినట్లు క్యూ3 ఫలితాల విడుదల సందర్భంగా హెచ్‌యూఎల్ వెల్లడించింది. యూనిలీవర్ గ్రూప్ నుంచి అందుకునే టెక్నాలజీ, ట్రేడ్‌మార్క్ లైసెన్సులు, సర్వీసులకుగాను హెచ్‌యూఎల్ ఫీజు చెల్లిస్తుంది. తాజా ఒప్పందం ప్రకారం రాయల్టీ, సెంట్రల్ సర్వీసుల ఫీజును ప్రస్తుత 2.65 శాతం నుంచి 3.45 శాతానికి పెంచేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈ ఏడాది నుంచి మూడేళ్లపాటు టర్నోవర్‌లో 3.45 శాతం చొప్పున దఫదఫాలుగా రాయల్టీ చెల్లింపులను చేపట్టనుంది. వెరసి 0.8 శాతం అధిక రాయల్టీని చెల్లించనుంది. ఇందుకు నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు లభించవలసి ఉంది. 2023 ఫిబ్రవరి నుంచి డిసెంబర్ మధ్యకాలంలో 0.45 శాతం, 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకూ మరో 0.25 శాతం, 2025 జనవరి నుంచి 0.1 శాతం చొప్పున రాయల్టీ చెల్లింపులు పెరగనున్నట్లు హెచ్‌యూఎల్ వివరించింది. రెండు సంస్థలూ ప్రస్తుత ఒప్పందాన్ని 2013 జనవరిలో కుదుర్చుకున్నాయి.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌యూఎల్ షేరు 1.6 శాతం క్షీణించి రూ. 2,643 వద్ద ముగిసింది.

హింద్ జింక్ లాభం డౌన్

క్యూ3లో రూ. 2,156 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో వేదాంతా గ్రూప్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 20 శాతం క్షీణించి రూ. 2,156 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 2,701 కోట్లు ఆర్జించింది. పెరిగిన వ్యయాలు, తగ్గిన అమ్మకాలు లాభదాయకతను దెబ్బతీశాయి. మొత్తం ఆదాయం సైతం రూ. 7,841 కోట్ల నుంచి రూ. 7,628 కోట్లకు క్షీణించింది. మొత్తం వ్యయాలు రూ. 4,411 కోట్ల నుంచి రూ. 5,028 కోట్లకు పెరిగాయి. గతేడాది మిలియన్ టన్నుల మైన్డ్ మెటల్ మార్క్‌ను సాధించగా.. ఈ ఏడాది మిలియన్ టన్నుల రిఫైన్డ్ మెటల్ మైలురాయిని అందుకునే వీలున్నట్లు కంపెనీ సీఈవో అరుణ్ మిశ్రా విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 2022 డిసెంబర్ 31కల్లా స్థూల పెట్టుబడులు, నగదు నిల్వల విలువ రూ. 16,482 కోట్లకు చేరినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో హింద్ జింక్ షేరు 4.3% జంప్‌చేసి రూ. 377 వద్ద ముగిసింది.

సూచీలకు మాంద్యం భయం

- 61 వేల దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీకి 58 పాయింట్ల నష్టం
- రెండురోజుల ర్యాలీకి బ్రేక్



ముంబై: ఆర్థిక మాంద్యం భయాలతో దేశీయ స్టాక్ సూచీల రెండురోజుల ర్యాలీకి గురువారం బ్రేక్ పడింది. కేంద్ర బడ్జెట్, రానున్న ప్రధాన కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వ్యవహరించారు. ఆటో, విద్యుత్, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సెన్సెక్స్ 187 పాయింట్లు నష్టపోయి 60,858 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 58 పాయింట్లు పతనమై 17,108 వద్ద నిలిచింది. అయితే ప్రభుత్వరంగ బ్యాంక్స్, ఐటీ రంగ షేర్లకు స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ లాభ, నష్టాల మధ్య కదలాడాయి. సెన్సెక్స్ 60,716 వద్ద కనిష్టాన్ని, 61,032 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 18,064 – 18,155 పరిధిలో కదలాడింది. అమెరికా తయారీ రంగ, రిటైల్ అమ్మకాలు మెప్పించకపోవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు అంచనాలను అందుకోలేకపోవడంతో ఏషియన్ పెయింట్స్ షేరు 3% నష్టపోయి రూ.2,868 వద్ద స్థిరపడింది.
- ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్(ఎఫ్‌పీఓ) ప్రకటన తర్వాత అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనవుతుంది. బీఎస్‌ఈలో నాలుగుశాతం క్షీణించి రెండు నెలల కనిష్ట స్థాయి రూ.3462 వద్ద స్థిరపడింది.
- బలమైన ఆదాయాల వృద్ధి నమోదు ఆశలతో ఓఎన్‌జీసీ షేరు రెండు శాతం పెరిగి ఆరు నెలల గరిష్టం రూ.152 వద్ద స్థిరపడింది.

ఏషియన్ పెయింట్స్ లాభం ప్లస్

క్యూ3లో రూ. 1,097 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఏషియన్ పెయింట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో రూ. 1,097 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో సాధించిన రూ. 1,031 కోట్లతో పోలిస్తే ఇది 6.4 శాతం వృద్ధి. మొత్తం ఆదాయం సైతం రూ. 8,527 కోట్ల నుంచి రూ. 8,637 కోట్లకు పుంజుకుంది. అయితే మొత్తం వ్యయాలు రూ. 7,220 కోట్ల నుంచి రూ. 7,281 కోట్లకు పెరిగాయి. డెకొరేటివ్ విభాగంలో గతేడాది విక్రయ ధరలు భారీగా పెరిగిన(హై బేస్) కారణంగా ప్రస్తుత సమీక్షా కాలంలో అమ్మకాల పరిమాణం, విలువలో మందగమనం నమోదైనట్లు కంపెనీ ఎండీ, సీఈవో అమిత్ సింగ్లే పేర్కొన్నారు. అక్టోబర్‌లోనూ రుతుపవనాలు కొనసాగడంతో పండుగల నేపథ్యంలోనూ రిటైల్ అమ్మకాలు నీరసించాయని, అయితే నవంబర్, డిసెంబర్‌లో తిరిగి ఊపందుకున్నట్లు తెలియజేశారు. అయితే ఆటోమొబైల్ తదితర ఇండస్ట్రియల్ విభాగం అమ్మకాల్లో పటిష్ట వృద్ధిని సాధించినట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో ఏషియన్ పెయింట్స్ షేరు 3.2 శాతం క్షీణించి రూ. 2,853 వద్ద ముగిసింది.

డల్లాస్‌లో మలబార్ గోల్డ్ 300వ షోరూం



హైదరాబాద్: ప్రముఖ బంగారం, వజ్రాల ఆభరణాల తయారీ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అమెరికాలోని డల్లాస్‌లో 300వ షోరూంను ఏర్పాటు చేసింది. ఈ జనవరి 18న కొల్లిన్ కౌంటీ కమిషనర్ సుసన్ ఫ్లెచర్, టెక్సాస్ ఫ్రిస్కో మేయర్ జెఫ్ చెనీలు ప్రారంభించారు. గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్, వైస్ చైర్మన్ కేపీ అబ్దుల్ సలాంతో పాటు ఎండీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఇతర సభ్యులు వర్చువల్ పద్ధతిలో పాల్గొన్నారు. భారతీయ ఆభరణాలు, డిజైన్లకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభిస్తుందని అందుకే విదేశాల్లో విస్తరిస్తున్నామని చైర్మన్ అహ్మద్ తెలిపారు.

సుప్రీంలోనూ గూగుల్‌కు షాక్!

- ఆండ్రాయిడ్ ఆధిపత్యం కేసులో జోక్యానికి నిరాకరణ
- ఎన్‌సీఎల్‌ఏటీ ఉత్తర్వుపై మధ్యంతర స్టేకు నో..



న్యూఢిల్లీ: ఆండ్రాయిడ్ ఆధిపత్యం వివాదం విషయంలో గూగుల్‌కు సుప్రీంకోర్టులోనూ ఎదురుదెబ్బ తగిలింది. ఇందుకు సంబంధించి నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) ఉత్తర్వును ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు పీఎస్ నరసింహా, జేబీ పార్డివాలాతో కూడిన ధర్మాసనం సమర్థించింది. అప్పిలేట్ ట్రిబ్యునల్ రూలింగ్‌పై మధ్యంతర స్టేకు నిరాకరించింది. అయితే మార్చి 31 నాటికి ఈ వివాదం విషయంలో తుది తీర్పును ఇవ్వాలని ఎన్‌సీఎల్‌ఏటీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విషయంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించిన రూ.1,337 కోట్ల జరిమానాలో 10 శాతాన్ని వారం రోజుల లోపు డిపాజిట్ చేయాలని కూడా అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

కేసు ముఖ్యాంశాలు...

- ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ రూపంలో గూగుల్ తన ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందని, అనుచిత వ్యాపార విధానాలను అనుసరిస్తోందంటూ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అక్టోబర్ 20న రూ.1337 కోట్ల జరిమానాను విధించడం గమనార్హం.
- దీనిపై అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో గూగుల్ సవాల్ చేసింది.
- అయితే, ఈ వివాదంలో ఎన్‌సీఎల్‌ఏటీ కూడా ఈ నెల మొదట్లో గూగుల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. సీసీఐ ఆదేశాలపై మధ్యంతర స్టే విధించేందుకు ఎన్‌సీఎల్‌ఏటీ నిరాకరించింది. ఆధిపత్య ఆరోపణలకు సంబంధించి సీసీఐ విధించిన రూ.1337 జరిమానాలో 10 శాతాన్ని డిపాజిట్ చేయాలని ఆదేశించింది. సీసీఐకి నోటీసులు ఇవ్వడంతో పాటు మధ్యంతర స్టేపై తదుపరి విచారణను ఫిబ్రవరి 13కు వాయిదా వేసింది.
- తాజాగా సుప్రీం కూడా గూగుల్ అప్పీల్‌కు రెడ్ సిగ్నల్ ఇచ్చింది. అప్పీల్ విచారణకు కాలపరిమితి సూచించడమే గూగుల్‌కు ఊరటనిచ్చే అంశం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-1-2023	
విశాఖ	575–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	84.00
19-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	550–00
వరంగల్	552–00
రిటైల్ ధర	6.10

సాక్షి స్పోర్ట్స్



సానియా జోడీ ముందంజ

హైదరాబాద్ వెటరన్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మహిళల డబుల్స్‌లో ముందంజ వేసింది. కెరీర్‌లో ఆఖరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతున్న ఆమె అనా డానిలినా (కజకిస్తాన్) కలిసి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుభారంభం చేసింది. తొలి రౌండ్లో సానియా–డానిలినా జోడీ 6–2, 7–5తో డాల్మా గాల్ఫీ (హంగేరి)–బెర్నార్డా పెర (అమెరికా) జంటపై విజయం సాధించింది. తొలి సెట్‌ను 25 నిమిషాల్లోనే వశం చేసుకున్న భారత్–కజకిస్తాన్ ద్వయానికి రెండో సెట్లో అనూహ్య పోటీ ఎదురైంది. 4–1తో గెలిచే దశలో కనిపించిన సానియా జోడీకి గాల్ఫీ–బెర్నార్డా వరుసగా 4 గేమ్‌లు గెలిచి సవాలు విసిరారు 5–5తో సమం చేశారు. అయితే తర్వాత వారి సర్వీస్‌ను బ్రేక్ చేయడం ద్వారా సానియా–డానిలినా జంట గెలుపొందింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 2009 (మిక్స్‌డ్), 2016 (డబుల్స్)లలో సానియా విజేతగా నిలిచింది.

'క్రాస్ ఓవర్'కు భారత్



- చివరి లీగ్‌లో 4–2తో వేల్స్‌పై విజయం
- ప్రపంచ కప్ హాకీ

భువనేశ్వర్: ప్రపంచ కప్ హాకీ టోర్నీలో నేరుగా క్వార్టర్ ఫైనల్ చేరుకునే లక్ష్యంతో గురువారం వేల్స్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగిన భారత్... కనీసం 8 గోల్స్ తేడాతో గెలిస్తే 'క్రాస్ ఓవర్' మ్యాచ్ అవసరం లేకుండా నేరుగా క్వార్టర్స్‌లో అడుగుపెట్టే అవకాశం. కానీ భారత జట్టు అంతటి అత్యుత్తమ స్థాయి ప్రదర్శన కనబర్చలేకపోయింది. బలహీన జట్టే అయినా వేల్స్ బాగా పోటీ ఇచ్చింది. చివరకు 4–2తో గోల్స్ తేడాతో భారత్ విజయం సాధించింది. భారత్ తరఫున షంషేర్ సింగ్ (21వ నిమిషం), ఆకాశ్‌దీప్ సింగ్ (32వ నిమిషం, 45వ నిమిషం), హర్మన్‌ప్రీత్ సింగ్ (59వ నిమిషం) గోల్స్ సాధించగా...వేల్స్ ఆటగాళ్లలో ఫర్లాంగ్ గ్యారెత్ (42వ నిమిషం), డ్రేపర్ జాకబ్ (44వ నిమిషం) గోల్స్ నమోదు చేశారు. గ్రూప్ 'డి'లో ఇంగ్లండ్‌తో సమానంగా 7 పాయింట్లతో నిలిచినా...ఆడిన 2 మ్యాచ్‌లలో కలిపి మెరుగైన గోల్స్ ప్రదర్శన ఆధారంగా (ఇంగ్లండ్ 9, భారత్ 6) మన జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఆదివారం జరిగే 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడే భారత్ ఆ మ్యాచ్‌లో గెలిస్తే క్వార్టర్స్ చేరుకుంటుంది. బలమైన ప్రత్యర్థి కాకపోయినా వేల్స్ ఒక దశలో భారత్‌ను బెంబేలెత్తించింది. మన టీమ్ కూడా అంది వచ్చిన అవకాశాలను గోల్స్‌గా మలచడంలో విఫలమైంది. 7 పెనాల్టీ కార్నర్లతో పాటు ఆరు సార్లు గోల్ చేసే అవకాశం వచ్చినా మనవాళ్లు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. తొలి క్వార్టర్‌లో గోల్స్ నమోదు కాకపోగా, రెండో క్వార్టర్‌లో ఒక గోల్‌తో భారత్ ముందంజ వేసింది. మూడో క్వార్టర్‌లో రెండు నిమిషాల వ్యవధిలో పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచి వేల్స్ స్కోరు సమం చేసింది. రెండో క్వార్టర్ తొలి నిమిషంలోనే భారత్‌కు పెనాల్టీ లభించగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ దానిని ఉపయోగించుకోలేకపోయాడు. అనంతరం హర్మన్‌ప్రీత్ డ్రాగ్ ఫ్లిక్ డిఫెండర్ స్టిక్‌కు తగిలి రీబౌండ్ అయి రాగా, ఈ సారి షంషేర్ దానిని గోల్ పోస్ట్‌లోకి పంపించగలిగాడు. అమిత్ రోహిదాస్ కూడా సరైన సమయంలో స్పందించడంలో విఫలమయ్యాడు. మూడో క్వార్టర్ 11వ నిమిషంలో లభించిన పెనాల్టీని అతను కూడా విఫలం చేశాడు. చివర్లో కాస్త దూకుడు పెంచిన భారత్ ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా ఊపిరి పీల్చుకుంది. 'ఈ విజయంతో మేం సంతృప్తిగా లేము. ఇది మా అత్యుత్తమ ప్రదర్శన కాదు. మరింత బాగా ఆడాల్సింది' అని మ్యాచ్ అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ వ్యాఖ్యానించాడు.

ఇతర మ్యాచ్‌లలో నెదర్లాండ్స్ 14–0తో చిలీని చిత్తుగా ఓడించగా... మలేసియా 3–2తో న్యూజిలాండ్‌పై, ఇంగ్లండ్ 4–0తో స్పెయిన్‌పై విజయం సాధించాయి.

'సాయ్' స్పందన సరిగా లేదు

పోలీస్ కేసు నమోదు చేయిస్తాం • కొనసాగిన రెజ్లర్ల నిరసన

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్ మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నాడంటూ తాము చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నామని భారత టాప్ రెజ్లర్లంతా పునరుద్ఘాటించారు. బ్రిజ్‌భూషణ్‌ను తప్పించి ఆటను కాపాడాలంటూ బుధవారం అనూహ్యంగా నిరసనకు దిగిన రెజ్లర్లు రెండో రోజూ దానిని కొనసాగించారు. బజ్‌రంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ తదితరులు ఇప్పటికే నిరసనలో పాల్గొంటుండగా గురువారం ఒలింపిక్ రజత పతక విజేత రవి దహియా, అన్షు మలిక్ కూడా వారికి సంఘీభావం ప్రకటించారు. రెజ్లర్ల ఆరోపణలకు స్పందిస్తూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) అధికారులు వారితో చర్చించేందుకు సిద్ధమయ్యారు. సుమారు గంట పాటు వారితో రెజ్లర్ల భేటీ సాగింది. అయితే దీనిపై ఆటగాళ్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమకు అండగా నిలుస్తామని అధికారులు చెబుతున్నా...వారి స్పందన సంతృప్తికరంగా లేదని, చర్చల విషయంలో ఎలాంటి హామీ ఇవ్వలేదని రెజ్లర్లు చెప్పారు. 'లైంగిక వేధింపులకు గురైన మరికొందరు బాధితులు ఇవాళ మాతో చేరారు. వారి పేర్లు ప్రస్తుతానికి బహిరంగపర్చదల్చుకోలేదు. ఏదైనా పరిష్కారం వస్తుందని భావించాం. కానీ ప్రభుత్వ స్పందన చూస్తే అలా అనిపించడం లేదు. ఇక మేం చట్టపరంగా, న్యాయపరంగా తేల్చుకుంటాం. బ్రిజ్‌భూషణ్ రాజీనామా మాత్రమే కాదు... ఆయనపై కేసు నమోదు చేయించి జైలుకు కూడా పంపిస్తాం. మేమంతా ఒలింపిక్ విజేతలం, ప్రపంచ విజేతలం. అన్నీ నిజాలే చెబుతున్నాం. తగిన ఆధారాలూ ఉన్నాయి. మా ఆరోపణలపై సందేహాలు వద్దు' అని వినేశ్ స్పష్టం చేసింది. బీజేపీకి చెందిన మరో అగ్రశ్రేణి రెజ్లర్ బబితా ఫొగాట్ కూడా ప్రభుత్వం తరఫున చర్చలకు ముందుకు వచ్చింది.



వినేశ్, బజరంగ్

కేంద్ర మంత్రిని కలిసిన రెజ్లర్లు

భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై తీవ్ర ఆరోపణలతో నిరసన తెలుపుతున్న రెజ్లర్లు గురువారం రాత్రి మరో కీలక అడుగు వేశారు. కేంద్ర క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌ను కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి, రెజ్లర్ల మధ్య గంటకు పైగా చర్చలు కొనసాగాయి. చర్చల తుది ఫలితంపై స్పష్టత లేకున్నా... బ్రిజ్‌భూషణ్ రాజీనామాకే ఠాకూర్ కూడా మద్దతు పలికినట్లు తెలిసింది. 24 గంటల్లోగా ఆయన తన రాజీనామాను ప్రకటించాలని, లేదంటే తామే ఆయనను తొలగిస్తామని కూడా స్పష్టం చేసినట్లు రెజ్లింగ్ వర్గాల సమాచారం.

భారత్ పోరాటం ముగిసె...

- లక్ష్యసేన్, సైనా ఓటమి
- ఇండియా ఓపెన్



లక్ష్యసేన్

న్యూఢిల్లీ: సొంతగడ్డపై జరుగుతున్న ఇండియా ఓపెన్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఆటగాళ్ల పోరాటం ప్రిక్వార్టర్స్‌లోనే ముగిసింది. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ లక్ష్యసేన్, మహిళల సింగిల్స్‌లో వెటరన్ స్టార్ సైనా నెహ్వాల్ పరాజయం పాలయ్యారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ గాయంతో వైదొలగగా... కృష్ణ ప్రసాద్–విష్ణువర్ధన్ గౌడ్ జోడీ ఓడిపోయింది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జంట కూడా నిరాశపరిచింది. గురువారం జరిగిన పోటీల్లో ప్రపంచ 12వ ర్యాంకర్, ఏడో సీడ్ లక్ష్యసేన్ 21–16, 15–21, 18–21తో ప్రపంచ 20వ ర్యాంకర్ రస్మస్ గెమ్కే (డెన్మార్క్) చేతిలో కంగుతిన్నాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సైనా 9–21, 12–21తో ఒలింపిక్ చాంపియన్ చెన్ యు ఫె (చైనా) ధాటికి నిలువలేకపోయింది. మహిళల డబుల్స్ ప్రి క్వార్టర్ ఫైనల్లో గాయత్రి–ట్రెసా జాలీ జంట 9–21, 16–21తో ఆరో సీడ్ జాంగ్ షు జియాన్–జెంగ్ యు (చైనా) ద్వయం చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో గరగ కృష్ణప్రసాద్–విష్ణువర్ధన్ గౌడ్ జోడీ 14–21, 10–21తో లియాంగ్ వి కెంగ్– వాంగ్ చాంగ్ (చైనా) ద్వయం చేతిలో ఇంటిదారి పట్టింది. సాత్విక్ సాయిరాజ్ తుంటిగాయం వల్ల చిరాగ్ షెట్టితో కలిసి బరిలోకి దిగలేకపోయాడు. దీంతో చైనాకే చెందిన లియు చెన్–జువాన్ యి జంట వాకోవర్‌తో ముందంజ వేసింది.

హైదరాబాద్ ఓటమి నం. 5

పుణే: రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు పరాజయాల పరంపర కొనసాగింది. ఈ సీజన్‌లో అత్యంత పేలవ ప్రదర్శన కనబర్చిన జట్టు వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. గురువారం మూడో రోజే ముగిసిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో మహారాష్ట్ర 9 వికెట్ల తేడాతో హైదరాబాద్‌ను చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 176/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 192 పరుగులకే ఆలౌటైంది. మహారాష్ట్రకు 193 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. దాంతో ఆ జట్టు హైదరాబాద్‌ను 'ఫాలో ఆన్' ఆడించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్ వైఫల్యంతో హైదరాబాద్ 219 పరుగులకే కుప్పకూలింది. చందన్ సహని (59) అర్ధ సెంచరీ సాధించగా...తన్మయ్ అగర్వాల్ (43), రోహిత్ రాయుడు (37) కొన్ని పరుగులు జోడించారు. 27 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మహారాష్ట్ర 17 బంతుల్లో వికెట్ నష్టానికి 30 పరుగులు చేసి మ్యాచ్‌ను ముగించింది.

రూడ్, జబర్‌లకు షాక్!

- రెండో రౌండ్‌లోనే ఓడిన రెండో సీడ్‌లు
- మూడో రౌండ్లోకి జొకోవిచ్
- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

మెల్‌బోర్న్: ఈ సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనాల పరంపర కొనసాగుతోంది. సీడెడ్ స్టార్లు రెండో రౌండే దాటలేకపోతున్నారు. నాలుగో రోజు పోటీల్లో రెండో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే), 12వ సీడ్, ఒలింపిక్ చాంపియన్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) ఇంటిదారి పట్టారు. నాదల్ ఇది వరకే అవుటైన ఈ టోర్నీలో హాట్ ఫేవరెట్‌గా మారిన సెర్బియన్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మూడో రౌండ్లోకి ప్రవేశించాడు. మహిళల సింగిల్స్‌లో నిరుటి వింబుల్డన్, యూఎస్ ఓపెన్ రన్నరప్, రెండో సీడ్ అన్స్ జబర్ (ట్యూనిషియా), తొమ్మిదో సీడ్ వెరొనికా కుడెర్మెతొవ (రష్యా), 16వ సీడ్ అనెట్ కొంటావిట్ (ఈస్టోనియా)లు కంగు తిన్నారు. ఈ విభాగంలో నాలుగో సీడ్ కరొలిన్ గార్సియా (ఫ్రాన్స్), ఐదో సీడ్ అరిన సబలెంక (బెలారస్), 12వ సీడ్ బెలిండా బెన్సిక్ (స్విట్జర్లాండ్) ముందంజ వేశారు.

బ్రూక్స్‌బి 'హీరో'చితం

పురుషుల సింగిల్స్‌లో గురువారం జరిగిన రెండో రౌండ్లో 22 ఏళ్ల యువ అమెరికన్ జెన్సన్ బ్రూక్స్‌బి సంచలన ప్రదర్శనతో రూడ్‌ను కంగుతినిపించాడు. దీంతో గతేడాది ఫ్రెంచ్, యూఎస్ ఓపెన్‌లలో రన్నరప్‌గా నిలిచిన రూడ్ ఈ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్‌లో అనూహ్యంగా రెండో రౌండ్లోనే ఇంటిదారి పట్టాడు. 3 గంటల 55 నిమిషాల సమరంలో బ్రూక్స్‌బి 6–3, 7–5, 6–7 (4/7), 6–2తో రూడ్‌ను ఓడించాడు. 8వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) అయితే వైల్డ్‌కార్డ్ ప్లేయర్ అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా) చేతిలో చేతులెత్తేశాడు. ఫ్రిట్జ్ 7–6 (7/4), 6–7 (2/7), 4–6, 7–6 (8/6), 2–6తో 23 ఏళ్ల అలెక్సీ పోరాటానికి తలవంచాడు. నాలుగో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) 6–1, 6–7 (5/7), 6–2, 6–0తో క్వాలిఫయర్ ఎంజో కౌకాడ్ (మారిషస్)పై గెలుపొందగా, జ్వెరెవ్‌కు 7–6 (7/1), 4–6, 3–6, 2–6తో మైకేల్ మో (అమెరికా) చేతిలో చుక్కెదురైంది. ఐదో సీడ్ రుబ్లెవ్ (రష్యా) 6–2, 6–4, 6–7 (2/7), 6–3తో ఎమిల్ రుసువురి (ఫిన్లాండ్)పై నెగ్గాడు.



వొండ్రొసొవా

మూడో రౌండ్లో గార్సియా, సబలెంక

మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో నాలుగో సీడ్ గార్సియా (ఫ్రాన్స్) 7–6 (7/5), 7–5తో లేలా ఫెర్నాండెజ్ (కెనడా)పై, ఐదో సీడ్ సబలెంక (బెలారస్) 6–3, 6–1తో షెల్బీ రోజర్స్ (అమెరికా)పై వరుస సెట్లలో విజయం సాధించారు. అయితే గతేడాది సూపర్ ఫామ్‌లో ఉన్న రెండో సీడ్ జబర్ (ట్యూనిషియా) 1–6, 7–5, 1–6తో మర్కెట వొండ్రొసొవా (చెక్ రిపబ్లిక్) చేతిలో పరాజయం పాలైంది. 9వ సీడ్ కుడెర్మెతొవ (రష్యా) 4–6, 6–2, 2–6తో అమెరికాకు చెందిన క్వాలిఫయర్ కేటీ వొలినెట్స్ చేతిలో ఇంటిదారి పట్టింది. 12వ సీడ్ బెన్సిచ్ 7–6 (7/3), 6–3తో క్లెయిర్ లియూ (అమెరికా)పై గెలుపొందగా, 16వ సీడ్ కొంటావిట్ (ఈస్టోనియా) 6–3, 3–6, 4–6తో మగ్ద లినెట్ (పోలాండ్) చేతిలో కంగుతింది. 30వ సీడ్ కరోలినా ప్లిస్కొవా (చెక్ రిపబ్లిక్) 6–0, 7–5తో పుతినెత్సవ (రష్యా)పై గెలిచింది.

విసరడంతోనే తొక్కిసలాట!

చంద్రన్న కానుకలు లారీల నుంచి విసిరేయడంతో ఒక్కసారిగా తోపులాట

- గుంటూరు ఘటనపై ప్రత్యక్ష సాక్షులు, బాధితుల వాంగ్మూలం
- హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ శేషశయనారెడ్డి ఆధ్వర్యంలో విచారణ
- తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన కమిషన్


సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

'చంద్రబాబునాయుడు వెళ్లిపోయిన తర్వాత క్యూలైన్‌లో నిల్చున్నాం.. లారీలపై ఉన్న వలంటీర్లు కానుకలను కిందకు విసరడంతో టోకెన్ లేకపోయినా ఇస్తున్నారంటూ అంతా ఒక్కసారిగా ఎగబడ్డారు.. కానుకలు విసరడంతోనే తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో నా కుమార్తె గాయపడగా నేను అదృష్టవశాత్తూ బయటపడ్డా...'
– విచారణ కమిటీ ఎదుట గుంటూరుకు చెందిన రాఘవి వాంగ్మూలం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: నూతన ఏడాది తొలిరోజు గుంటూరులో చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ సందర్భంగా తొక్కిసలాటలో ముగ్గురు మహిళలు మృతి చెందిన ఘటనపై బాధితులు, ప్రత్యక్ష సాక్షులు గురువారం విచారణ కమిటీ ఎదుట హాజరై వాంగ్మూలం ఇచ్చారు. జనవరి 1వ తేదీన ఉయ్యూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు హాజరైన విషయం తెలిసిందే. కందుకూరు, గుంటూరులో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటనల్లో మొత్తం 11 మంది మృత్యువాత పడ్డ నేపథ్యంలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ శేషశయనారెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిషన్‌ను నియమించింది. గుంటూరులో ఘటన జరిగిన ప్రాంతాన్ని సందర్శించిన కమిషన్ మైదానం సామర్థ్యం, ఎంత మంది ఉన్నారు? తొక్కిసలాట ఎలా జరిగింది? అనే అంశాలపై కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌లతోపాటు బాధితులు, నిర్వాహకులను ఆరా తీసింది. సభ జరిగిన ప్రదేశం కొలతలు సేకరించింది. ఎంత మందికి కానుక టోకెన్లు ఇచ్చారు? పంపిణీ వద్ద ఎంతమంది ఉన్నారు? తదితర సమాచారాన్ని సేకరించింది. అనంతరం ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో విచారణ కొనసాగించారు. గాయపడ్డ వారు, మృతుల కుటుంబీకుల స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

తక్షణమే స్పందించడంతో..

తాము 60 క్యూలైన్లు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించినట్లు పోలీసులు వెల్లడించారు. 30 ఏర్పాటు చేస్తామని చెప్పి చివరికి 12 మాత్రమే ఏర్పాటు చేశారని వివరించారు. బారికేడ్లలో ఒక్కో క్యూలైన్ వెడల్పు ఐదు అడుగులకుపైగా ఉండటంతో కానుకలు తీసుకుని వెనక్కి వచ్చే వారు ఇరుక్కుపోయి తొక్కిసలాట చోటు చేసుకుందని తెలిపారు. తాము వెంటనే స్పందించి కానుకల పంపిణీని నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పిందని ఘటనా స్థలంలో బాధ్యతలు నిర్వహించిన పోలీసు అధికారులు కమిషన్‌కు వాంగ్మూలం ఇచ్చారు.

అంతా ఒకే లైన్‌లోనే..


చంద్రబాబు సభ ముగిసే వరకు చీరల పంపిణీ వద్దకు ఎవరిని వెళ్లనివ్వలేదు. సభ ముగిసిన తరువాత వెళితే ఒక కౌంటర్‌లో ఐదు వేల మందికిపైగా ఉన్నారు. ఒకే లైన్ ద్వారా వెళ్లటం, తిరిగి బయటకు రావటంతో ఇరుక్కుని తొక్కిసలాట జరిగింది. కళ్ల ముందే ఎంతో మంది గాయాలపాలయ్యారు. నిర్వహణ సరిగా లేకపోవటంతోనే తొక్కిసలాట జరిగింది.
– గుంటముక్కల సౌందర్య (స్వర్ణభారతినగర్)

అక్కా అంటూ ఆప్యాయంగా..


మా ఇంటి పక్క వీధిలో నివసించే షేక్ బీబీ తొక్కిసలాటలో మృతి చెందింది. అక్కా అని ఎంతో అభిమానంగా ఉండేదాన్ని. తొక్కిసలాటలో కళ్ల ముందే చనిపోవటాన్ని మరవలేకపోతున్నా. నేను స్పృహ కోల్పోయి రెండు రోజుల పాటు ఐసీయూలో కోమాలో ఉన్నా. వెన్నుపూస దెబ్బతిని నరకం అనుభవిస్తున్నా.
– తెల్లమేకల రంగాదేవి (మారుతీనగర్)

కాలు విరిగింది..


సభకు వెళ్లిన వారిని మధ్యాహ్నం నుంచి కుర్చీల్లో కూర్చోబెట్టారు. చంద్రబాబు వెళ్లిపోయిన తరువాత ఒక్కసారిగా వదిలిపెట్టడంతో ఘటన చోటు చేసుకుంది. తొక్కిసలాటలో నాకు కాలు విరగడంతో ఆపరేషన్ చేశారు. 15 రోజుల తరువాత అడుగు కిందకు పెట్టా. మాకు న్యాయం చేయాలి. – షేక్ హుస్సేన్‌బీ (ఏటీ అగ్రహారం)

ఐటీ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఇన్ఫినిటీ వైజాగ్

రాష్ట్రంలో ఐటీ పెట్టుబడుల అవకాశాలపై విశాఖలో రెండురోజుల సదస్సు

- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖరన్
- హాజరుకానున్న ఐటీ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర అధికారులు
- 12 ఐటీ, ఐటీ ఆధారిత సంస్థలు స్టాల్స్ ఏర్పాటు


సదస్సు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఐటాప్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: ఐటీ రంగంలో అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడంతోపాటు పలు ఐటీ కంపెనీలను ఆకర్షించే విధంగా రెండురోజుల 'ఇన్ఫినిటీ వైజాగ్' సదస్సు శుక్రవారం ప్రారంభం కానుంది. ఐటీ పెట్టుబడుల ప్రధాన ఆకర్షణగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్), సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్టీపీఐ)తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఇన్ఫినిటీ వైజాగ్ పేరుతో శుక్ర, శనివారాల్లో ఈ సదస్సు నిర్వహిస్తోంది. ద్వితీయ శ్రేణి నగరాల వైపు ఐటీ సంస్థలు ఆసక్తి చూపిస్తున్న తరుణంలో వైజాగ్‌లో ఉన్న మెరుగైన అవకాశాల్ని ప్రపంచవ్యాప్తంగా ప్రమోట్ చేసేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. కేంద్ర ఐటీశాఖ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖరన్ వర్చువల్‌గా ప్రారంభించే ఈ సదస్సులో రెండోరోజు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారు. సైయంట్ ఫౌండర్ బి.వి.ఆర్.మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ సదస్సుకు కేంద్ర ఐటీశాఖ కార్యదర్శి అఖిలేష్‌కుమార్ శర్మ, ఎస్టీపీఐ డైరెక్టర్ అరవింద్‌కుమార్, పలు ఐటీ కంపెనీల ప్రతినిధులు, యూనికార్న్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారు. బాస్, టెక్‌మహీంద్రా, మైక్రోసాఫ్ట్, సీమెన్స్, జాన్సన్ అండ్ జాన్సన్, సైబర్ సెక్యూరిటీ, ఐశాట్ మొదలైన 20కి పైగా ఐటీ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు సదస్సులో పాల్గొనేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ఐటీ రంగంలో వస్తున్న మార్పులు, రాష్ట్రంలో ఐటీ కంపెనీల ఏర్పాటుకు అవకాశాలు, ప్రయోజనాలపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించనున్నట్లు ఐటాప్ ప్రెసిడెంట్ కోసరాజు శ్రీధర్ తెలిపారు.

ఐటీలో ఏపీని అగ్రగామిగా నిలిపేందుకు..

భవిష్యత్తులో ఐటీకి బ్రాండ్ అంబాసిడర్‌గా ఏపీని నిలిపేందుకు చేపట్టాల్సిన వ్యూహాలపై రోడ్ మ్యాప్ రూపొందించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం. ఇండస్ట్రీ 4.0, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వెబ్ 3.0 ఆవిష్కరణలు, డీప్‌టెక్ డొమైన్.. తదితర రంగాల్లో రాష్ట్ర ఐటీ రంగాన్ని అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషిచేస్తోంది. దానికనుగుణంగా ఈ సదస్సులో కార్యక్రమాలను రూపొందించారు. బిజినెస్ టూ బిజినెస్ (బీటూబీ) నెట్‌వర్కింగ్ అవకాశాలు సృష్టిసూ మల్టీ నేషనల్ కంపెనీలతో నెట్‌వర్క్ చేసుకోవడం, పెట్టుబడుల్ని ఆకర్షించడం మొదలైన అంశాలే ముఖ్య అజెండాగా సదస్సు నిర్వహిస్తున్నారు. తొలి రోజు శుక్రవారం ఐటీ, స్టార్టప్‌లపై దృష్టి సారించనున్నారు. రెండోరోజున ఐటీ ఆధారిత పరిశ్రమలు, బీపీవో కంపెనీలపై చర్చించనున్నారు. ఈ సదస్సుకు పర్యావరణ భాగస్వాములుగా నాస్కామ్, టై ఏపీ చాప్టర్, ఏపీ ఛాంబర్స్, ఏపీ స్టార్టప్స్, ఏ-హబ్ వ్యవహరించనున్నాయి. వివిధ ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు కలిపి మొత్తం 12 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయి.

ఐటీ సంస్థలకు 21 అవార్డులు అందిస్తున్న ఎస్టీపీఐ

రాష్ట్రంలో అత్యుత్తమ పనితీరు కనపరుస్తున్న ఐటీ కంపెనీలకు సదస్సు తొలిరోజు ఎస్టీపీఐ అవార్డులు ఇవ్వనుంది. ఐటీ రంగంలో అత్యుత్తమ ఎగుమతులు నమోదు చేసిన కంపెనీ, అత్యధికమందికి ఉపాధి కల్పించిన కంపెనీ, అత్యధిక మహిళలకు ఉపాధి కల్పించిన సంస్థ, ఐటీ ఎమర్జింగ్ సిటీస్, యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ వంటి 21 విభాగాల్లో ఈ అవార్డులను ప్రదానం చేయనుంది. సరికొత్త ఆవిష్కరణలు నమోదు చేసిన స్టార్టప్‌కు రూ.లక్ష నగదు పురస్కారంతోపాటు అవార్డు, మెమెంటో ఇవ్వనుంది.

సిరుల తల్లి.. కల్పవల్లి

వైభవంగా మావుళ్లమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు

- నిత్యం ప్రత్యేక పూజలు
- సాంస్కృతిక, కళా ప్రదర్శనలు
- రాష్ట్ర నలుమూలల నుంచి భక్తుల రాక
- రెండేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో వేడుకలు



భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిలాల భీమవరం పట్టణ ఇలవేల్పు, భక్తుల పాలిట కొంగు బంగారం భీమవరం మావుళ్లమ్మవారి ఆలయ 59వ వార్షిక మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నీరుల్లి, కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 13న ప్రారంభమైన ఉత్సవాలు వచ్చేనెల 10వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రోజూ అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించేందుకు వస్తున్నారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి సంక్రాంతి పండగకి జిల్లాకు వచ్చిన కుటుంబాలతో పాటు భక్తులు తరలివస్తున్నారు. దీంతో రోజూ ఆలయం వద్ద సందడి కనిపిస్తోంది.

అధిక సంఖ్యలో తరలివస్తూ.. : ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలు, పరిసరాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ, భారీ సెట్టింగులు, డెకరేషన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే రోజూ సాయంత్రం వేళ ఏర్పాటుచేసిన సాంస్కృతిక, నాటక, కళా ప్రదర్శనలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో జనం తరలివస్తున్నారు. లైటింగ్, సెట్టింగ్స్ తిలకించడానికి వచ్చే వారితో సాయంత్రం నుంచి రాత్రి వరకు అమ్మవారి ఆలయ ప్రాంగణం జనసంద్రాన్ని తలపిస్తోంది.

'కళా'వైభవం: ఉత్సవాల్లో భాగంగా రోజూ అమ్మవారి కళావేదికపై సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఏర్పాటుచేస్తున్న నాటక, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, హరి కథలు, బుర్ర కథలు, సినీ ఆర్కెస్ట్రాలు అలరిస్తున్నాయి. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా 25 రోజులపాటు నాటక ప్రదర్శనలను ఇక్కడ ఏర్పాటుచేశారు. వీటి ద్వారా రంగస్థల కళాకారులకు ఉపాధి కల్పిస్తున్నారు.

నిత్య పూజలు: ఆలయంలో అమ్మవారికి సాధారణ నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. విశేష కుంకుమ పూజలు, హోమాలు చేస్తున్నారు. భక్తులు మనసారా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేలా కమిటీ సభ్యులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

అన్నదానం.. మహోన్నతం : రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్న నేపథ్యంలో వారికి భోజన ఇబ్బందులు లేకుండా ఉత్సవ నిర్వాహకులు ఆలయం వద్ద నిత్యాన్నదానాన్ని అందిస్తున్నారు. రోజుకు 1,000 మంది వరకు భక్తులకు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 25 రోజులపాటు అన్నదానం నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

ఏటా వస్తున్నాం

ఏటా అమ్మవారి ఉత్సవాలకు వస్తున్నాం. అమ్మవారి దర్శనం అదృష్టంగా భావిస్తున్నాం. రోజూ సాయంత్రం వేళ ఆలయం వద్ద ఏర్పాటుచేస్తున్న కళా ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ఆలయం వద్ద విద్యుద్దీప కటౌట్లు, సెట్టింగులు చాలా బాగున్నాయి.
–పి.భాగ్యజ్యోతి హైదరాబాద్

దాతలే.. స్ఫూర్తి ప్రదాతలు

అరసవల్లిలో 1996 నుంచి కొనసాగుతున్న నిత్యాన్నదానం

- ఇప్పటివరకు రూ.5 కోట్ల వరకు విరాళాలు
- నెలకు సగటున 15 వేల మందికి అన్న ప్రసాదం

ఆకలి తీర్చడానికి మించిన సత్కార్యం, అన్నం పెట్టడానికి మించిన దానం ఏముంటుంది. అది కూడా దేవుని సన్నిధిలో చేయగలిగితే ఆ మానవ సేవ మాధవ సేవతో సమానమవుతుంది. ఇలా 26 ఏళ్లుగా అరసవల్లిలో అన్నదాన క్రతువు జరుగుతోంది. దాతలు ఇచ్చిన విరాళాలతో ఇక్కడ భక్తుల కడుపు నిండుతోంది. అన్న పానీయాలను దేవుని ప్రసాదంగా స్వీకరిస్తూ అనునిత్యం వందలాది మంది భక్తులు ఇక్కడ ఆదిత్యాయ నమోస్తుతే అన్న మంత్రంతో పాటు అన్నదాత సుఖీభవ అన్న పదాన్ని పలుకుతూనే ఉన్నారు. ఈ విరాళాలు ఇప్పటికి రూ.5కోట్లకు చేరడం విశేషం.




అన్నదానం స్వీకరిస్తున్న భక్తులు

అరసవల్లి: సూర్యనారాయణుడి సమక్షంలో ఆత్మారాముని అర్చన సలక్షణంగా జరుగుతోంది. దేశంలో నిత్య పూజలు అందుకుంటున్న ఏకైక సూర్యదేవాలయంగా విశిష్ట గుర్తింపు పొందిన ఆరోగ్య క్షేత్రం అరసవల్లిలో స్వామి వారి అన్న ప్రసాదానికి కూడా ప్రత్యేకత ఉంది. ఇక్కడ 1996లో నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించగా.. నేటికీ అప్రతిహతంగా కొనసాగుతోంది. గతంలో రోజుకు గరిష్టంగా వంద మంది వరకు అన్నదానం అందించేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 300 కు చేరింది. నెలలో సుమారుగా ఈ సంఖ్య 15 వేలకు చేరిననట్లుగా రికార్డులు చెబుతున్నాయి. అలాగే ఉల్లి, వెల్లుల్లి, మసాలాలను వినియోగించకుండా చేస్తున్న కూరలు మంచి రుచికరంగా ఉండేలా ఆలయ సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

రూ.5 కోట్లకు చేరిన విరాళాలు

నిత్యాన్నదాన పథకానికి అమలు కోసం పలువురు దాతలు తమవంతుగా విరాళాలను స్వచ్ఛందంగా అందజేస్తున్నారు. ఇలా వచ్చిన విరాళాలను ఆలయ అధికారులు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ వడ్డీలతో అన్నదాన పథకాన్ని అమలు చేస్తున్నారు. 1996 నుంచి నేటి వరకు మొత్తం ఈ హెడ్ కింద రూ.5 కోట్ల వరకు విరాళాలను ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో బ్యాంకుల్లో ఉన్నట్లుగా ఆలయ అధికారులు చెబుతున్నారు. అలాగే రూ.లక్ష వరకు విరాళాలను అందజేసిన దాతలు (రాజపోషకులు) మొత్తం 110 మంది వరకు నమోదయ్యారు.

రూ.500తో రోజుకు పది మందికి..

నిత్యాన్నదాన పథకంలో ఎక్కడినుంచి వచ్చిన భక్తులైనా అన్నప్రసాదాన్ని స్వీకరించవచ్చు. అలాగే విరాళాలను కూడా ఇవ్వవచ్చు. తమ గోత్రనామాలతో రశీదును పొందవచ్చును. అయితే ఒక రోజుకు కనీసం 10 మందికి అన్నదానానికి రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే శాశ్వత విరాళంగా రూ.5000 (గరిష్టంగా 10 సంవత్సరాల వరకు) చెల్లించాలి. అయితే భక్తుల కోరిక మేరకు వారికి నచ్చిన రోజున ఏడాదికి ఒసారి అన్నదాన ప్రసాదాలను అందజేస్తారు. ఇక రూ.లక్ష వరకు విరాళాన్ని ఇస్తే ఆ వడ్డీతో ఏడాదికి 100 మందికి అన్నదానాన్ని గరిష్టంగా పదేళ్ల వరకు అందజేస్తారు.

రోజూ స్వామికి నివేదించిన తర్వాతే..

నిత్యాన్నదాన పథకంలో భాగంగా భక్తులకు అరటి ఆకుల్లో పులిహోర, అన్నం, సాంబారు, మజ్జిగ, కొబ్బరి పచ్చడి, శాకాహార కూర వడ్డిస్తారు. అలాగే ప్రతి ఆదివారం బన్సీ రవ్వతో స్వీట్‌ను కూడా వడ్డిస్తారు. అయితే ఈ తయారీ వంటలను ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ సూచనల మేరకు నిత్యం ఆదిత్యునికి నివేదించిన తర్వాతే భక్తులకు ప్రసాదంగా వడ్డిస్తారు. ఇంతవరకు ఆదివారం ఒక్కరోజే సుమారు 800 మందికి, మిగతా రోజుల్లో 300–400 మందికి మాత్రమే అన్నదానాన్ని అందజేసేలా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ చర్యలు చేపట్టారు. ఆదివారాల్లో మరింత పెంచే ఆలోచనను అమలు చేసేందుకు సిద్ధమయ్యారు.

నిత్యాన్నదానం విరాళాలు చెల్లించాలిలా..

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఒకరోజుకు రూ.500 చెల్లిస్తే కనీసం 10 మందికి అన్నదానం చేస్తారు.

- ఈ నగదును నేరుగా అరసవల్లి ఆలయం పేరిట మనీఆర్డర్ ద్వారా గానీ, నేరుగా గానీ చెల్లించాలి.
- శాశ్వత అన్నదానం కోసం రూ.5000 చెల్లించాలి..ఏదో ఒక రోజు చొప్పున పదేళ్ల పాటు ఈ పథకం అమలవుతుంది.
- అన్నదానానికి చెల్లించాల్సిన నగదును ఈఓ, శ్రీసూర్యనారాయణ స్వామి దేవస్థానం పేరిట యూనియన్ బ్యాంక్ (అరసవల్లి) ఖాతా నంబర్ 211110100009099...(ఐఎఫ్‌ఎస్‌సి కోడ్: యుబిఐఎన్0821110)లో నగదును ఆన్‌లైన్ ద్వారా జమ చేయాలి. లేదా నేరుగా ఆలయ విరాళాల కౌంటర్‌లో చెల్లించి, పేరు, గోత్రాన్ని అడ్రస్‌తో సహా వివరాలను ఆలయ సిబ్బందికి తెలియజేయాలి.
- ఆన్‌లైన్‌లో నగదు చెల్లించిన భక్తులు ఆ రశీదును అడ్రస్‌తో కూడిన వివరాలను ఆలయ అధికారిక వాట్సాప్ నంబర్ (8978914660, 9491000708)లకు పంపించాల్సి ఉంటుంది.

నాణ్యమైన అన్నప్రసాదం అందిస్తున్నాం..

ఆదిత్యుని అన్నదాన ప్రసాదాన్ని పూర్తి నాణ్యతతో అందిస్తున్నాం. ఈ ట్రస్ట్‌కు దాతల ప్రోత్సాహం నిజంగా అద్భుతం. కనీసం రోజుకు పది మందికి పైగానే భక్తులు కనీసంగా రూ.500 చొప్పున చెల్లిస్తుంటారు. అలాగే రూ.లక్ష వరకు విరాళం ఇచ్చేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. వీరి పేర్లతో కూడిన బోర్డులను అన్నదాన సత్రంలోనే ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతాం. వీలైనంతలో అన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేస్తాం.
– వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఈఓ

జెట్ స్పీడ్‌గా ఎక్స్‌ప్రెస్ హైవే పనులు

పలమనేరు నియోజకవర్గంలో చెన్నై– బెంగళూరు 6 ట్రాక్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు శరవేగంగా సాగుతున్నాయి. అలైన్‌మెంట్ మేరకు మట్టి రోడ్డుపనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. హైవే మూడు ఫేజ్‌లలో నిర్మాణం సాగుతుండగా.. ఇప్పటికే కర్ణాటకలో 37శాతం పనులు పూర్తయ్యాయి. రెండో ఫేజ్‌లో పలమనేరు నియోజకవర్గంలోనూ పదిశాతం పనులు జరిగాయి. ఈనెల 10న కర్ణాటక రాష్ట్రంలోని హోస్కోట సమీపంలో వడగనహళ్లి వద్ద పనులను పరిశీలించిన కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్‌గడ్కరి 2024 మార్చికల్లా పూర్తిచేసి ప్రారంభించనున్నట్టు వెల్లడించిన విషయం తెలిసిందే.

2024 మార్చిలోగా చెన్నై-బెంగళూరు హైవే పూర్తి

- తొలిదశలో కర్నాటక రాష్ట్రంలో 37శాతం పూర్తి
- రెండో దశలో ఏపీలో పదిశాతం పూర్తయిన పనులు
- చిత్తూరు జిల్లాలో జోరందుకున్న మట్టి రోడ్డు నిర్మాణం
- పూర్తయితే ప్రయాణ సమయం
- 2 గంటల 15నిమిషాలు మాత్రమే


పలమనేరు మండలం గజ్జలవారిపల్లె- జల్లిపేటల వద్ద మట్టి రోడ్డు పనులు

పలమనేరు(చిత్తూరు జిల్లా):చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు స్పీడందుకున్నాయి. చెన్నై సమీపంలోని శ్రీపెరంబుదూర్ నుంచి బెంగళూరు సమీపంలోని హొసకోట వరకు 283.5 కిలోమీటర్ల మేరకు 6 ట్రాక్ ఎక్స్‌ప్రెస్ హైవేను ఎన్‌హెచ్ఏఐ(నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) భారత్‌మాల పరియోజన పథకం కింద రూ.16,730 కోట్లతో 2021 నుంచి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మూడు ఫేజుల్లో పనులు సాగుతున్నాయి. తొలిఫేజ్‌లో కర్ణాటక పరిధిలోని 71 కిలోమీటర్లలో ఇప్పటికే 37.56 శాతం పనులు పూర్తయ్యాయి. రెండు, మూడు ఫేజ్‌లలో మన రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాతో పాటు తమిళనాడు రాష్ట్రంలో 112 కిలోమీటర్లలో పదిశాతం మట్టిరోడ్డు పనులు, అలైన్‌మెంట్ ల్యాండ్ లెవలింగ్ సాగుతోంది. పనులు త్వరితగతిన జరిగేలా మూడు ఫేజ్‌లలో పది ప్యాకేజీలుగా విభజించారు. ఇందులో కర్ణాటకలో మూడు, ఏపీలో మూడు, తమిళనాడులో నాలుగు ప్యాకేజీలు ఉన్నాయి. కర్ణాటక సరిహద్దు నుంచి పలమనేరు నియోజకవర్గంలోని వీకోట, బైరెడ్డిపల్లె, పలమనేరు మండలాల మీదుగా 60 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు సాగుతున్నాయి. వీటిని బేతమంగళ నుంచి బైరెడ్డిపల్లె వరకు మోంటీకార్లె లిమిటెడ్ కంపెనీ, బైరెడ్డిపల్లె నుంచి బంగారుపాళెం వరకు ఆప్కో ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ, బంగారుపాళెం నుంచి గుడిపాల దాకా దిలీప్‌బిల్డ్‌కాన్ కంపెనీ పనులు చేపడుతున్నాయి. పలమనేరు మండలంలోని బేలుపల్లి క్రాస్, పట్టణ సమీపంలోని గంటావూరు వద్ద నిర్మాణ సామాగ్రి కోసం యంత్రాలను నిర్మాణ కంపెనీ ఏర్పాటు చేసుకుంది.

ఎక్స్‌ప్రెస్‌హైవే వివరాలిలా...

- చెన్నై నుంచి బెంగళూరు వరకు రోడ్డు దూరం 283.5 కిలోమీటర్లు
- ఇది కర్ణాటకలో 77 కి.మీ, ఏపీలో 91 కి.మీ, తమిళనాడులో 93 కిలోమీటర్లు
- ఇప్పటి వరకు బెంగళూరు–చెన్నై ప్రయాణ సమయం 6 గంటలు
- ఎక్స్‌ప్రెస్ హైవేలో పూర్తయితే 2 గంటల 15నిమిషాలు మాత్రమే
- ఈ రహదారిలో సాధారణ వేగం గంటకు 120 కిమీ
- ఎక్స్‌ప్రెస్‌హైవేలో మొత్తం బ్రిడ్జిలు –162
- రైల్వేక్రాసింగ్‌లు–4, కల్వర్టులు–143
- మొత్తం ఫ్లైఓవర్‌లు– 17 ఉంటాయి.

మూడు రాష్ట్రాల్లో రోడ్డు కనెక్ట్ కానున్న పట్టణాలివే...

- హోస్కోట(బెంగళూరు రూరల్ జిల్లా)
- మాలూరు(కోలారు జిల్లా)
- బంగారుపేట(కోలారు జిల్లా)
- కేజీఎఫ్(కోలార్‌జిల్లా)
- వీ.కోట(చిత్తూరు జిల్లా)
- హైవేజంక్షన్–బైరెడ్డిపల్లె(చిత్తూరు జిల్లా)
- పలమనేరు (చిత్తూరు జిల్లా)
- బంగారుపాళెం(చిత్తూరు జిల్లా)
- చిత్తూరు, గుడిపాల(చిత్తూరు జిల్లా)
- రాణిపేట,వాలాజాపేట్,ఆర్కోణం (తమిళనాడు)
- శ్రీపెరంబుదూర్(తమిళనాడు)


హైవే డిజైన్ ఇలా..

దక్షిణాదిలోనే తొలి ఎక్స్‌ప్రెస్ హైవే

దక్షిణ భారతదేశంలోనే చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌హైవే మొట్టమొటది కానుంది. దీనికి ఎన్‌హెచ్ఏఐ ఎన్ఈ 7గా నామకరణం చేశారు. ముఖ్యంగా మూడు రాష్ట్రాల్లో ఆర్థికాభివృద్ధి పెంపొందించడమే ఈ రహదారి నిర్మాణ ఉద్దేశం. బెంగళూరునుంచి చెన్నై పోర్టుకు రవాణా సౌకర్యాలను పెరిగేందుకు ఈ రోడ్డు ఉపకరిస్తుంది. బెంగళూరు నుంచి చెన్నైకి విమానంలో ప్రయాణించేవారు సైతం తక్కువ. ఈ హైవే పూర్తయితే దాదాపు అంతే సమయానికి విమాన చార్జీలకంటే తక్కువ ధరతో రోడ్డు మార్గంలోనే ప్రయాణించే సౌకర్యం కలుగుతుంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943